

రక్తతిలకం

(ప్రఖ్యాతమైన పలనాడు బుర్రకథలు)

సంపాదకులు

ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు



"పద్మశ్రీ" నాజర్ బుర్రకథ దళం
("పుట్టిల్లు" సినిమా)



"పద్మశ్రీ" నాజర్ బుర్రకథ దళం
("అగ్గిరాముడు" సినిమా)

రక్తతిలకం

(ముఖ్యమైన మూడు బుల్లికథలు)



పద్మశ్రీ షేక్ నాజర్ బుఱ్ఱకథ దళము

రక్తతిలకం

(ముఖ్యమైన మూడు బుఱ్ఱకథలు)

పద్మశ్రీ షేక్ నాజర్‌గారి

"పల్నాటియుద్ధం" – "బొబ్బిలియుద్ధం"

సుంకర సత్యనారాయణగారి

"అల్లూరి సీతారామరాజు"

సంపాదకులు, ప్రకాశకులు

ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు

వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీకృష్ణదేవరాయ రసజ్ఞ సమాఖ్య

బెంగుళూరు

2021

Raktatilakam, three important Burrakathalu, edited and published by Prof. T.V. Subba Rao, Founder President Sri Krishnadevaraya Rasajna Samakhya, Bengaluru-560 060.

First Edition : 15-10-2021 (ప్లవనామ సంవత్సర విజయదశమి)

No. of pages: xxii + 134 (Including 20 pages of Colour Photos)

Copies : 500

Price: 120/-

ముఖచిత్రం: "బుర్రకథాపితామహుడు" పద్మశ్రీ షేక్ నాజర్‌గారు (1920–1997)

Published by: **Prof. T.V. Subba Rao**
Founder President
Sri Krishnadevaraya Rasajna Samakhya
No.1708, 'Sitavadhanam'
11th Cross, 1st 'G' Main
Kengeri Satellite Town
BENGALURU - 560 060
Mobile: 99454 22742

Copies Can be had: From all leading Book Shops (like Visalaandhra, Navachetana, Navodaya, Emesco Sahiti, Prajasakti, Nava Telangana & Pallavi Publications)

D.T.P.: **Nagasri Graphics**,
H.No.1-18, Plot No.17, Brindavana Colony
Near Agnimaremma Temple
Gundlasagaram Village, Gudupalli Mandal
Kuppam -517 425; Chittoor District, A.P.
Ph.No.08570-517 825; 8500619283

Printing at: **Omkar Offset Printers**
3/3, 1st Main Road
New Tharagupet
Bengaluru - 560 002.
Phone: 080-26708186; 26709026

అంకితం

1925 నుండి ఈనాటి వరకు నాలుగు తరాలుగా బుఱ్ఱకథాగానం చేస్తున్న ప్రధాన కళాకారులకు – వారి దళములలోని వంతలకు –

కీ.శే. సుంకర సత్యనారాయణ, పద్మశ్రీ షేక్ నాజర్, వారణాసి సత్యనారాయణ శాస్త్రి, దంటు కృష్ణమూర్తి, తిరునగరి రామాంజనేయులు, "నదీరా" మొదలైన ప్రసిద్ధ బుఱ్ఱకథారచయితలకు –

బుఱ్ఱకథ కళాకారులు

మొదటితరం (1920 నుండి 1945 వరకు)

కీ.శే. మోర్జంపాటి పోతువీరయ్యదేవరగారు ("రెంటపాళ్ళ గుడ్డిజంగం")

కీ.శే. దొడ్డవరపు వెంకటస్వామిగారు లేక అమృతము వెంకటస్వామిగారు

కీ.శే. శిర్విశెట్టి సుబ్బారావుగారు

కీ.శే. కాకుమాని సుబ్బారావుగారు

రెండవతరం (1945 నుండి 1975 వరకు)

కీ.శే. పద్మశ్రీ షేక్ నాజర్‌గారు (గుంటూరు)

కీ.శే. నిడదవోలు అచ్యుతరామయ్యగారు (రాజమండ్రి)

కీ.శే. కుమ్మరి మాస్టారు (విజయనగరం)

కమ్మసోదరులు (కడప)

మూడవతరం (1975 నుండి 2000 వరకు)

శ్రీ నిట్టల సోదరులు

శ్రీమతి మహంకాళి బృందం (కాకినాడ)

శ్రీ పండు మాస్టారు

శ్రీ గొట్టెల కృష్ణ

శ్రీ బెనర్జీ దళం (హైదరాబాద్)

నాల్గవతరం (2000 నుండి నేటివరకు)

శ్రీమతి "ఒంగోలు సిస్టర్స్"

శ్రీమతి హేమకుమారి బృందం

శ్రీ షేక్ బాబూజీ దళం (షేక్ నాజర్‌గారి కుమారుడు)

ఇంకా నాకు తెలియని ఎందరో మహానుభావులైన కళాకారులకు...

శ్లో. ప్రాణంవాపి పరిత్యజ్య మానమేవాభిరక్షతు।
అనిత్యో భవతి ప్రాణో మానమాచంద్రతారకమ్॥

(–నీతిశాస్త్రము)

తా॥ ప్రాణం పోగొట్టుకొని అయినాసరే మానాన్ని రక్షించుకోవాలి. ఎందుకంటే – ప్రాణం అనిత్యమైనది; మానం (ఆత్మగౌరవం) ఆచంద్ర తారార్కమూ ఉండునట్టిది.

"రామ రామ రామనంతకాలము రాజ్యము యేలేర?
యుగములు జగములు గలంతకాలము భూములు యేలేర?
తిరిగిపోయి మీ తల్లికడుపునా మళ్ళా పుట్టేర?
చస్తేనూ మన పేరు వుండునూ, బ్రతికితేను లేదు!
చస్తేనూ మన కోటలోపలా మనమే చావాలి!"

(–రాణీ మల్లమదేవి, బొబ్బిలికథ)

"ఈ పొద్దిదియా రేపు తదియా నరుని ప్రాణమోయి!
నీటి మీదనూ బుగ్గతోడిదీ నరాశరీరమ్ము!
ఏలబోయి యీ ప్రాపంచంలో మరల ఏలబోము!
పుట్టబోయి మన తల్లికడుపునా మళ్ళీ పుట్టేమా?"

(–ఉయ్యాలవాడ నరసింహారెడ్డికథ)

తిలకశోభ

(విషయ సూచిక)

వీరపాణం (పీఠిక)

– ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు viii

1. బుఱ్ఱకథలు

1.1. పల్నాటియుద్ధం
(రచన–1945)
–షేక్ నాజర్ 1

1.2. బొబ్బిలియుద్ధం
(ప్రథమ ముద్రణ–1959)
–షేక్ నాజర్ 31

1.3. అల్లూరి సీతారామరాజు
(ప్రథమ ముద్రణ–1953)
– సుంకర సత్యనారాయణ 65

అనుబంధం:–1

కీ.శే. సుంకర సత్యనారాయణగారు (1909–1975) 108

అనుబంధం:–2

కీ.శే. పద్మశ్రీ షేక్ నాజర్‌గారు (1920–1997) 109

పీఠిక:

వీరపాణం

– తంగిరాల వెంకట సుబ్బారావు

వీరగాథానుకరణములు – బుర్రకథలు

సాంప్రదాయక వీరగాథలను – ముఖ్యంగా జంగంకథలను – అనుకరిస్తూ రెండవ ప్రపంచ యుద్ధకాలంలో (1942 ప్రాంతంలో) గుంటూరుజిల్లానుండి బుర్రకథలు వ్యాప్తిలోకి వచ్చాయి. కమ్యూనిస్టులు తమ రాజకీయ సిద్ధాంత ప్రచారం కోసం, ప్రధానంగా జంగంకథలను అనుకరిస్తూ వీటిని సృష్టించారు. ప్రాచీన కాలంలోని యక్షగానాలే బుర్రకథలుగా పరిణమించాయని ప్రముఖ బుర్రకథా గాయకులైన షేక్ నాజర్‌గారి అభిప్రాయం. అయితే, నా పరిశీలనలో యక్షగాన రచనకూ – జంగంకథారచనకూ ఏమీ తేడా కనిపించలేదు. రచనా స్వరూపంలో రెండూ ఒకటే. కాబట్టి నాగర్‌గారి వాదనా – నా వాదనా ఒకటే అవుతుంది.

తంత్రి + బుర్ర = తంబుఱ. తంబుఱతో చెప్పే కథలు కాబట్టి 'తంబుఱకథలు". (పూర్వం ఈ పేరే ప్రచారంలో ఉండేది.) ఈ సమాసంలోని 'తం' లోపించి, శకటరేఫకు పూర్వపు ద్విత్వం వచ్చి, "బుర్రకథలు" అనే పేరు ఏర్పడి ఉంటుంది. లేదా గుమ్మెటలకు గుంటూరుజిల్లాలో "బుర్రలు" అనే వ్యవహారం ఉందట. బుర్రలు వాయిస్తూ చెప్పేకథలు కాబట్టి "బుర్రకథలు" అనే పేరు వచ్చి ఉంటుంది. నాజరుగారు తన "పల్నాటియుద్ధం" – "బొబ్బిలియుద్ధం" బుర్రకథలను కథాప్రారంభంలో "తంబుఱకథలు" అనే పేర్కొన్నారు:– "జోడుగుమ్మెటలు తాధిమియనగ /తోడుగ వంతలు జోరుగ పాడగ / రాగతాళ గీతాది నృత్యముల/ తంబుఱకథ వినుడీ!" (పల్నాటియుద్ధం). "రాగతాళ నృత్యాదులమరగన్/ తంబుఱ కథగానంబు చేసెదన్" (బొబ్బిలియుద్ధం).

బుర్రకథలు ప్రధానంగా 'జంగంరగడ'లో రచింపబడినా, పదములలోని "జంపెవరుస", పల్నాటి వీరచరిత్ర, కాటమరాజుచరిత్రలలోని "ద్విపద" – "మంజరీ ద్విపద", ఆరె మరాటీల కథలోని "సైసై వరుస", సర్వాయి పాపడు కథలోని "ఏల వరుస" మొదలైనవి కూడా ఆయా రసాలకు అనుగుణంగా ఉపయోగిస్తూ ఉంటారు.

ప్రాచీనకాలంలో వీరశైవులు, ఆధునికకాలంలో కమ్యూనిస్టులు తమ తమ సిద్ధాంతాల ప్రచారంకోసం వీరగాథలను ఇతర జానపద కళారూపాలను బాగా ఉపయోగించుకున్నారు. బుర్రకథలలో మొదట రాజకీయ సంఘటనలు, జాతీయోద్యమ

నాయకుల జీవితచరిత్రలు ఇతివృత్తాలుగా ఉండేవి. కాలక్రమంలో పౌరాణిక, చారిత్రక, సాంఘిక ఇతివృత్తాలు కూడా చోటుచేసుకున్నాయి. "బాబూరావు బుఱ్ఱకథ, టాన్యా, కష్టజీవి, బెంగాల్ కరవు, రైతువిజయం, కట్నంలేని కమలమ్మ పెండ్లి, గాంధీజీ, నేతాజీ, నెహ్రూజీ, అల్లూరి సీతారామరాజు, మహారథి కర్ణ, వీరాభిమన్యు, బొబ్బిలియుద్ధం, రుద్రమదేవి" మొదలైనవి కొన్ని ప్రసిద్ధమైన బుఱ్ఱకథలు.

కాకుమాని సుబ్బారావు, సుంకర సత్యనారాయణ, షేక్ నాజర్, వారణాసి సత్యనారాయణశాస్త్రి, దంటు కృష్ణమూర్తి, తిరునగరి రామాంజనేయులు, నదీరా – మొదలైనవారు ప్రసిద్ధ బుఱ్ఱకథా రచయితలు.

బుఱ్ఱకథాగానం ఆనాటినుండి (1942 నుండి) ఈనాటివరకూ అవిచ్ఛిన్నంగా కొనసాగూతూనే ఉంది. ఎన్నో బుఱ్ఱకథదళాలు తెలుగుశ్రోతల్ని ఉర్రూత లూగించాయి. పద్మశ్రీ షేక్ నాజర్గారు బుఱ్ఱకథాగానానికి ఎంతో ప్రాచుర్యం తీసుకొనివచ్చారు. వీరిని "బుఱ్ఱకథా పితామహుడు"గా కీర్తిస్తూ ఉంటారు. కాని యితని కన్నా ముందుగా నలుగురు మహానుభావులు బుఱ్ఱకథాగానాన్ని ఆంధ్రదేశంలో వ్యాపింపజేశారు. వారిలో "మోర్జంపాటి పోతువీరయ్యదేవర" అనే పుట్టుగ్రుడ్డి మొట్టమొదటివాడు. ఈయనను "రెంటపాళ్ళ గుడ్డిజంగం" అని పిలిచేవారు. నిజానికి ఇతడే "బుఱ్ఱకథా పితామహుడు" అని, నాజర్దళంలో వంతపాడిన ప్రసిద్ధ జానపద కళాకారులు కర్నాటి లక్ష్మీనరసయ్యగారు (బెజవాడ) నా దగ్గర తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ "రెంటపాళ్ళ గుడ్డిజంగం" తరువాత "దొడ్డవరపు వెంకటస్వామి" లేక "అమృతము వెంకటస్వామి" – "శిర్విశెట్టి సుబ్బారావు" – "కాకుమాని సుబ్బారావు" బుఱ్ఱకథాగానంలో ఆరితేరినవారని లక్ష్మీనరసయ్యగారు నాకు వివరించారు. (వారికి నా కృతజ్ఞతలు).

పై నలుగురూ బుఱ్ఱకథాగానంలో మొదటితరానికి (1925–1945) చెందిన మహానుభావులు. తరువాత రెండవతరంలో (1945–1975) షేక్ నాజర్ (గుంటూరు) – నిడుదవోలు అచ్యుతరామయ్య (రాజమండ్రి) – కుమ్మరి మాస్టారు (విజయనగరం)– కమ్మసోదరులు (కడప) – సుప్రసిద్ధులు. మూడవ తరంలో (1975–2000) నిట్టల సోదరులు – గొట్టెల కృష్ణ – పండుమాస్టారు – శ్రీమతి మహంకాళి బృందం (కాకినాడ) – కీర్తి గడించారు. నేడు (2000 తరువాత) శ్రీమతులు "ఒంగోలు సిస్టర్స్" – శ్రీమతి హేమకుమారి – శ్రీ షేక్ బాబూజీ (షేక్ నాజరుగారి కుమారుడు) మొదలైనవారు పేరుపొందినవారు.

ప్రాచీన వీరగాథలు పాడే వృత్తిగాయకులు ఆధునిక నాగరకతాయుగంలో కనుమరుగై పోయారు. కాబట్టి వాటి స్వరూపాన్ని తెలుసుకోవాలంటే ఇప్పుడు ఈ బుఱ్ఱకథాగానం వినడం తప్ప, మనకు మరో మార్గం లేదు.

మొదట "టాన్యా" (రష్యాలోని వీరబాలిక పేరు) వంటి రెండవ ప్రపంచ యుద్ధ సంఘటనలు, తరువాత 'కష్టజీవి' వంటి రైతుకూలీ ఉద్యమాలు బుఱ్ఱకథలలో చోటుచేసుకున్నాయి. తరువాత గాంధీజీ, నేతాజీ, నెహ్రూజీ, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి జాతీయోద్యమనాయకుల చరిత్రలు బుఱ్ఱకథావస్తువు లయ్యాయి. పిమ్మట క్రమక్రమంగా "మహారథి కర్ణ" – "వీరాభిమన్యు" వంటి ఇతిహాసగాథలు; "రుద్రమదేవి"–"శివాజీ"–ఝాన్సీరాణి" వంటి చారిత్రక గాథలు; "పల్నాటియుద్ధం" –"బొబ్బిలియుద్ధం" వంటి ప్రసిద్ధ సాంప్రదాయక వీరగాథలు బుఱ్ఱకథలుగా అవతరించాయి.

1. పల్నాటియుద్ధం

ఇది తెలుగులో మిక్కిలి ప్రసిద్ధమైన వీరగాథాచక్రం; 25 వీరగాథలతో కూడిన పెద్ద జానపదేతిహాసం. "వీరవిద్యావంతులు" అనే వృత్తిగాయకులు దీనిని రెండు నెలలపాటు పాడుతారు. ఈ తెలుగు వీరుల ఇతిహాసాన్నంతటినీ, బుఱ్ఱకథా గానంలో ప్రసిద్ధికెక్కిన షేక్‌నాజర్‌గారు సంక్షిప్తంగా, రెండు గంటలలో పూర్తి అయ్యేలా ఒక బుఱ్ఱకథగా 1945లో రచించారు. (ఈ సంక్షిప్తత వలన కథ చాలా వేగంగా పరుగులు పెట్టింది.) దీనిని నాజరుగారు సొంతంగా పాడి ప్రజలలో వ్యాప్తి చేశారు. ఈయన స్వయంగా బుఱ్ఱకథకుడు కాబట్టి, మిక్కిలి నాటకీయంగా, ప్రదర్శనయోగ్యంగా రచించారు. ఈ బుఱ్ఱకథ వీరరసస్ఫోరకంగాను, అభ్యుదయభావసంభరితంగాను, అద్భుతపాత్రచిత్రణతోను కొనసాగింది. యక్షగానాలలోను, వీరగాథలలోను తరచుగా ప్రయోగింపబడే ప్రసిద్ధ ఛందస్సులన్నీ దీనిలో చోటుచేసుకున్నాయి.

పల్నాటి వీరచరిత్ర కథ తెలుగువారందరికీ తెలిసిందే. అయినా, రేఖామాత్రంగా తెలియజేస్తాను. క్రీ.శ. 12వ శతాబ్దిలో హైహయరాజులు పల్నాటి సీమను పాలించారు. నలగాముడు, మలిదేవుడు ఈ వంశానికి చెందినవారే. వీరి తండ్రి అనుగురాజు (క్రీ.శ. 1134–1147) గురిజాల రాజధానిగా పల్నాటి సీమను పాలించాడు. ఇతనికి ముగ్గురు భార్యలు: మైలమదేవి, వీరవిద్యలదేవి, భూరమాదేవి. వీరిలో మైలమదేవికి ఒకే ఒక్క కొడుకు: నలగామరాజు. భూరమాదేవికి నలుగురు కొడుకులు: కామరాజు, నరసింగరాజు, ఝట్టిరాజు (గట్టురాజు), పెరుమాళ్ళరాజు. వీరవిద్యలదేవికి ముగ్గురు

కొడుకులు: పెదమలిదేవుడు, పినమలిదేవుడు, బాలమలిదేవుడు. అనుగురాజు మంత్రి దొడ్డనాయడు; సేనాని తెప్పలినీడు. దొడ్డనాయని కొడుకు బ్రహ్మనాయడు. తెప్పలినీడి కొడుకు కన్నమనీడు (కన్నమదాసు). అనుగురాజు తరువాత అన్నదమ్ము లందరిలోను పెద్దవాడైన నలగాముడు (క్రీ.శ 1147–1163) రాజయ్యాడు. ఇతనికి బ్రహ్మనాయడు మంత్రి; కన్నమదాసు సేనాని. 'జిట్టగామాలపాడు' గ్రామానికి చెందిన నాగమ్మ అనే వీరవనిత తన ప్రజ్ఞాపాటవాలతో నలగాముని కొలువులో ప్రవేశించి మంత్రిణి అయింది. "నాయకురాలు" అనే బిరుదాన్ని వహించి, క్రమంగా నలగాముని తన గుప్పిట్లో పెట్టుకుంది. మలిదేవరాజులను చెరసాలలో పెట్టించి చంపడానికి ప్రయత్నించింది. మంత్రి బ్రహ్మనాయడు, సేనాని కన్నమదాసు తిరుగుబాటు చేసి, మలిదేవరాజులను విడిపించి, వారికి మాచెర్ల రాజ్యాన్ని పంచి ఇప్పించారు. బ్రహ్మనాయడు మంత్రిగా, కన్నమదాసు సేనానిగా పెదమలిదేవుడు మాచెర్లను పాలిస్తున్నాడు.

నాయకురాలు నాగమ్మకు – బ్రహ్మనాయనికి పగలు పంతాలు పెరిగిపోయాయి. నాగమ్మ నలగాముని ద్వారా మలిదేవుని బ్రహ్మనాయని కోడిపందానికి పిలిపించింది. మాయోపాయంతో కోడిపందెంలో గెలిచి, మాచర్ల రాజ్యాన్ని లాక్కుంటుంది. ఒప్పందం ప్రకారం, బ్రహ్మనాయడు మలిదేవాదులతో కలిసి ఏడేళ్ళు అరణ్యవాసం చేస్తాడు. తరువాత తమరాజ్యభాగాన్ని తమకు ఇమ్మని, నలగాముని అల్లుడైన అలరాజును రాయబారిగా పంపుతాడు. నాగమ్మ, నరసింగరాజు కలిసి, విషప్రయోగం చేసి, అలరాజును చంపుతారు. ఫలితంగా ఇరుపక్షాలవారికి కారెంపూడి రణరంగంలో యుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో బ్రహ్మనాయని కుమారుడు బాలచంద్రుడు మహాపరాక్రమాన్ని ప్రదర్శించి, నరసింగరాజు తల నరికి, పగ తీర్చుకుంటాడు. పల్నాటి వీరులందరూ చనిపోతారు. ఒక వైపు బ్రహ్మనాయడు, కన్నమదాసు; మరొకవైపు నలగాముడు, నాయకురాలు నాగమ్మ మిగులుతారు. నలగాముడు బ్రహ్మనాయని శరణుకోరుతాడు. బ్రహ్మనాయడు అతనిని క్షమించి, తిరిగి రాజును చేసి; నాగమ్మను మంత్రిణిగా, కన్నమదాసును సేనానిగా నియమించి, తాను తపస్సు చేసుకోడానికి గుత్తికొండ బిలాన్ని ప్రవేశిస్తాడు.

నాజర్‌గారు కథలోని కొన్ని ప్రధాన సంఘటనలను మార్చివేశారు. అనుగురాజు మంత్రి దొడ్డనాయడయితే, బ్రహ్మనాయడని వ్రాశారు. నాయకురాలు "కట్టుబోతుల గంగవరం" నుండి మంత్రగాళ్ళను పిలిపించి, మాచెర్లకోడిపుంజుపై మంత్రాక్షతలు

చల్లించింది. ఆ పుంజు పోట్లాడలేక ఓడిపోయింది. ఈ సంఘటన మార్చివేశారు నాజర్. నాయకురాలు నాగమ్మ జుట్టు విరబోసుకొని పెద్దపెద్ద కేకలు వేస్తూ గంతులు వేస్తుంటే బ్రహ్మనాయుడు ఆమెవైపు చూడలేక తలవంచుకున్నాడని, ఆ సమయంలో కన్నుగీటగా మువ్వల భీమన్న పెట్టమారి కోడిపుంజును వదిలాడని, అది మాచెర్ల పుంజును ఓడించిందని మార్చారు నాజర్. ఆయన హేతువాది, నాస్తికుడు కావడంవల్ల మంత్రాక్షతల ప్రభావాన్ని నమ్మకుండా ఈ మార్పు చేసి ఉండవచ్చును. అలాగే నాగమ్మ ముందుగా అలరాజుకు విషాన్నం పంపిస్తుంది. కన్నమదాసు హెచ్చరించడంతో అతడు దానిని తినడు. తరువాత "తంబళ్ళపెద్దు" అనే శివపూజారి చేత విషముచల్లిన పూలగుత్తులను పంపిస్తుంది. "చెర్లగుడిపాడు" దగ్గర ఆ పూలగుత్తులను అందుకున్న అలరాజు వాటిని ఆఘ్రాణించి, విషము తలకెక్కి చనిపోతాడు. కన్నమదాసు గురిజాలకు వెళ్ళి రత్నాల పేరమ్మను పిలుచుకొని వస్తాడు. ఇదీ జరిగిన విషయం. కాని నాజర్‌గారు ఈ సంఘటన అంతా మార్చివేసి, నరసింగరాజు అలరాజును కత్తితో పొడిచి చంపినట్లుగా వ్రాశారు. ఇది సరికాదు. అలరాజు మహాబలశాలి; నరసింగరాజు లాంటి వాళ్ళను వందమందినైనా ఒక్కడే చంపగలడు. పైగా మహావీరుడు కన్నమదాసు అతనికి అంగరక్షకుడుగా ఉన్నాడు. అలరాజు భార్యపేరు: "రత్నాల పేరమ్మ". దీనిని నాజర్ "పెరిందేవి"గా చెప్పారు. గణంకోసం "పేరిందేవి" > "పెరిందేవి"గా మారింది.

(i) నాయకురాలు నాగమ్మ శౌర్యప్రతాపాల వర్ణన ఎంత రసోద్రేకంగా సాగిందో చూడండి :-

"చిన్ననాడె విల్లు బట్టెరా – సై॥ , చిన్నప్డె విల్లెక్కు బెట్టెరా – సై॥
నింగిలో పిట్టనే గొట్టెరా – సై॥ , నీటిలో చేపనే గొట్టిందా – ॥భళానంటి॥
అల్లనాడె కత్తి దూసెరా – సై॥ , అల్లపుడె సాములకు డాసెరా– సై॥
కత్తికదిలే తీరు గాంచితే – సై॥ , కన్నులకు మిరుమిట్లు గొలిపేనా ॥భళానంటి॥
గుఱ్రమెక్కి కత్తి బట్టితే – సై॥ , గుఱ్రానికే భీతి లేదురా – సై॥
పరవళ్ళు తొక్కెను గుఱ్రము–సై॥ , పైపైకి లేచెను గుఱ్రము – సై॥
కత్తిఢాలు చేతబట్టెను – సై॥ , బాకు బల్లెము చేతబట్టెను – సై॥
విల్లునంబులు చేతబట్టెను –సై॥ , పంచకాల్యాణినే ఎక్కిందా–॥భళానంటి॥
తలతోక కాపాడు కత్తిరా–సై॥ , తళతళా మెరిసేటి కత్తిరా – సై॥
కాలాహి నాలుకా కత్తేరా–సై॥ , శత్రుసేనకు అదియు మిత్తేరా" ॥భళానంటి॥

(ii) కోడిపందాల వర్ణన - మాచెర్ల దొరలు

"భగ్గుభగ్గునే మండిరీ - సై ॥ , పట్టి మీసముల దువ్విరీ - సై॥
కరకర కోరలు నూరిరా -సై॥ , కాకిడేగనే దించారా - ॥ భళానంటి ॥
నీటైన బ్రహ్మయ్య డేగరా-సై॥ , అరవడి పరవడి జేసెరా - సై॥
తాటించి తన్నాసాగెరా-సై॥ , నాగమ్మకోడి సోదరా-సై॥
తథక్కథోం -
కావుకావుమని అరిచిందా - కాలికి బుద్ధీ చెప్పిందా- ॥భళానంటి॥
తవుడు మేసినా కోడీరా - తన్నుకు పారీ పోయిందా-॥భళానంటి॥
పలనాటి మిద్దెలకు వాసాలు లేవు - ॥తందాన॥
కొండేటి బ్రాహ్మలకు మీసాలు లేవు - ॥తందాన॥
గురిజాల కోళ్ళకి రోషాలు లేవయ్యా - ॥తందాన॥

(iii) పల్నాటి యుద్ధవర్ణన - బాలుని శౌర్యం

"పటపట పటపట పండ్లు కొరుకుచును - పటుతరగతి వేగ
కటకట కటకట కోరలొరిపిడికి - చిటపటయని నిప్పుల్
రెట్టలు దట్టుచు అరెరేరేయని - మిట్టిపడుచు వేగ
పొట్టి మీసములు పట్టిదువ్వి - కనుబొమలు ముడియబెట్టి,
పతాకత్తులూ కతార్లు బాకులు - తటాలు నందుకొని
పెఠిల్లుమని కక్కటిల్లుచును - దిక్తటంబులదరగను
గండ్రగొడ్డండ్లు కత్తులు బాణా - కర్రలు చేబూని
వేండ్రయైన రోకండ్లు గుదపలును - భిండివాలములును
తళతళ నాకసమందు మెరయగా - తలపడె నిరువాగుల్
కరులు సేనలను నురుమాడుచు - మున్ముందుకేగుచుండ
రణభ్భేరి ధణధణలకు ధరణి - దద్దరిల్లుచుండ
శరవేగంబున శత్రుసేనలో - చొరబడి బాలుండు
ధరణిమీద నరివీరుల తలలు - తరుగుచు బాలుండు
విచ్చుకత్తి నరివీరుల రొమ్ముల - కుమ్మి చిమ్ముచుండ
గుండెలు ప్రేవులు ఒక్కుమ్మడిగా - తుండెములై జార
కొండల రీతిగ శవములన్నియును - గుట్టలు బడుచుండ
నెత్తురు చిమ్ముచు తలలు మొండెములు దొర్లాడుచునుండ
శత్రుసేనలూ బెదరి చెదరెనూ - చెట్లకు గుట్టలకు."

2. బొబ్బిలియుద్ధం

ఇది ఆంధ్రదేశంలో మిక్కిలి ప్రసిద్ధికెక్కిన వీరగాథ. మాలదాసరులు, జంగములు దీనిని వీరావేశంతో పాడుతూ ఉంటారు. ఈ కథ తెలియని లేదా పాడగావినని తెలుగువాడు లేడు. క్రీ.శ. 18వ శతాబ్ది మధ్యభాగంలో విజయనగరాన్ని పూసపాటి విజయరామరాజు, బొబ్బిలికోటను రావు రంగారావు పరిపాలిస్తున్నారు. ఈ రెండు సంస్థానాల మధ్య చాలాకాలంగా పగలు, ద్వేషాలు ఉన్నాయి. మొదట ఇవి గోల్కొండ నవాబుల క్రింద సామంతరాజ్యాలు. తరువాత ఆ నవాబు ఒక ఒప్పందం ప్రకారం ఈ ఉత్తరసర్కారు ప్రాంతాలన్నింటినీ ఫ్రెంచివారికి దఖలు చేశాడు. ఈ ప్రాంతాలలో తమకు రావలసిన కప్పం వసూలు చేయడానికి ఫ్రెంచిసేనాని బుస్సీ వస్తాడు. అతనికి తోడుగా నవాబు కొలువులో ఉండే హైదర్‌జంగ్ కూడా వస్తాడు. బుస్సీ రాజమహేంద్రవరంలో మకాం చేసి, విజయరామరాజుకి రంగారావుకి లేఖలు పంపుతాడు. ఇదే అదనుగా భావించి, విజయరామరాజు బొబ్బిలి కోటపై పగతీర్చుకోవాలనుకుంటాడు. బొబ్బిలివారి లేఖను కూడా తానే అందుకొని, దానిని తొక్కిపెడతాడు. అందువల్ల బుస్సీ పంపిన వర్తమానం బొబ్బిలివారికి తెలియదు. విజయరామరాజు రాజమహేంద్రవరం వెళ్ళి, బుస్సీకి హైదర్‌జంగ్‌కు లంచాలు ఇచ్చి వారిని తన వైపు త్రిప్పుకుంటాడు. బొబ్బిలివారిపై బుస్సీకి చాడీలు చెపుతాడు. బొబ్బిలికోటను తన పేర ఫర్మానా వ్రాయించుకుంటాడు. బుస్సీతో కలిసి బొబ్బిలి వచ్చి, కోటను ముట్టడిస్తాడు.

బొబ్బిలి కోటను ఖాళీచేసి, పాలకొండకు వలసలు పోవలసిందిగా బుస్సీ రావు రంగారావును ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు రంగారావు తన మంత్రి ధర్మారావును బుస్సీ దగ్గరకు రాయబారిగా పంపుతాడు. బుస్సీ పంపిన వర్తమానం తమకు చేరలేదనీ, అందువల్ల తాము రాజమహేంద్రవరం రాలేకపోయామనీ, తాము చెల్లించవలసిన కప్పం అంతా చెల్లిస్తామనీ, రాజమహేంద్రవరం వచ్చి బుస్సీని కలవనందుకు జుల్మానా కూడా కడతామనీ రాయబారి చెపుతాడు. విజయ రామరాజు దగ్గర లంచాలు మెక్కిన బుస్సీ అంగీకరించడు. దీనితో యుద్ధం అనివార్యమవుతుంది. బొబ్బిలి వీరులు తమ అంతఃపురస్త్రీలనందరిని (బాలబాలికలతో సహా) అగ్నికి ఆహుతిచేసి, ప్రాణాలకు తెగించి రణరంగంలోకి దూకుతారు. కేవలం 250 మంది బొబ్బిలివీరులు, విజయరామరాజుగారి 10వేల సైన్యంతోను, ఫ్రెంచివారి 250 గుర్రపుదళంతోను, 750 కాల్బలంతోనూ ఘోరమైన యుద్ధంచేసి, ఆత్మబలిదానం చేస్తారు. బొబ్బిలివీరుల

శౌర్యప్రతాపాలకు బుస్సీ ఆశ్చర్యపోతాడు. శత్రువులుకూడా బొబ్బిలికోటలో జరిగిన దుర్భరవిషాదానికి కంటతడిపెడతారు. అదే రాత్రి రంగారావు బావమరది తాంద్ర పాపారాయుడు రాజాంకోటనుండి వచ్చి, విజయరామరాజుగారి డేరాలో ప్రవేశించి, ఆతనిని పొడిచి చంపి పగతీర్చుకుంటాడు.

ఈ బొబ్బిలి యుద్ధం క్రీ.శ. 1757 జనవరి 24వ తేదీ శుక్రవారంనాడు తెల్లవారుజామున ప్రారంభమై సాయంకాలానికి కోటంతా బూడిద బుంగలుగా మారిపోయింది! అదే కాలానికి చెందిన "రాబర్ట్ ఆర్మ్" (క్రీ.శ. 1728–1801) అనే చరిత్రకారుడు బొబ్బిలి యుద్ధాన్నంతటినీ కళ్ళకు కట్టినట్లుగా వర్ణించాడు. (చూ. మల్లంపల్లి సోమశేఖర శర్మగారి 'బొబ్బిలి యుద్ధకథ' పీఠిక).

ఈ ప్రసిద్ధ వీరగాథను షేక్ నాజర్‌గారు బుఱ్ఱకథగా మలిచారు. దీని మొదటి ముద్రణ 1959లో జరిగింది. పల్నాటియుద్ధం బుఱ్ఱకథలాగే దీనిని కూడా నాజర్‌గారు సొంతంగా పాడి ప్రచారంలోకి తెచ్చారు. ఈ బుఱ్ఱకథా రచన వీరరసప్లావితమై చక్కగా సాగింది.

(i) బొబ్బిలి వీరుల రణోత్సాహ వర్ణన

"పఠాల్ రామన్న లేచెరా – సై॥ , పఠాకత్తి ఝళిపించెరా – సై॥
ముత్యాల పాపన్న చూచెరా–సై॥ , ముకుంద బల్లెం దూసేరా – ॥భళానంటి॥
భేరీ రామక్క లేచెరా – సై॥ , బేరీ స్త్రీల నదల్చెరా – సై॥
ధీరత వడిశాల్లందిరా–సై ॥ , కారమే అడ్డొళ్ళ గట్టారా – ॥భళానంటి॥
వీరసైనికుల్లేచిరా – సై॥ , పారసీ గుర్రాలెక్కిరా – సై॥
గుర్రాల్ సైగల నందెరా–సై॥ , కాలుగీటి సకిలించాయా – ॥భళానంటి॥
తథిగిణథోం –
గుప్పట గుప్పట దూకాయా
పిప్పిగ శత్రుల దొక్కాయా – ॥భళానంటి॥
కత్తి గుండెలో గుచ్చారా
చిటపట చిటపట వడిశలరాళ్ళు
చిత్తజల్లుగ కురిపించారా – ॥భళానంటి॥
పెఠిల్ పెఠిల్‌మని శత్రుశిరస్సులు – పెట్లుచుండెనన్నా
పఠాకత్తితో కుమ్మి చిమ్మెరా–పఠాల రామన్న
ముకుందబల్లెం కుమ్మి చిమ్మెరా – ముత్యాల్ పాపన్న
ముక్కముక్కలుగ శాత్రవులను – రామక్క నరికెనన్నా॥

(ii) శూరశిఖామణియై బొబ్బిలి ప్రభువు రావు రంగారావు రణరంగంలో చేసిన వీరవిహారవర్ణన అత్యద్భుతంగా సాగింది. రంగారావు పరాసుదండును మట్టుపెట్టిన విధం చూడండి:–

"సర్రున ఖడ్గం దూసి దండుపై – తారసిల్లినాడు
అర్రులు తెగి గుర్రాల పుర్రెలు – ధరణిదొర్ల నరికె
కండలు మొండులు గుండెలు ప్రేవులు – తుండెములై జార
దండధరునివలె తుండెతుండెములు – ఖండిస్తున్నాడా
జబ్బలు దొబ్బలు రక్తంగ్రక్కుచు – దిబ్బలు దిబ్బలుగా
సిబ్బందిని పడనరుకుచుండెనా – బెబ్బులి రంగరావు
తట్టకోటలో పరాసుదండును – తరిమె రంగరావు
పుట్టకోటలో పరాసు దండును – పొడిచె రంగరావు
మూలబురుజులో పరాసుదండును – కూల్చె రంగరావు
కలవరింతలతొ పరాసుదండు – కలవరపడసాగె
అబ్బో కుయ్యో మొర్రో అంటూ – అరచుచు శాత్రవులు
పాలకొండలకు పారజూసిరా – బుస్సి రామరాజుల్!"

(iii) బొబ్బిలి పంటపొలాల్లో పనిచేసుకొనే రైతుకూలీలు ఆనందంగా పాడుకొనే పాటలను జానపదబాణీల్లో ఎంతో అందంగా వ్రాశారు నాజర్. ఒక తుమ్మెద పదం చూడండి:–

"ఆడేటి పాడేటి తుమ్మెదా– వాన
జాడల్లు జూపేటి తుమ్మెదా!
సువర్ణముఖి పొంగి తుమ్మెదా – మాకు
నవరత్నములు పండు తుమ్మెదా!
వ్యాగావతి పారి తుమ్మెదా – ఢిల్లి
భోగాలు పండాలి తుమ్మెదా!
మగనాలు నాటింది తుమ్మెదా – చేను
తెగపండి ఒరిగింది తుమ్మెదా!
చేనుగట్టున చూడు తుమ్మెదా – పెద్ద
ఏనుగంతున్నాడె తుమ్మెదా!
మునుం వెనకాయనే తుమ్మెదా – అబ్బ
నడుము కొర్రాయెనే తుమ్మెదా!"

ఇక్కడ చేనుగట్టుమీదున్న 'పెద్ద ఏనుగు' అంటే వారిచేత కఠినంగా పని చేయిస్తున్న రైతు!

నాజరుగారు బుఱ్ఱకథాప్రక్రియ యక్షగానంలోంచి వచ్చిందనే నమ్మకంతో, యక్షగానంలో ఉండే "దరువులు" – "కందార్ధాలు" – "అర్ధచంద్రికలు" – "రగడలు"– "ద్విపదలు" – "పాటలు" మొదలైనవి తన బుఱ్ఱకథలలో – ముఖ్యంగా "బొబ్బిలియుద్ధం"లో ప్రవేశపెట్టారు. తేటగీతులు, ఆటవెలదులు, సీసపద్యాలు, కందపద్యాలు కూడా వ్రాశారు. కాని యీ ఛందోబద్ధ రచనలలో కొన్నిచోట్ల గణభంగాలు, యతిభంగాలు, ప్రాసదోషాలు దొర్లాయి. వాటి నన్నింటిని నేను, నా శిష్యులు, ప్రముఖ పండితకవులు, "యుగళ సహస్రావధాని" అయిన డా॥ కడిమిళ్ళ వరప్రసాద్‌గారికి చూపించి సరిచేయించాను. వరప్రసాద్‌గారికి నా అనంతమైన ఆశీస్సులు...

3. అల్లూరి సీతారామరాజు మన్యం విప్లవం

భారత స్వాతంత్ర్యంకోసం అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లాలో భద్రాచలం సమీపంలోని అడవులలో ఉన్న కోయలు, చెంచులు మొదలైన గిరిజనులను సమీకరించి, 1922–24 మధ్య బ్రిటిషు ప్రభుత్వంపై పెద్ద విప్లవాన్ని లేవదీశాడు. గాము గంటందొర, గాము మల్లుదొర, అగ్గిరాజు, పడాలు మొదలైన గెరిల్లా యోధులు రామరాజు సైన్యంలో ఉండి, తెల్లవారితో గొప్ప యుద్ధం చేశారు. బ్రిటిషువారు మొదట రిజర్వు పోలీసుదళాలను పంపారు. రామరాజు గెరిల్లా సైన్యం అర్ధరాత్రి వారి తుపాకుల్ని దోచుకొని తరిమికొట్టింది. తరువాత ఆంగ్లేయులు గెరిల్లా పోరాటంలో నిపుణులైన "కవర్టు–హైటరు" అను తెల్లదొరల నాయకత్వంలో మలబారు సైనిక దళాలను మన్యంలోకి పంపారు. రామరాజు, మల్లుసోదరులను పడాలును పంపి, సేనానులైన కవర్టును హైటరును చంపివేశాడు. తక్కిన సైనికులు భయపడి పారిపోయారు. సీతారామరాజు చేస్తున్న గెరిల్లా యుద్ధానికి బ్రటిషు ప్రభుత్వం భయపడిపోయి, మరతుపాకులతో మరఫిరంగులతో ఘూర్కా సేనలను, ఆంగ్ల సైనికులను, గుఱ్ఱపుదళాలను అసంఖ్యాకంగా అడవిలో దింపింది. అయినా సరే గెరిల్లా పోరాటంలో ఆరితేరిన రామరాజుతో యుద్ధం చేయలేకపోయింది. ఏమీ చేయలేక ఉక్రోషంతో గిరిజన గూడెములను దగ్ధం చేసి, స్త్రీలను బాలురను హింసించడం మొదలుపెట్టింది. రామరాజుయొక్క గెరిల్లాయోధులు ప్రాణాలకు తెగించి ఆంగ్లసైన్యాలతో యుద్ధం చేశారు. అందరూ ఆత్మబలిదానాలు చేశారు. గాము మల్లుదొర పట్టుబడ్డాడు. సీతారామరాజు

జాడ చెప్పండని ఆంగ్లసైనికులు గిరిజనులను చిత్రహింసలు పెట్టడం మొదలుపెట్టారు. తన మూలంగా అమాయకులైన ఆటవిక ప్రజలు బాధలు పడటం చూడలేక, సీతారామరాజు స్వయంగా వచ్చి ఆంగ్లసైన్యాలకు లొంగిపోయాడు. వారు ఆయనపై కేసుపెట్టి విచారించకుండానే అన్యాయంగా కాల్చిచంపారు.

సీతారామరాజు చేసిన ఈ మహత్తరమైన గెరిల్లా పోరాటాన్ని ప్రసిద్ధ అభ్యుదయ రచయిత సుంకర సత్యనారాయణగారు చక్కటి బుఱ్ఱకథగా రచించారు. దీని ప్రథమ ముద్రణ 1953లో వచ్చింది. బుఱ్ఱకథాగానంలో నాజర్ ఎంత గొప్పవాడో, బుఱ్ఱకథారచనలో సుంకర అంత గొప్పవాడు! బుఱ్ఱకథారచనకు ఈ అల్లూరి సీతారామరాజు బుఱ్ఱకథ ఒక లక్షణగ్రంథమని చెప్పవచ్చును. సాహిత్యపరంగా ఇంత ఉత్తమమైన బుఱ్ఱకథ మరొకటి లేదు. దీంట్లో చాలా గొప్ప కవిత్వం మనకు అడుగడుగునా ప్రత్యక్షమవుతుంది. ఆనాటి జాతీయోద్యమానికి ఇది ప్రతిబింబమైన రచన:-

(i) గోదావరీ తీరంలోని అరణ్య సౌందర్యవర్ణన

“నగశిఖరంబులనుండి దూకుటా – నదులకు అలవాటు
సొగసుగ తుంపరలట తుషారమన – నెగసి యాడుచుండు
చలవలీను తుంపరల దోచుకొని – జలకమాడియందు
మలయమారుతము విహరించును ఆ – మన్యభూములందు
కానన సంతానంబును బ్రోచుచు – నానందము నిచ్చు
ప్రాణవాయువిదియే బ్రతికించెడి – పరమౌషధమిదియె
కనపడు అలనేరేడు ఫలంబులు – కటికి నులుపె కాని
వనదేవిముఖ విషాదచిహ్నాము – లనగూడదు వాని
వెలగపండ్లు విభూతి పండ్లవలె – తెలతెల్లగ నుండు
తెలుపైనను వనబలహీనత నా – ఫలములు తెలుపవుగ
పైరంగేదైనను లోపలి మధు – పదార్థమది యెరుపె
పౌరుషమును క్రాంతిని శాంతిని – వనము పూయుచుండు
జలజల ప్రవహించెడి సెలయేరుల – కలకల నాదముల
పలు రకంబులగు పక్షులు తమ శ్రుతి–గలిపి పాటపాడ
స్వాతంత్ర్యము నా జన్మహక్కెయని – శబ్దించును వనము”

(ii) బ్రిటిషు ప్రభుత్వము అడవిని రిజర్వు చేయగా, గిరిజనులు పడే బాధల వర్ణన:-

“భళా భళానోయ్ తమ్ముడా – సై – భాయి భళానోయ్ దాదానా
అడవిపండ్లు వేలున్నవీ – సై॥ , అటుకుంటె యమబాధరా – సై॥
వెదురు బియ్యమే యున్నవీ–సై॥ , పిడికెడు నమలిన శిక్షరా – సై॥
కొండతేనెలే యున్నవీ – సై ॥ , పిండిత్రాగ దండింతురూ – సై॥
ఆకలి మంటల జ్వాలలో – సై॥ , అల్లాడుతోందా మన్యంబూ ॥భళాభళా॥

అంతులేని యాకలితో మాడుచు – నట్లె చావలేక
చింత బెందడిని త్రాగసాగిరట – చివరకు గతిలేక
బెందడి త్రాగుట కతన నుదరములు – పెరిగి జ్వరము తగిలి
మందొాసంగు దిక్కారి యనేకులు – మరణించిరి యడలి”

(iii) బ్రిటిషు సైన్యంతో సీతారామరాజు చేసిన గెరిల్లా యుద్ధవర్ణన:-

“మెరపుతీగవలె నంతట తానై – తిరుగుచు నుగ్రుండై
పురికొల్పుచు తనవారి రంగమున – కురిపించెను తెగువ
సింహనాదములు సేయుచు వీరులు – చెంచులు కోయలుర
సింహపు పిల్లలు యేన్గులపుట్టెల – ఛేదించిన రీతి
కీకారణ్యంబున దావానల – కీలల చందమున
ఏకలవ్య వంశస్థుల గురి మీ – రిదే చూడుడనుచు
వీరవిహారము సేయసాగి రరి – వీరులు పొగడంగ
వైరుల శిరములు బంతులవలె తెగ – వైచిరి రంగమున
వందలు వేలు గెరిల్లాలను భ్రమ – వైరికి గలిగింప
క్రిందికి పై కెగబ్రాకుచు వైరుల – క్రిందుమీదు జేసి
బండల దొర్లించుచు నా మూకను – పడగూల్చుచు భువికి
భండనభూమి విహారము సల్పిరి – కొండయంత తామై
నిలుచుచు నక్కుచు ఉరుకుచు దూకుచు – తలపడి పోరుచును
కలకపరిచి పగలంతా సేనల – నిలిపివేసిరండి”

ఈ బుఱ్ఱకథను కూడా నాజర్‌గారు పాడి ప్రచారంలోకి తెచ్చారు.

బుఱ్ఱకథ నిజానికి నాటకం వంటి ప్రదర్శన కళయే! “నాటకాన్ని చదివి ఆనందించకూడదు; దానిని ప్రదర్శిస్తుంటే చూచి ఆనందించాలి” అనేవారు

మాగురుదేవులు దిగుమర్తి సీతారామస్వామిగారు. అలాగే బుఱ్ఱకథకూడా ప్రదర్శనలో తన శక్తిని సహస్రముఖాలుగా మనకు సాక్షాత్కరింపజేస్తుంది!

కృతజ్ఞతలు

నేను సేకరించిన కొన్ని ప్రసిద్ధ వీరగాథలను, అంటే – "బంగారు తిమ్మరాజు కథ" – "ఆరె మరాటీలకథ" – "సర్వాయి పాపడుకథ" – "చిన్నపరెడ్డికథ" – "సదాశివరెడ్డి కథ" – బల్మారి కొండల్రాయుని కథ" – "కామమ్మకథ" – "లక్ష్మమ్మకథ"లను 2017లో ద్రావిడ విశ్వవిద్యాలయం (కుప్పం)వారు "వీరగల్లు" అనే పేరుతో, మొదటి సంపుటంగా ముద్రించారు. అప్పుడు ఈ మూడు బుఱ్ఱకథలను కూడా అందులో చేర్చి ముద్రించాలనుకున్నాను. కాని బుఱ్ఱకథలు సాంప్రదాయక వీరగాథలు కావు; వాటికి అనుకరణములైన ఆధునిక రచనలు. వీటిని విద్యావంతులు ప్రయత్నపూర్వకంగా వ్రాస్తారు; మరికొందరు విద్యావంతులు జానపద వేషాలు వేసికొని పాడుతారు. అందువల్ల బుఱ్ఱకథలను ఆ సంపుటిలో చేర్చడం సరికాదనిపించి చేర్చలేదు. ఇప్పుడు వీటిని ప్రత్యేకంగా ఒక పుస్తకంగా వేస్తున్నాను.

ఆధునిక రచనలకు కాపీరైటు సమస్య వస్తుంది. నాజర్‌గారు 1945లో రచించిన "పల్నాటియుద్ధం" బుఱ్ఱకథను జనతా ప్రచురణాలయంవారు (విజయవాడ) 1959లో తృతీయ ముద్రణ కావించారు. అలాగే మరొక రచన "బొబ్బిలియుద్ధం" బుఱ్ఱకథను కూడా అదే సంస్థవారు 1959లో ప్రచురించారు. ఈ రెండు బుఱ్ఱకథలను తిరిగి ముద్రించుకొనేందుకు నాజర్‌గారి కుమారులైన షేక్ బాబూజీగారు నాకు అనుమతి నిచ్చారు. వారికి నా కృతజ్ఞతలు.

సుంకర సత్యనారాయణగారు రచించిన అల్లూరి సీతారామరాజు బుఱ్ఱకథను విశాలాంధ్ర ప్రచురణాలయంవారు 1953లో ప్రకటించారు. తిరిగి యిటీవల మిత్రులు శ్రీ కొత్తపల్లి రవిబాబుగారు (వ్యవస్థాపక సంపాదకులు, "ప్రజాసాహితి" మాసపత్రిక) మొత్తం సుంకర రచనలన్నింటిని కొన్ని సంపుటాలుగా తీసికొనివచ్చారు. వాటిలో బుఱ్ఱకథల సంపుటిలో అల్లూరి సీతారామరాజుకథ ఉంది. దానిని తిరిగి ముద్రించుకొనేందుకు వారు అనుమతించారు. పైగా "సుంకర ప్రజారచయిత – ఆయన రచనలన్నీ ప్రజలసొత్తు. వాటిని పునర్ముద్రించుకొనేందుకు అసలు అనుమతియే అవసరం లేదు. ఎవరైనా ఎప్పుడైనా ముద్రించుకోవచ్చు" అన్నారు. శ్రీ రవిబాబుగారికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథముద్రణకు ఉదారహృదయంతో విరాళాలు ఇచ్చిన మిత్రులు:-

1. శ్రీ రావూరి మృత్యుంజయరావుగారు, రిటైర్డ్ ప్రిన్సిపాల్, పాలంగి - తణుకు, పశ్చిమగోదావరి జిల్లా — రూ. 10,000-00

2. ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లుగారు, తెలుగు ఆచార్యులు, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి — రూ.5,000-00

3. శ్రీ రుద్రరాజు వెంకట సూర్యనారాయణరాజుగారు గణపవరం, పశ్చిమగోదావరి జిల్లా — రూ.5,000-00

4. ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు, బెంగుళూరు — రూ.5,000-00

వీరందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ పుస్తకాన్ని శ్రద్ధగా డి.టి.పి. చేసి యిచ్చిన ప్రియశిష్యుడు డా॥ తోట వెంకటస్వామికి, అందంగా ముద్రించి యిచ్చిన ఓంకార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అధినేత శ్రీ పి.ఎస్. వెంకటేశ్ బాబుగారికి నా అనంతమైన ఆశీస్సులు...

బెంగుళూరు — **- ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు**

15-10-2021

ప్లవ విజయదశమి



'బుఱ్ఱకథా పితామహుడు' పద్మశ్రీ షేక్ నాజర్ (గుంటూరు)

పల్నాటియుద్ధం

(బుఱ్ఱకథ)

రచన: షేక్ నాజర్

రచనాకాలం: 1945

(తృతీయ ముద్రణ: 1959, జనతాప్రచురణాలయం, విజయవాడ)

అంకితం

నా అభివృద్ధికి తోడ్పడిన

ముఖ్యులలో ముఖ్యుడు

నా పురుషోత్తానికి

- నాజర్

విజ్ఞాపన

ఆంధ్రదేశంలో "బుర్రకథ నాజర్" అంటే తెలియనివారుండరు. ప్రాచీన యక్షగానాలు, వీథిభాగవతాలు, బుర్రకథలు ప్రజల్లో పాతుకుపోయి, ప్రజలకు అత్యంత సన్నిహితమైన కళారూపాలు. వాటి ననుసరించి ఒక నూత్న రూపాన్నిచ్చి బుర్రకథకు ఒక విశిష్టస్థానాన్ని చేకూర్చారు నాజరుగారు.

పేద ముస్లింకుటుంబంలో జన్మించి, కష్టించి సాహిత్య, సంగీతాల్లో సముచితస్థానాన్ని పొందారు.

వీరి నూత్నరచనలను కూడా త్వరలో మీ కందించగలమని తెలియజేయుటకెంతయు సంతసిస్తున్నాం.

ప్రకాశకులు

నామాట

1944లో "బెంగాలు కరువు" నా తొలిరచన. తరువాత రచన పల్నాటి యుద్ధం. నేను మొట్టమొదట దీన్ని 1945లో వ్రాశాను. అప్పటినుంచే నేను దీన్ని చెప్పటం ప్రారంభించాను. ఈ కథారచనకు ప్రోత్సహించి రచనావిధానంలో చేయూత నిచ్చింది శ్రీయుత ప్రయాగ కోదండ రామశాస్త్రిగారు. ఈ కథ రాణించేందుకు అన్నివిధాలా సహకరించింది మిత్రులు, వంతలు రామకోటి, పురుషోత్తం, లక్ష్మీనర్సయ్య, వెంకటేశ్వర రావుగారలు. 1949 వరకు దాదాపు 240 కథలు చెప్పటం, కథ విన్న అయిదు లక్షలమంది ఆంధ్రప్రజానీకపు ప్రోత్సాహం లభించింది. తరువాత 1950లో డాక్టరు రాజారావుగారి తోడ్పాటుతో "పుట్టిల్లు" సినిమాలో కథ చెప్పటం జరిగింది. ఆ తర్వాత ఈ కథలోని ఘట్టాన్నే తీసుకుని "అగ్గిరాముడు" సినిమాలో చెప్పటం జరిగింది. ఆ తరువాత దాదాపు ఆంధ్రదేశపు అన్ని ప్రాంతాల్లోనూ ఆంధ్రప్రజలు ఎన్నో విధాల ప్రోత్సహించారు. తరువాత నా అనుభవంలో చేర్చిన మార్పులు, కూర్పులతో ఈ ముద్రణను మీకందిస్తున్నందుకు, తద్వారా మీరిచ్చిన ప్రోత్సాహానికి కృతజ్ఞత తెల్పుకుంటున్నాను. ఏవైనా సలహాలివ్వదలచిన మిత్రులు వ్రాస్తే హృదయ పూర్వకంగా స్వీకరిస్తాను.

నాజర్

పల్నాటియుద్ధం

(బుఱ్ఱకథ)

ప్రార్థన

రాగం – నీలాంబరి – ఆదితాళం

శృంగారలహరి ఆ
శ్రితజన శుభకరి ॥ శృం ॥

సంగీత బోధానందా
మధుమాధురి, మధుమాకరి
మంగళాంగి మదనారి
మనోహరి, మామ వ ॥ సా ॥

అంగజారి హృదయంగమ దరహాసితే
అఖిలాగమ సన్నుతే
బృంగచికుర కరుణాభరభరితే
తంగజ ఘనలవితే సురసేవితే
లింగరాజ వచనాంబుజ పూజితే ॥ సా ॥

రిపనిప సనిపమ గమపా, గమపసనిప
గమపని సరిసని సనిపమ పమగమ రిగమ
రిగరి పామా గామపని ససనిప
నినిపమ పపమగ మమగస మగపమ
నిపసని సమ గమపనిదనిపద పపమగస
నిసమగప సనిపమగస రిసనిపమగామపని ॥ శృం ॥

సోదర భారత వీరుల్లారా ॥ తందాన ॥
వీరమాతలౌ వనితల్లారా ”
శ్రీగల భారతమాతను దలచి ”
శ్రీనాథుని పోతన్నను దలచి ”
కాళిదాస వరకవులను దలచి ”
భరతశాస్త్ర పండితులను దలచి ”
జోడు గుమ్మెటలు తాధిమి యనగ ”
తోడుగ వంతలు జోరుగ పాడగ ”
రాగతాళగీతాది నృత్యముల తంబురకథ వినుడీ

–: పలనాటిసీమ వర్ణన – అనుగురాజు పలనాడును పాలించుట :–

వచనం:– ఇప్పటికి 800ల యేండ్లనాడు జరిగిన యీ పలనాటి వీరగాథ శ్రీనాథ కవిరాజు చంద్రవంకకు చెప్పిన తెరంగున మన మిచ్చట చెప్పంబూనితిమి. వినేవారు యెట్లా వెనవలెనయ్యా?

స్వతంత్రదీక్షను మనమున నిడుకొని – శ్రద్ధగ వినవలెరా
అల్లరిచేయక పిన్నలు పెద్దలు – ఆలకించవలెరా
వినరా బారతవీరకుమారా విజయము మనదేరా
ప్రాకటముగ నే జెప్పెడి కథను – ప్రాజ్ఞులార వినుడీ
శ్రీ విలసిల్లెడు తెలుగుదేశ మకు–టాయమానమైన
వీరగడ్డ పలనాడు వన్నెకు – వాసికెక్కినదిరా
వీరులెందరో పుట్టిపెరిగినా – పుణ్యభూమి యదిరా
వీరమాతలను గన్నతల్లిరా – మరపురాదు మనకు
వీరయోధుల వేడిరక్తము – విరజిమ్మిన సీమ
ధారణిలో ఆంధ్రావని – పౌరుష మెరిగించిన సీమ
కోడెగిత్తలకు పాడిపశువులకు – యీడులేని సీమ
కోడిపుంజులకు కొమ్ముపొటేళ్ళకు – జోడులేని సీమ
ఆ పలనాడును అనుగురాజు పా – లించుచునున్నాడు
అనుగురాజుకు బ్రహ్మనాయుడు – మంత్రిగ నున్నాడు

వ॥ ఈ ప్రకారంబున అనుగురాజు - నలగామరాజు, నరసింగరాజు, పెదమలిదేవరాజు, పినమలిదేవరాజు, బాలమలిదేవరాజులూ, అనబడే ఎనమండుగురి కుమాళ్ళతో బ్రహ్మనాయుని మంత్రిత్వాన, భోగభాగ్యాలతో తులతూగే పలనాడును పాలించుచుండగా, కొన్నాళ్ళకు అనుగురాజు కాలధర్మము చెందెను. అంత ఆయన పెద్దకుమారుడైన నలగామరాజుకు పలనాడును పట్టముగట్టి, నలగామరాజు వయసున, విజ్ఞానమందునా పసివాడగుటంజేసి పెద్దవాడైన బ్రహ్మనాయుడే రాజ్యయంత్రాంగాన్ని నడిపినాడట. ఎట్లన

-: అనుగురాజు తరువాత బాలుడైన నలగాముడు రాజగుట - అతని పరముగా బ్రహ్మనాయని ఆదర్శపరిపాలన - సర్వమావ సమానత్వమును చాటెడి చాపకూటి సిద్ధాంతము :-

రగడ:-

ఎక్కువ తక్కువ మతవిభేదములు - అక్కరలేదనుచు
వక్కటిగ ప్రజలందరుండ తా - చక్కగ యోచించి
చాకలి, మంగలి, మాలమాదిగ - సర్వజనులకెల్ల
ఏకపంక్తిలో విందుభోజనము - లేర్పాటు జేయుచు
చాపకూటి సిద్ధాంతము పేరిట - సాగించెను ఘనుడు
సాహసియగు యా బ్రహ్మనాయునకు - సాయపడిరి ప్రజలు
మాల కన్నమను బ్రహ్మనాయుడే - ప్రేమతో పెంచాడు
కన్నమదాసును సేనాపతిగా - జేసెను బ్రహ్మయ్య
తధిగిణ తోం -
వర్ణధర్మమను వుక్కు చట్రమును - వ్రయ్యలు జేశాడు
హెచ్చుతగ్గులను రూపుమాపగ - దీక్షబూనినాడు
సర్వమానవ సమానత్వమును - స్థాపన జేయుటకై
ధైర్యముగ ముందంజ వేసెనా - ధీరుడు బ్రహ్మయ్య

వ॥:- ఈ సంఘసంస్కరణ, హరిజనోద్ధరణ కార్యక్రమాలను ప్రజలందరు ప్రేమతో ఆదరించుచుండిరి. కానీ -

-: పెత్తందార్లు వర్ణసంకరము చేయుచున్న బ్రహ్మనాయనికి ఎదురు తిరుగుట:-

రగడ:-

పెద్దపెద్దలకు పెత్తందార్లకు - పీక పట్టెనయ్యా
గిట్టలేదు యీ చాపకూటి సి - ద్ధాంతము సుతరాము
మట్టిగలిసె కులకట్టుబాటులని - తిట్టుచు లోలోన
కట్టుపంచలను కదలకుండగా - పుట్టగోచిలెట్టి
మెట్టెలాగ పైగుడ్డలనే నడి - కట్టులు బిగగట్టి
పట్టినపట్టును విడువమనుచు మీ - సములు పట్టిదువ్వి
ఒప్పుగ పెద్దలు పెత్తందారులు - వుజ్జీలు వుజ్జీలున్
చెప్పుకొనుచు బ్రహ్మయ్య దాపునకు - చేరిరి కోపమున
యెప్పుడు పుట్టెనొ యీ మతధర్మా - లెందుకు పుట్టినవో
యిప్పుడు వీటిని త్రోసివేయ మే - మొప్పము బ్రహ్మయ్య
అని ఇవ్విధమున స్వార్ధపరులు బ్ర - హ్మయ్య కెదురుదిరిగి

వ॥ ఇవ్విధంబున పెద్ద పెద్దలందరు బ్రహ్మయ్యను ఎదిరించిన సమయంబున....

-: పెత్తందార్లకు నాగమ్మ నాయకత్వమును వహించుట - నాగమ్మ పరాక్రమము :-

రగడ:-

సాగినదిరా నాగులేటి దొరసాని - నాగసాని
అధికారము చేబట్టుట కిదియే - అదనని దలచింది
నాగమ కంటిలో ఆశారేఖే - నాట్యమాడినాదా
కూడదీసె నభివృద్ధి నిరోధక - కూటమి నంతటిని
అట్టహాసముతో పెద్దలందరిని - దిట్టపరచినాది
వొట్టుసుమా యీ పట్టు వీడితిమా - పుట్టవు నీళ్ళంది
తధిగిణ తోం -
అని యివ్విధమున పెద్దలందరిని - రెచ్చగొట్టినాదీ
నాగమాంబ సైన్యాలు గూర్చుకొన - వేగమె పూనిందీ
మాలకూటి రాజ్యమ్ము పోయితీ - రాలని లేచిందీ
నివ్వెరపడి ఆ పలనాడంతా - నిదురే మానిందీ

వ॥ ఇట్లు పలనాడు, నాగమ్మవొకపక్షం, బ్రహ్మనాయునిది మరోపక్షంగా రెండుగా చీలిపోసాగింది. నలగామరాజు కిది ప్రాణాంతకంగా పరిణమించ, అప్పుడు నాగమ్మతో సంప్రదించి తన ఆస్థానంలో నాగమ్మను రెండవ మంత్రిణిగా చేసెను.

హాస్యం:– ఛా! ఆడవాళ్ళకు మంత్రిపదవు లేమిటిరా? పెద్దపెద్ద మొగాళ్ళే తల్లక్రిందులై పోతుంటే?

కథ:– విజ్ఞానానికి, సామర్థ్యానికి ఆడ మగ తేడాలేదు.

హాస్యం:– ఇంతకూ అసలీ నాగమ్మ ఎవర్రా?

కథ:– ఈమెది చిట్టగామాలపాడని పలనాటనొక చిన్న పల్లెటూరు. రామిరెడ్డి అనే ఒక ధనికరైతు కీమె దొరికింది. తండ్రి అల్లారుముద్దుగా పెంచి ఈమెకు పెండ్లిచేశాడు. పెండ్లి జరిగిన కొద్దిరోజుల్లోనే ఈమె భర్త చనిపోయాడు. అప్పటికే ఈమెకు తండ్రి అన్ని విద్యలూ నేర్పించాడు.

హాస్యం:– అన్ని విద్యలంటే ఏమిట్రా?

కథ:– అనగా

చిన్ననాడె విల్లుబట్టెరా ॥ సై ॥
చిన్నప్డె విల్లెక్కు బెట్టెరా ॥ సై ॥
నింగిలో పిట్టనే గొట్టెరా ॥ సై ॥
నీటిలో చేపనే గొట్టిందా ॥ భళానంటి ॥

అల్లెనాడె కత్తిదూసెరా ॥ భళా ॥
అల్లపుడె సాములకు డాసెరా ॥ భళా ॥
కత్తి కదిలేతీరు గాంచితే ॥ భళా ॥
కన్నులకు మిరుమిట్లు గొలిపేనా ॥ భళానంటి ॥

గుర్రమెక్కి కత్తిబట్టితే ॥ సై ॥
గుర్రానికే భీతి లేదురా ॥ సై ॥
పరవళ్ళు తొక్కెను గుర్రము ॥ సై ॥
పైపైకి లేచెను గుర్రము ॥ సై ॥
కత్తిఢాలు చేతబట్టెను ॥ సై ॥

బాకు బల్లెము చేతబట్టెను ॥ సై ॥
విల్లునంబులు చేతబట్టెను ॥ సై ॥
పంచకళ్యాణినే యెక్కిందా ॥ భళానంటి ॥

తలతోక కాపాడు కత్తిరా ॥ సై ॥
తళతళా మెరిసేటి కత్తిరా ॥ సై ॥
కాలాహి నాలుకా కత్తేరా ॥ సై ॥
శత్రుసేనకు అదియు మిత్తేరా ॥ భళానంటి ॥

నాగసాని పేరంటేనే పసిపాపలు పాలు ముట్టరురా ॥ భళా ॥
నల్లమలలపై నాగమ గుర్రము – కదనే ద్రొక్కిందా
యెక్కడ జూచిన నాగమాంబరా తానేయయినాదా
మాలకూటి రాజ్యమ్ము పోయితీరాలని లేచిందా ॥ భళానంటి ॥

వ॥ ఇట్టి ఘటికురాలు నాగమ్మ మంత్రియయిన నాటినుండి నరసింగరాజుతో "నరసింగరాజా! మీ అన్నకు పుత్రులులేరు, పేరమ్మ ఒక్కతే కుమార్తె. రేపు నీయన్న ముద్దులల్లుడైన అలరాజుకు ఈ రాజ్యము కట్టబెట్టును. ఎవ్వడు బ్రతికితే వాడే. బాగుగా యోచించుకొనుము. నా మాట విన్నచో నిన్ను ఈ ధరామండలమునకు రారాజును చేతును" అని చెప్పగా దురాశాపరుడైన నరసింగరాజు నాగమ్మకు అందదండ యయ్యెను. నాటినుండి నాగమ్మ –

రగడ:–

నాయునిపై కవ్వించి కయ్యముకు – కాలు దువ్వసాగె
పిన్న పెద్ద అంతర్వు లెరుంగక – ప్రేలజొచ్చినాదా
కన్నూ మిన్నూ గానక నాగమ – చిన్న మాటలాడ
కామరాజు కిది ప్రాణాంతకముగ పరిణమించెనయ్య
రోజు రోజుకూ యింటా బైటా – పోరు మీరెనయ్యా
రెండు కత్తులొక వరలొ యిమడవని – ఖచ్చితముగ నెంచి
చిన్న తమ్ములగు బాలరాజులను – చేరబిలిచినాడు

–: నలగామరాజు మాచెర్ల రాజ్యమును పంచి తమ్ములు మలిదేవరాజులకిచ్చుట
– బ్రహ్మనాయడు మాచెర్ల మంత్రియై చక్కగా పాలించుట :–

వ॥ తమ్ములారా?

రగడ: –

బాలలారా! మాచర్లసీమ మీ – భాగమురన్నాడు
యేలుకొనుము బ్రహ్మయ్యమంత్రి మీ – పాలిటి తండ్రివలె
నిలిచియుండి పరిపాలన విధులను – తెలియబలుకుచుండు
దేశమందు నేడెన్నోరీతుల – ద్వేషము బలిసింది
బ్రహ్మనాయునకు నాగసానికి – పగలు మించెనయ్య
యిందు మూలమున యెన్నో చిక్కులు – రానున్నవి గాన
వెయ్యేండ్లున్న వేరు తప్పదను – సామెత వినలేదా?
పోరుమాపుటకు యింతకన్న – ఏదారి లేదు లేదు
తీరిపోను యీనాటితో మనకీ – తగవులు అన్నాడు

కథ: – అని ఈ ప్రకారంబున పండంటి పలనాడును రెండుగా విభజించి; బ్రహ్మనాయుని మంత్రిత్వాన మాచర్లను బాలరాజుల పరిపాలించమని, నాగమ్మ మంత్రిత్వాన నలగామరాజు గురజాల నేలుచుండ – బ్రహ్మనాయుని మంత్రిత్వాన బాలరాజుల పాలనలో మాచర్ల ఎలా అభివృద్ధి చెందుచున్నదన –

మలిదేవులు పాలించేసీమ – తందానా తందాన తందన
ఎల్లవిధమ్ముల విలసిల్లుచుండె ”
ప్రజలపాలిట పెన్నిధి బ్రహ్మన్న ”
కోటగట్టె బల్ – నీటుగ బ్రహ్మన్న ”
పల్లె పల్లెకో – పాఠశాల గట్టె ”
పల్లెలందు – గ్రంథాలయాలు బెట్టె ”
చెన్నుని గుడి మా – చర్ల యందు గట్టె ”
అన్ని కులమ్ములు – హారతులే బట్టె ”

వ॥ అప్పుడు –

రగడ: –

పెద్దలంత పరుగెత్తిరి నాయకి – వద్దకు వేవేగ
హద్దుమీరినది నాయుని పాలన – అమ్మా! నాగమ్మా!
మాలకూటి రాజ్యంబైపోయెను – అమ్మా! మాచెర్ల
మాలపిల్లలు కాపుపిల్లలు – కలసి చదువుతారా?

గాలిమేడలై మనకోరెకలూ – కూలిపోవునమ్మా!
నాగమ్మా మమ్ముద్ధరించమని – సాగిలపడ్డారు

వ॥ ఆ రీతి వాపోవు పెద్దలను ఓదార్చి నాగమ్మ –

రగడ:–

నాగుమాంబ మాచెర్లను జూచి – అసూయపడినాది
చాలకోపమున నాగుమాంబ నల – గామరాజుతోడ
కీలుబొమ్మ మంత్రిత్వము నాకిది – యేల పొమ్మనంది
వెళ్ళెద నీ అధికారములేనీ – కొలువేలనన్నాద
కండ్లుదిరిగి నలగామరాజు తా – కలవరపడి వేగ
నాగమ్మా! నీచేతి బలుపునే – నమ్మతినన్నాడు
నాగమ్మా! నీ యిచ్చవచ్చినటు – యేలుము అన్నాడ

–: నలగాముని మంత్రిణియైన నాగమ్మ మలిదేవాదులను కోడిపందెమునకు ఆహ్వానించుట :–

వ॥ ఈ ప్రకారంబున సామ దాన భేద దండోపాయంబుల నలగామ నరసింగరాజులను లొంగదీసె నాగమ్మ. బాలరాజులకు నలగామరాజు పేరుతో ఒక జాబు వ్రాసె. ఆ జాబును నిండు కొలువున బ్రహ్మన్న చదువసాగెను–ఎట్లన

(తందాన వరస)

శ్రీ మన్మహావీర కామేంద్ర విభుడు	॥ తందాన ॥
మానభూషణులకు మల్లిదేవులకు	”
దీవించి పంపు సందేశ మేమనగ	”
నేడు సంక్రాతికి కోడేరు గుట్టకడ	”
కోడి పందాలా వేయనెంచాము	”
పందెంబునొడ్డు భూపాలకూలెల్ల	”
కోడికి నెదురొడ్డు కోడెగాండ్రెల్లా	”
పాల్గొన విజయంబ బడసి పోవచ్చు	”
అని యిట్లు నలగామరాజు కబురంపె	”

వ॥ అది విని కొలువులోని యువకులు ఒకరినొకరు బిల్చుకొని ఆవేశపూరితులై ఈ పందెమందు పాల్గొనకున్న పౌరుషహీనులమే గదాయని, భగ్గు భగ్గున మండి

దిగ్గున లేచిరి. అపుడు బ్రహ్మన్న ఆ యువకుల నుద్దేశించి “వీరనాయనలారా! పలనాటి వీరయువకులారా! –

రగడ:–

కామరాజుకీ ప్రేమయెప్పుడు – కలిగిందన్నాడూ
కాదుకాదు ఆరాజు పంపినది – కాదని అన్నాడూ
నంగనాచి నాగమ్మ పన్నిన ప – న్నాగమెనన్నాడూ
నాగసాని ఆడింది ఆట పాడింది పాట ఆయె
యీయేటికి సంక్రాంతికి యీటెలు – బరిసెలు వస్తాయి
యీయేటికి నలగొండలపైగా – దూకును గుర్రాలూ
చాలులే వద్దీ అన్నదమ్ముల – సరసాలన్నాడు

వ॥ బాలరాజులు అదివిని

కామరాజు బలగాన్ని జూచి భయ – మందనేల మనము
యేమివ్రాసినా యెవరు వ్రాసినా – వెళ్లుదమన్నారు
మీరివచ్చు నాగమ్మ బరిసెలా – పదునెంతన్నారు
వెళ్ళవచ్చు మాచెర్లకోళ్ళ పర – వళ్లు జూపవచ్చు
మనపుంజులు గురజాల కోళ్ళను – గోటజిమ్ముతాయి
అనవిని యెల్లరు భళీభళీయని – పయనము గట్టారు

వ॥ ఈ ప్రకారంబున

అందెవేసిన పందెగాండ్లురా ॥ సై ॥
అందమైన పుంజు లెత్తిరీ ॥ సై ॥
పాతలు కత్తులు దీసిరీ ॥ సై ॥
సానల మీదే సాదిరీ ॥ సై ॥
నూనెల మెరుగులు బెట్టిరీ ॥ సై ॥
గజ్జెల చెడ్డీల్ గట్టిరీ ॥ సై ॥
గంతులు వేయుచు కదిలారా ॥ భళానంటి ॥

వ॥ అటు గురజాలనుండి నాగమ్మ పక్షమువారు –

పేరుగొన్న పందెగాండ్లురా ॥ సై ॥

పొగరు గలిగిన కోళ్ళనెత్తిరా ॥ సై ॥
సాధన జేసి వారురా ॥ సై ॥
సారాజాడీ బండ్లురా ॥ సై ॥
భేరీ వాయిద్యాలురా ॥ సై ॥
జోరు జోరుగా త్రాగిరా ॥ సై ॥
దారులన్ని తెగనడచారా ॥ భళానంటి ॥

-: కోడేరు గుట్టల దగ్గర ఇరుపక్షములవారికి కోడిపందెము జరుగుట :-

వ॥ ఇవ్విధంబున యిరుపక్షములవారును కోడేరు గుట్టల వద్దకు చేరుకున్నారు. అలరాజు నలగామరాజుకు అల్లుడైనా, అతడు ధర్మపక్షపాతియని యిరుపక్షముల వారికి నమ్మకమున్నందున, అలరాజునే మధ్యవర్తిగా ఎన్నుకున్నారు. ఇక నాగమ్మ పక్షాన మువ్వల భీమన్న, బ్రహ్మన్న పక్షాన బాలగోపన్నలు కోళ్ళను బట్టే పందెగాండ్లుగా నిర్ణయించటం జరిగింది. అంతట ఈ మువ్వల భీమన్న, బాల గోపన్నలు –

లెక్క తాడులే తీసిరా ॥ సై ॥
వొక్కొక్క పుంజునే జూచిరా ॥ సై ॥
యీకవరుసనే జూచిరా ॥ సై ॥
యిలపై పుంజులు దించారా ॥ భళానంటి ॥

వ॥ అపుడు బ్రహ్మన్నంటున్నాడు: "ఏమన్నా, బాల గోపన్నా! మన నాగమ్మ పలనాటనున్న కోళ్ళనన్నింటినీ కొనటమేగాక, కుంపట్లో గుడ్లకుకూడా బయానా యిచ్చి తనవే అనిపించుకుంది. మనకున్న ఈకొద్ది పుంజులను కంటికిరెప్పలా కడు జాగ్రత్తగా కాపాడు"మన్నాడు. అంతట –

నాగమ్మ పుంజే నాయనా ॥ సై ॥
నాల్గు ఝాములా పుంజురా ॥ సై ॥
బరిపక్కల పగలదన్నెరా ॥ సై ॥
బ్రహ్మయ్య పుంజే పారిందా ॥ భళానంటి ॥

వ॥ మాచెర్లవారి పుంజు పారిపోవటం జూచి, నాగమ్మ వెంటవచ్చిన సుద్దులవాడు ఏమంటున్నాడూ –

పలనాటి మిద్దెలకు నాసాలు లేవు ॥ తందానా ॥
కొండేటి బ్రాహ్మలకు మీసాలు లేవు ”
మాచెర్ల కోళ్ళకు రోషాలు – లేవయ్యా ”

వ॥ ఈ పాట విన్న మాచెర్ల దొరలు –

భగ్గుభగ్గునే మండిరీ ॥ సై ॥
పట్టి మీసముల దువ్విరీ ॥ సై ॥
కరకర కోరలు నూరిరా ॥ సై ॥
కాకిడేగనే దించారా ॥ భళానంటి ॥

నీటైన బ్రహ్మయ్య డేగరా ॥ సై ॥
అరవడి పరవడి జేసెరా ॥ సై ॥
తాటించి తన్నసాగెరా ॥ సై ॥
నాగమ్మ కోడి సోదరా ॥ సై ॥
తతక్క ధోం –
కావు కావుమని అరచిందా –
కాలికి బుద్ధి చెప్పిందా ॥ భళానంటి ॥
తవుడు మేసిన కోడిరా –
తన్నుకు పారిపోయిందా ॥ భళానంటి ॥

వ॥ ఈ రీతి గురజాల కోడి పారిపోవడం జూచి మాచెర్లవారి వెంటవచ్చిన సుద్దులవాడు ఏమంటున్నాడు –

పలనాటి మిద్దెలకు వాసాలు లేవు ॥ తందాన ॥
కొండేటి బ్రాహ్మలకు మీసాలు లేవు ”
గురజాల కోళ్ళకి రోషాలు లేవయ్యా ”

రగడ:–

గురజాల వీరులు రోషమెక్కి బల్ – కొరకొరలాడంగ
కామరాజు గుడ్లెఱ్రజెసి బల్ – తామసమున లేచి
కాచుకొండి కడసారి పందెమని – గదిమి పలికినాడు
వోడినవారము రాజ్యము వీడుద – మేడు యేడు లనియె

రోషంబున గురజాల వీరులు – సై సై యన్నారు
గెలుపు కోపులో బాలరాజులు – భళిభళి యన్నారు
రాజుకున్న యీకోడిపోరు – రారాజుల పోరాయె

వ॥ అలరాజు, బ్రహ్మనాయుడు, కూడదని యెంత వారించినా యిరు పక్షములవారూ, కడసారి పందెమునకు కడంగిరి. ఇక బ్రహ్మన్నకున్నది ఇంజాబెరస పుంజు మాత్రమే. దాన్ని దువ్వి బరిమీద దించాడు బాలగోపన్న, అది అట్లా బరిపైన నిలచి, రెక్కలు తాటించి కొక్కొరోకో యని కూత బెట్టినంత, గూటాలనున్న పూరికోళ్లన్ని వూరిమార్గమున పారిపోవుచుండా, నాగమ్మ తన కోళ్ళనన్నిటినీ పరీక్షజేసింది. కానీ ఏ వొక్క పుంజూ నాయుని పుంజుకు జోడు కుదరలేదు. అప్పుడా మహాతల్లి నాగమ్మ ఆలోచించి –

పుంజుల్లో పుంజు కానిదీ ॥ సై ॥
పెట్టల్లో పెట్టకానిదీ ॥ సై ॥
పెట్టమారినే దించిందా ॥ భళానంటి ॥

వ॥ ఎప్పుడైతే నాగమ్మ పెట్టమారిని బరిమీదకు దించిందో అపుడు నాయుని పుంజు –

నీతిగల్ల జాతికోడిరా ॥ సై ॥
కూతబెట్టి మింటి కెగసెరా ॥ సై ॥
నోటబట్టి పెట్లమారినీ ॥ సై ॥
పట్టి నేలకే కొట్టిందా ॥ భళానంటి ॥
కాళ్ళు వణికె నాగమ్మకు ॥ సై ॥
కళ్లు తిరిగె నాగమ్మకు ॥ సై ॥

–: నాగమ్మ కుతంత్రముతో బ్రహ్మనాయని పుంజును ఓడించుట – మలిదేవాదులు మాచెర్లను విడిచి వీరమేడపికి వలస పోవుట :–

వ॥ ఇక నేనీ పందెంలో ఓడిపోవటం తథ్యమనుకుంది నాగమ్మ. కడసారి ప్రయత్నంగా ఏమి చేస్తుందయా –

జిత్తులమారి నాయకీ ॥ సై ॥
నెత్తురు జెండా యెత్తెరా ॥ సై ॥

జుట్టును తావిరబోసెరా ॥ సై ॥
దయ్యములాగా నాయకి ॥ సై ॥
ఆ కయ్యములోనా నిలచిందా ॥ భళానంటి ॥

వ॥ నాగమ్మ ఆకారాన్ని చూచి, తన దృష్టిని మరల్చి బ్రహ్మయ్య తలవంచుకొనెను. నాగమ్మ ఇదే సమయమని భీమన్నకు సౌంజ్ఞ చేసెను. అంత భీమన్న పెట్టమారిని బ్రహ్మయ్య పుంజుపైకి వుశికొల్పగా...

నోటబట్టి బ్రహ్మయ్య పుంజునే కొట్టె పెట్టమారి
నెత్తురు ప్రేవులు వెళ్ళివచ్చె బ్రహ్మయ్య పుంజు కపుడె

గీ॥ బ్రహ్మనాయని ఇంజారి వాడిఁబెరస
నెత్రు ప్రేవులు జీరాడ నింగికెగసి
పెట్టమారిని రెట్టలు పట్టితన్ని
జీవములు బాసె మాచెర్ల చేవపుంజు

గీ॥ చావకనె పారినది గురజాల మారి
చెమరి బరిమీద నొరిగె మాచెర్ల పుంజు
ధర్మ నిర్ణయమగుదాక తడయకామె
కసరి నాగమ్మ వేయించె కంచుఢక్క''
(త్రిపురనేని రామస్వామిచౌదరిగారు)

నాగమదేవికి జైయని లేచెను నాగమ్మ మూకంత
సాగెను యీలలు చప్పట్లు బహు - ఆగమాగమాయె

వ॥ అప్పుడు నాగమ్మ బ్రహ్మనాయునితో ఏమంటుంది -

రగడ:-

పందెమందునా ఓడిపోతివా - బావా! బ్రహ్మయ్య!
పందాలకు పై పందాలకు - దిగవద్దని చెప్పితినే
చెనటి ప్రతిష్ఠకు బోక మీరు - మాచెర్ల నేలుకొండి
పందెము వేయకు బావా! మా గుర - జాలతొ యికముందు

వ॥ అన విని బ్రహ్మయ్య -

బ్రహ్మనాయని కంటికొసలో – విషాదము వొలికిందా
కానినాడు పరుసాలకు బోయిన – ఫలమిది యన్నాడు
ఆడినమాటను తప్పక దేశము – వీడుదమన్నాడు

వ॥ అప్పుడు వారంతా –

అడవులపాలయి ఆకులలములు తిని – ఆకలి నాపుకొని
నడచి నడచి పడరాని పాట్లుబడి – మేడపి చేరారు

వ॥ అపుడు మధ్యవర్తిగా వున్న అలరాజు లేచి, "మామా నలగామరాజా! అధర్మానికి ఆటపట్టుగానున్న నీ రాజ్యమందు నాకూ చోటులే"దని, భార్య నంతఃపురమందు విడచి, పెండ్లి ముచ్చటయినా తీరకమునుపే, పసుపుబట్టలైనా మాయక మునుపే బ్రహ్మనాయునితోపాటు ప్రయాణమాయెను.

ఈ రీతిగా నాయకురాలి మాయజూదమున ఓడిన బాలరాజులు, బ్రహ్మనాయుడు బంధుమిత్ర సకుటుంబ సపరివార సమేతంగా వీరమేడపిలో నిసించుచుండిరి –

–:ఏడేండ్ల వనవాసము తరువాత బ్రహ్మనాయుడు అలరాజును రాయబారిగా గురజాలకు పంపుట–నాగమ్మ నరసింగరాజులు కలసి అలరాజును హత్యచేయుట:–

వీరమేడపిలో యేడుయేడులు – గడచిపోయెనయ్యా
తీరిపోయినది గడువనివారికి – తేటపడిన పిదప
అలరాజును తమ రాయబారిగా – అంపిరి గురజాల

వ॥ రాయబారిగా వచ్చిన అలరాజు కొలువున ప్రవేశించి, కుశలప్రశ్నలైన యనంతరంబు నలగామరాజుతో తన రాక నెరింగించె – యెట్లనగా –

మామా!

గీ॥ మీరు బెట్టిన గడువెల్ల తీరెనయ్యా!
వారి మాచెర్లనిక మీరు వారికిచ్చి
బంధుమిత్రులు తగవులు బాపుడయ్యా!
సుగుణధనులార! గురజాల సుజనులార!

వ॥ "నాయనా, అలరాజా! నీవు చెప్పింది యథార్థమే కావచ్చు, కానీ నా మాటలు కొంచె మాలకించ" మన్నది నాగమ్మ. "ఏమది" అన్నాడు అలరాజు. అపుడు

నాగమ్మ, నాయనా! –

ఎంతో కాలము ఏలబోడు – మీ మామ కామరాజు
నేడో రేపో ఈ రాజ్యమునకు – రాజువు నీవయ్య
తలకొక ముక్కను జేసిన దేశము – బలము తగ్గిపోయి
కాకులు చింపిన విస్తరిలాగా – కాకమానదయ్యా
మీకూ మాకూ అందరి కైక్యత – మేలని యన్నదా
మాలకూటి రాజ్యాలు మేలు – చేకూర్చవు అన్నదా

వ॥ అనవిని అలరాజు "అమ్మా! మాలకూటి రాజ్యమై పలనాడు బ్రహ్మన్న మంత్రిత్వాన ప్రజలకు మేలు చేయక పోతే చేయలేదేమో! కానీ నీ మేలువలన పండంటి పలనాటి కీనాటి కీ గతులు గల్గినవి. ఇంకముందేమి జరుగునో నీవాగ"మన్నాడు. "మామా! నలగామరాజా! తండ్రి గతించిన నాటినుండి, తండ్రివలె మిమ్మెత్తి పెంచాడు. మీ మేలే తన మేలుగా భావించి మీ బాగోగులకు తన సర్వస్వము ధారబోయుటకు సంసిద్ధుడైయున్న –

(పాట) బ్రహ్మన్న మాటలను
మామా వినుమా
పగను వృద్ధిబొందించు భ్రష్టులే
పోరుమాన్పు పుణ్యాత్ములు లేరు
పోరునష్టి పొందు లాభమందురు
పోరు తగదు భూమి నేరికైనా" ॥ మా ॥

వ॥ అలరాజు మాటలాలించి నలగామరాజు నాగమ్మ వంక జూచె –

రగడ:–

కన్నులు నిప్పులురాలగ నాగమ – అలరాజును జూచి
కటకట కోరలు నూరుచు నాగమ – గదిమి పలికినాదా
"తెలుసులే నీతిబోధ పో" – మన్నది నాగమ్మా
"గెలుచుకొంటి మీ రాజ్యము మేమా – బాలరాజులొద్ద
రాజ్యము వీరభోజ్యమన్నదే – రాజనీతి రాజా
భిక్ష పెట్టునది కాదుపోవయా – రాజ్యం అలరాజా
రోసమున్నచో – మమ్ము గెల్వ"మని పలికెను నాగమ్మా

వ॥ అప్పుడు అలరాజు "అమ్మా! నాగమ్మా!

రగడ:–

పందెము బెట్టి అన్నదమ్ములా – పగలు బెట్టినావూ
కలత లెరుంగని పలనాటికి – గతులు తెచ్చినావూ
యింకపైన నీవేమీ చేతువో – చేయుము నాగమ్మా
యేమిజేసినా నీకెదురేదీ – సీమలో" అన్నాడు.
"నా కెందులకీ గొడవలన్ని – నేనేగెద తపమునకు
కృష్ణా రామా యంచు తనువును – గడపెద" నన్నాడు.

వ॥ అని ఈ ప్రకారంబున నలగామరాజు పలుకగా, అలరాజు కొలువు వీడి వెళ్ళుచుండ –అప్పుడు నాగమ్మ నరసింగరాజుతో –

రగడ:–

పలనాటి పట్టాభిషిక్తుడీ – అలరాజన్నాది
అలరాజే మీ అన్నకు ముద్దుల – అల్లుడు అన్నాది
అలరాజే నీ పక్కలో బల్లెము – తెలియుమ అన్నాది
ఆలోచించక నీ పిడికత్తికి – బలియిడు మన్నాది

వ॥ ఇవ్విధంబున నాగమ్మ నరసింగరాజులు అలరాజును హత్యచేయించే ప్రయత్నములో వున్నారు.

ఇక అంతఃపురంలో పేరిందేవి యెలా వుందయ్యా? యేడేండ్లనాడు పెండ్లి ముచ్చటయినా తీరని స్థితిలో వెళ్ళిన భర్త తిరిగి యీనాడు తండ్రిగారి కొలువుకువచ్చి. తన మేడకు వస్తాడని ఆనందంగా ఎదురుచూస్తూవుంది. ఈ పరిస్థితిలో నలగామరాజు యెలావున్నాడయ్యా–

కన్నులనిండా నీరునింపె నల – గామరాజు దేవ
ఎన్నిగతులు నాకింకపైన – రానున్నవో పరమేశ!
కన్న తండ్రివలె పెంచిన నాయుడు – కడకు దూరమాయె
ఎన్నో ఆశలు పెట్టుకున్న నా – అల్లు డలిగిపోయె
ఇరువురి మధ్యన నలిగిపోయె నా – జీవితాశలన్ని
దరిదోచని నలగామరాజు యీ – తీరున నుండంగ

వ॥ తెల్లవారుసరికి నాగమ్మ నలగామరాజు కడకు చరచరావచ్చి, "రాజా నలగామరాజా! నీ అల్లుడు అలరాజును బ్రహ్మయ్యనాయుడు హత్యజేయించాడు. మన పొలిమేరలోన మన చుట్టు పట్లనున్న రారాజులు రాయబారిని చంపిన ద్రోహులమని మనకు సహకారులుగా రాకుండవుండేటందుకు, సహగమనము పేరిట అలరాజుతో పెరిందేవిని కూడా మన సత్సాంప్రదాయం ప్రకారం మనం కాల్చివేతుము గనుక, రేపు తన చేతి కీలుబొమ్మలైన బాలరాజులను పలనాటికి పట్టాభిషిక్తుల చేయవచ్చునని బ్రహ్మయ్య ఈ దుర్మార్గానికి వొడిగట్టె"నని చెప్పింది. నాగమ్మ అలరాజును, పెరిందేవిని తలంచి దుఃఖించుచుండ, అటు అంతఃపురంలో పెరిందేవి ఈ వార్తవిన్నంతనే –

–: అలరాజు భార్య పేరిందేవి దుఃఖించి, భర్తతో సహగమనము చేయుట :–

రగడ:–

ధరణికి వొరిగెను మొదలు నరికినా అరటితుండె మటుల
బిరబిర దాదులు సేద దీర్చిరా పెరిందేవి నపుడు
తీర్చుకుంటివా నీ కర్తవ్యము తల్లీ! నాగమ్మా!
నిన్ననవలసిన పని ఏమున్నది నీతి మాకు లేదు

వ॥ అమ్మా! నాగమ్మా! నా భర్తతోపాటు ఈ పాపిష్టి పాలనా విధానాన్ని చూడకుండా నన్నూ పంపుతున్నందుకు నీకు ధన్యవాదాలు తల్లీ! ఎందుకన నా భర్త అలరాజు–

రగడ:–

మానవత్వమును ప్రాణముకోసము మంటగలపలేదు
భోగము కోసము నీతినియమములు నీటగలపలేదు
ధర్మముకోసము బలియైపోయిన కర్మవీరుడతడు
ఎన్ని జన్మములకైనా నాపతి అతడే అలరాజు

వ॥ అని ఏడ్చుచు సహగమనానికి సిద్ధమై తొలి ద్వారము దాటి మలిద్వారము అడుగిడినంత తన పినతండ్రి నరసింగరాజు ఎదురుపడగా ఆ తల్లి పొంగిపొరలు దుఃఖమున –

రగడ:–

పిన్నయ్యా! ఓపిన్నయ్యా! పిన్నయ్య నరసరాజ!

కన్నయ్య కన్న మిన్నగ పెంచిన పిన్నయ్యా వినర

వ॥ మొన్న ముద్దుముచ్చటగా మా వివాహము నీ చేతులమీదుగా జరిపించి, దీవించి అత్తవారింటి కంపిన పిన్నయ్యా! అట్టి నీ చేతులతోనే –

దీవనలిచ్చి వల్లకాటి కిపుడంపర పిన్నయ్య
అల్లునితోడుగ కూతునికూడ అంపర పిన్నయ్య
మాయలేదురా పసుపుగుడ్డలే మాకో పిన్నయ్య
పెండ్లిముచ్చటే తీరలేదురా పిన్నయ్యా మాకు
కదలిపోయెనా తల్లి గుణవతి కాటిదరికి యపుడు
కంటినీటితో భర్త పాదములు కడిగి పెరిందేవి
కాలిపోయెనా కాటిమీద యా కాంత పెరిందేవి

–: అలరాజు మరణవార్తవిని కోపించి, బ్రహ్మానాయడు మలిదేవాదులు కార్యమపూడికి దండెత్తి వెళ్ళుట – బొంగరాలాటలో ప్రబోధితుడై బాలచంద్రుడు తల్లి ఐతమ్మ దగ్గర దీవెనలందుకొనుట :–

వ॥ ఈ ప్రకారంబున అలరాజు మరణవార్త, పెరిందేవి సహగమనము రాయబారం విఫలమయిన వివరాలన్నీ వీరమేడపికి తెలియవచ్చినంత, బాలరాజులు, బ్రహ్మానాయుడు కార్యమపూడికి సైన్యసమేతంగా కదలిరెట్లన –

పాట:–

జననాథుల జయభేరి మ్రోగె
పతాలమే కక్కటిల్లగ దిక్తటంబులే పెఠిల్మనగ
రెట్టలుదట్టుచు హూంకరించును నినాదఘోషలన్
సలుపగ విరోధులంద రతిచింత తమతలలు నిలకు
వంచగ అదే కనుడు ॥ జననాథులా ॥

వ॥ ఈ విధంబున పెద్దలందరు యుద్ధానికి వెళ్ళగా బ్రహ్మానాయుని కుమారుడైన బాలచంద్రుడు బొంగరాల ఆటకు వెళ్ళాడు. వెళ్ళినవాడు బొంగరానికి జాలెతాడు బోసి బజారు వెంట నీళ్ళు తెచ్చుచుండిన కోమటివారి అమ్మాయి కాలికి కొట్టాడు. అప్పుడు ఆ అమ్మాయి యేమంటున్నది –

రగడ:–

పెద్దలు పిన్నలు నాగసానిపై యుద్ధంబున కేగ

ఆడుచుంటివా బొంగరాలు నీ – అందమారిపోను
అనవిని బాలుడు అట్టె నిలువున – నీరై నిల్చినాడు
యెన్నితిట్టినా బదులు పలుకక – యోగాల పోయాడు

వ॥ వెంటనే బాలుడు ఆమెకు క్షమాపణ జెప్పి, తల్లి దగ్గరకొచ్చి నమస్కరించి–

“పూజనీయుడౌ తండ్రి యెక్కడికి – పోయెనమ్మ నేడు
పెద్దలందరూ యుద్ధముచేయగ – పోయినారటమ్మా!”

వ॥ నాయనా!

“కార్యమపూడికి పోయినారురా – కన్నతండ్రి వారు
కామరాజుతో కార్యము తీర్చుక – కదలే వస్తారు”

వ॥“అమ్మా! మా తండ్రి నాకేల చెప్పలేదు”. “నాయనా అందుకు కారణం నేనే”–

ఎన్నో నోములు నోచినానురా – కన్నతండ్రి నీకై
పట్టనివ్రతములు లేవురా – నా చిట్టితండ్రి నీకై
కన్నకడుపులో చిచ్చురగుల్చకు – మన్న బాలచంద్ర!

వ॥ కన్నకడుపు తీపి బిడ్డలగన్న తల్లులకే తెలియునయ్యా. పెంచిన ప్రేమతో నిను విడచివుండలేక, నీకు తెలియనీయవద్దని నీ తండ్రిని వేడుకొన్నాను కొడుకా!

“తల్లిరో ఎంతటిమాట వింటి – నీ నోటి వెంట నేడు
వీరుడైన బ్రహ్మయ్యనాయునికి – యిల్లాలవు నీవు”

వ॥ అమ్మా! నన్నంత ప్రేమతో పెంచావా? అయితే ఈనాడు వందలమంది యువకులు, పవిత్రమైన తమ ప్రాణాలను లెక్కచేయక, చావుకు తెగించి, నా తండ్రితో రణరంగానికి వెళ్ళారే! వారిలో ఏ ఒక్కరికీ తిరిగి వస్తామనే ఆశలు లేవే! అట్టివారందరిని వారి తల్లులు నీవు నన్ను పెంచినంత ప్రేమతో పెంచలేదనా నీ వుద్దేశమమ్మా? ఏ తల్లికి ఏ బిడ్డమీద ప్రేమ లేకుండావుంటుంది? కాకిపిల్ల కాకికి ముద్దుగదా అమ్మా!

గండరగండులు గండువారి యిం – టాడబడుచువమ్మా!
పిరికిమందునూ కన్నబిడ్డలకు – నూరిపోయ తగునా?
వెరపుజెందునా కోరసింగము – కరిని గాంచినపుడు

అలిగి సంద్రముప్పొంగిననాడూ – ఆగున లోకాలూ
దీవెనలిచ్చి పంపుమమ్మ”యని – ధీరత పలికాడు

–: బాలచంద్రుడు తన భార్య మగువ మాంచాల దగ్గర దీవెనలందుకొనుట :–

వ॥ అప్పుడు ఐతాంబ కుమారుని దీవించి “నాయనా! నీ భార్య మగువ మాంచాలతో జెప్పి, ఆమె దీవెనలను అందుకొని వెళ్ళు”మనగా బాలచంద్రుడు మాంచాల మేడకు ప్రయాణమయ్యెను. ఇన్నాళ్ళకు భర్తను చూడబోతున్నాననే ఆనందపరవశత్వమున మాంచాల ఏడువారపు నగలుధరించి ఎలావున్నది –

పాట:–

పున్నామా! చంద్రుడూ
పొడచీనట్లుండే – మాంచాల
చిన్నీ వెన్నెలా – చిందూ
చిరునగవు మోమూరా – మాంచాల
చక్కానీవారీలో చక్కానిబాల మంచాల

రగడ:–

యేడువారపు నగలను బెట్టిన – యింతిని జూచాడు
పట్టుది జలతారుచీర గట్టిన – పడతిని జూచాడు
పున్నమచంద్రుని ధిక్కరించు నా – పసిడిబొమ్మ నరసి
కన్నుచెదరి కామాంధకారమున – తన్నుతానె మరచి
ఆమె అందము పొగుడుతాడా ॥ సై ॥
ప్రేమభిక్షను వేడుతాడా ॥ సై ॥
కామాన్ని తీర్చమంటాడా ॥ సై ॥
కౌగిట చేర్చమంటాడా ॥ భళి ॥
నన్ను మన్నించమంటాడా ॥ భళి ॥
నిన్ను విడనాడనంటాడా ॥ భళి ॥
పిచ్చియెత్తిన కోతి చందాన ॥ భళి ॥
బాలుడా వచ్చిన పని మరచినాడా ॥ ఓ భారతీయు ॥

వ॥ అప్పుడు మాంచాల “నాథా! బాలచంద్రా! ఏ దేశమైనా బాగుపడాలంటే ఆ దేశమందున్న యువతీయువకులపై ప్రధాన బాధ్యత లున్నాయని మన పెద్దలు

మనకు బోధించారు. అలాంటి పరిస్థితుల్లో దేశానికి వెన్నెముక యనదగు యువతీ యువకులు కామాంధులై తమకర్తవ్యాన్ని కానకున్న –

పాట: –

నగరా నిను జూచిన – బాలచంద్ర ॥ నగరా ॥
పగతురు విన్నచో ॥ నగరా ॥
దేశము హరియించి – అలరాజును వధియించి
పాలించు నాగమ్మ – పసతేల్చుకొని రమ్మా
శత్రు యురములు – క్రుమ్మి చిమ్మి
ధాత్రిపై విజయమ్ము తెమ్మీ
బానిసత్వము నోర్వలేము
బ్రతికినా చచ్చినా స్వర్గము ॥ నగరా ॥
సింగాల జగడమూ – రంగాన జరుగంగ
అంగన చెలిమేమి – సింగారముగ నుండు
రక్తతిలకము నుదుట బెట్టి
కరకుకత్తి కరముబట్టి
శత్రుమూకను చెదరగొట్టి
జయము చేకొనకున్న శత్రులు" ॥ నగరా ॥

వ॥ అనవిని బాలుడు "ఓ మాంచాలా! అందాలగనివైన నిన్ను గాంచినంతనే మనసు మనసులో లేక అట్లంటి. దీవించి పంపవే దేవి మాంచాలా!" అన, అపుడు మాంచాల –

గీ॥ "ధర్మయుద్ధము కేగెడి కర్మవీర!
తేరి శత్రుల నెదురించు వీరబాల!
యుద్ధమందున నీకత్తి కోటులేదు!
తెమ్ము విజయమ్ము! ఇదె కృపాణమ్ము పొమ్ము!"

–: ఆర్గురు తమ్ములతో అన్న బాలచంద్రుడు కార్యమపూడికేగుట – బాలుని వీరాలాపములు : –

వ॥ భార్య దీవెనల నందుకున్న బాలుండు –

ఆర్గురు తమ్ములు అన్నా బాలుడు – అశ్వంబులపైన
అంబరవీథిన కారెమపూడికి –అపుడే వెళ్ళారు

వ॥ అక్కడ కార్యమపూడిలో మరల పంపిన భట్టుమూర్తి రాయబారము విఫలమయ్యేనని బాలుడు విని ఏమంటున్నాడు –

రగడ:–

అడిగిన మాచెర్లివ్వనన్నది – అంతా మాదంది
యేమైనా మాచర్లను మనకు – యిస్తేనే సంధి
కాదంటే యిక ఘోరయుద్ధమున – జయించి తీరాలి
నాగుమాంబ తంత్రాలముందు – బలిజంతువు లవుతారు
సిగ్గువీడి యీ రాయబారమున – కొగ్గితిరా తలలు
సంధిలేదు ముమ్మాటికి లేదు – సాగండన్నాడు

వ॥ ఇంతలో ఒక సేవకుడేతెంచి దేవా! బ్రహ్మయ్యనాయుడా –

–: నాగమ్మ పెద్దదండుతో కార్యమపూడికి వచ్చుట – బ్రహ్మన మాలకన్నమను సేనానిగా చేసి, రణభేరి మ్రోగించుట :–

రగడ:–

"దండుతోడ నాగమ్మ కారెమ – పూడికి కదిలింది
అంతులేని ఆసేనావాహిని – అజేయముగ నుండె
ఇసుక జల్లినా పడనెడ మేమియు – పుడమిపైన లేదు
నాగులేటి దరిదాపుకె వచ్చెను – నాగమ మూకంత"

వ॥ అనవిని బ్రహ్మన్న "నాయనా! నాగమ్మసేన అంతగాదు, ఇంకెంతవున్నా మనకు భయంలేదు. జీతపురాళ్ల కోసం పోగుపడింది నాగమ్మసేన. జీవితంకోసం, పలనాటి భవిష్యత్తుకోసం పోరాడ బోతున్నది మన సైన్యమూ, మన మున్నూ", అని బ్రహ్మయ్య–

రగడ:–

రాజులను సరదార్లను కూలీ – రైతుల జూచాడు
మాలకన్నమను బాలచంద్రుని – మన్నన జూచాడు
నాగమసేనలు కత్తిమోతకె – తగవు యుద్ధమునకు
మాలకన్నమను సేనానిగ రణ – భేరి వేయుమనెను

వ॥ ఇంతలో –

రగడ:–

సింహనాదమే చేసెను నాగమ – సేనలొ చెలరేగి
తన కెదిరికి బేధంబు తెలియని – తికమకగానుండె
ప్రళయకాళివలె నాగసానియు – పయనము అయినాది
వ॥ అంతట బ్రహ్మయ్యనాయుడు –

రగడ:–

రణవీర కుంతం బట్టెనో	॥ సై ॥
రణమో రణమో యంటనో	॥ సై ॥
కన్నమదాసే కదలెరా	॥ సై ॥
సేనలన్ని చెలరేగాయా	॥ భళానంటి ॥

వ॥ ఈ ప్రకారంబున సేనలన్నీ – "కన్ననేడా, సూరినేడా, పేరినేడా లెండి – రండి – పదండి – అరరె" –

–: యుద్ధవర్ణన–నరసింగరాజు బాలచంద్రుల ద్వంద్వయుద్ధము–నరసింగుడు బాలుని బల్లెముతో పొడుచుట–బాలుడు నరసింగుని తల నరకుట పలనాటి వీరులందరును మరణించుట :–

రగడ:–

పటపట పటపట పండ్లుగొరుకుచును – పటుతరగతి వేగ
కటకట కటకట కోరలొరిపిడికి – చిటపటయని నిప్పుల్
రెట్టలుదట్టుచు అరెరేరేయని – మిట్టిపడుచు వేగ
పొట్టిమీసములు పట్టిదువ్వి – కనుబొమలు ముడియబట్టి
పఠాకత్తులూ కఠార్లు బాకులు – తటాలు నందుకొని
పెఠిల్లుమని కక్కటిల్లుచును – దిక్తటంబు లదరగను
గండ్రగొడ్డండ్లు కత్తులు బాణా – కర్రలు చేబూని
వేండ్రమైన రోకండ్లు గుదియలును – భిండివాలములును
తళతళ నాకసమందు మెరయగా – తలపడె నిరువాగుల్
కరులు సేనలను నురుమాడుచు – మున్ముందుకేగుచుండ
రణభ్భేరి ధణధణలకు ధరణి – దద్దరిల్లుచుండ
శరవేగంబున శత్రుసేనలో – చొరబడి బాలుండు

ధరణిమీద నరివీరుల తలలు – తరుగుచు బాలుండు
విచ్చుకత్తి నరివీరుల రొమ్ముల – కుమ్మి చిమ్ముచుండ
గుండెలు ప్రేవులు వొక్కుమ్మడిగా –తుండెములై జార
కొండల రీతిగ శవములన్నియును – గుట్టలుబడుచుండ
నెత్తురు చిమ్ముచు తలలు మొండెములు – దొర్లాడుచునుండ
శత్రుసేనలూ చెదరి బెదరెనూ – చెట్లకు గుట్టలకు

వ॥ ఈ రీతి వూరిమార్గమున పారిపోవుసేనల పురికొల్పుచు నరసరాజు ముందు కురవడించగా –

రగడ:–

మిడిసి భగ్గుమని మండుచు చిచ్చర – పిడుగు చందమునను
నరికివేతు నరసింగరాజునిక – రమ్మని బాలుండు
యెదురబళ్ళ యుద్ధానికి తలపడె – నిద్దరు సరదార్లు
రెండుకొండ లొక్కుమ్మడి ఢీకొను – గండు మిగులుచుండ
సూటిగ బాలుని డొక్కలొ బల్లెము – నాటె నరసరాజు

వ॥ వేటుపడిన బాలుడు ఈటెను లాగివైచి, జారిన పేగులు గంగధార మడుగున కడిగి, వీరకాశ గట్టిగ బిగించి, “రాజా! నరసింగరాజ!

రగడ:–

తలచుకొనుము నీ తాతలను ము – త్తాతల నన్నాడు
వేటుబడ్డ పులిబిడ్డ చందమున – గీటుచు దంతములు
తెప్పరిల్లి నరసింగరాజుపై – కుప్పళించి దూకి
దెబ్బకు నరికెను నరసరాజుతల – దొర్లె ధరణిపైన

వ॥ ఇట్టి సంకుల సమరమందు కొమ్ము పొట్టేళ్ళు, కోడెగిత్తలు కుమ్మి చిమ్మి వేయుచుండ

వందలాది ప్రజ కూలిరా ॥ సై ॥
వీరులంత నేలకొరిగిరా ॥ సై ॥
మలిదేవరాజులు చెల్లిరా ॥ సై ॥
కన్నమదాసే కూలాడా ॥ భళానంటి ॥

వందలమందిని కూర్చిరా ॥ సై ॥
వైరి బల్లముల చీల్చెరా ॥ సై ॥
పల్లనాటి పులిబిడ్డరా ॥ భళానంటి॥
బాలుడు భువిపై వ్రాలాడా ॥ భళానంటి ॥

అన్నదమ్ములా రక్తము ॥ సై ॥
నాగులేరై పారెరా ॥ సై ॥
మొండెములన్నీ నాయనా ॥ సై ॥
యెత్తిపోతలే దూకాయా ॥ భళానంటి ॥

రక్తమందునా డోకుచూ ॥ సై ॥
యెత్తిన కత్తిని దించక ॥ సై ॥
శవాలపై నాగమ్మను ॥ సై ॥
నాయుడు బ్రహ్మయ్య చూచాడా ॥ భళానంటి ॥

వ॥ "ఓ నాగమ్మా?"

రగడ:–

"రక్తదాహము తీరక యింకా కత్తిపట్టినావా
అన్నదమ్ములను చీలదీసి ఇ – ట్లందరి చంపావా
పలనాటి కులస్త్రీల పుస్తెలు – పసుపు కుంకాలు
నేలగలిపితివి నాగమ్మా నీ నీతి పాడుగాను
కట్టుకొనుము ఈ శవాలగుట్టకు – పట్టము అన్నాడు
యేలుకొనుము యీ శ్మశానభూమిని – యేకఛత్రముగను
వెళ్లుచుంటి నే తపము జేసుకొన – తల్లీ నాగమ్మ"
అని బ్రహ్మయ్య నలగొండలవంకకె – అడుగుబెట్టినాడు

వ॥ ఇంతలో

పోరున నొరిగెడి వీరులవలె రవిజారె పశ్చిమాద్రి
వీరయోధులా వేడిరక్తమటు లెర్రబారె నింగి
కక్షల రీతిగ కారుచీకటులు క్రమ్మెను నల్దిశల
గోడు గోడుమని యేడ్పులు కొండలు మారుమ్రోగుచుండ

రాబందులు పెనుగ్రద్దలు రెక్కల చప్పుడు లేచిందా
కుక్కలు నక్కలు నాగమచుట్టూ కూయసాగెనయ్యా
పల్లనాటి యుద్ధము ముగిసిందీ వల్లకాడు జేసి

అన్నదమ్ములా పోరుతో ॥ సై ॥
పతనమైన పల్లనాడురా ॥ సై ॥
తెల్లదొరల చేజిక్కెరా ॥ సై ॥
కొల్లగొట్టి పోయారురా ॥ సై ॥
పాలుబారు పల్లనాడురా ॥ సై ॥
కరువుల కిరవై నిలిచిందా ॥ భళానంటి ॥

– సమాప్తం –

బొబ్బిలియుద్ధం

(బుఱ్ఱకథ)

రచన : షేక్ నాజర్

(ప్రథమ ముద్రణ : 1959, జనతా ప్రచురణాలయం, విజయవాడ)

అంకితం

అజ్ఞాత జానపద కవులకు

యక్షగాన గాయకులకు

– నాజర్

ఒక మాట

నాటి యక్షగానాలే నేటి బుర్రకథలు, వీధిభాగవతాలు. ఆంధ్రప్రజల అపార ప్రేమానురాగాలు, ప్రోత్సాహంతో నేను గత 15, 16 సంవత్సరాలనుంచి ఈ రంగంలో కృషిచేస్తూవచ్చాను. నేనీనాడు ప్రాచీన యక్షగానాల అడుగుజాడల్లో, ఆ కళాసంప్రదాయాలను పాటిస్తూ 'బొబ్బిలి యుద్ధం' అనే ఆంధ్ర చారిత్రక గాథను మీ ముందుంచుతున్నాను. పల్నాటి యుద్ధాన్ని ఆదరించినట్లే దీనికి కూడా మీ ప్రొత్సాహం లభించగలదని ఆశించుచున్నాను. యక్షగాన సాహిత్యము, దాని పుట్టుపూర్వోత్తరాలు, ఈనాటి మన కర్తవ్యాన్ని గురించి త్వరలో గ్రంథరూపంలో మీ ముందుంచగలను. దీనికి మీ అమూల్యమైన సలహాలు, ప్రోత్సాహము లభించగలదని ఆశించుచున్నాను.

ఈ కథను వ్రాయుటకు నన్ను అనేక విధాల ప్రోత్సాహపరచి, సలహాలనిచ్చి, తోడ్పడిన శ్రీగన్నాబత్తుల నారాయణమూర్తిగారికి, వారి అన్నదమ్ములకు, శ్రీ కె. రమేశ్‌గారికి, ఈ కథ రాణించేందుకు తోడ్పడిన వంతలు శ్రీ నందిగం వెంకటేశ్వరరావు, చిన్నబ్బాయిగార్లకు, నన్ను నా కథల్ని ఆదరించే ఆంధ్రప్రజలకు, నా అభివృద్ధికి తోడ్పడిన మిత్రులకు నా హృదయపూర్వక అభివందనాలు.

– నాజర్

బొబ్బిలియుద్ధం

(బుఱ్ఱకథ)

ప్రార్థన

రాగం – నీలాంబరి – ఆదితాళం

శృంగారలహరి – ఆ
శ్రితజన శుభకరి ॥ శృం ॥

సంగీత బోధానందా
మధుమాధురి, మధుమాకరి
మంగళాంగి మదనారి
మనోహరి, మామ వ ॥ సా ॥

అంగజారి హృదయంగమ దరహాసితే
అఖిలాగమ సన్నుతే
భృంగచికుర కరుణాభరభరితే
తంగ జఘన లవితే సురసేవితే
లింగరాజ వచనాంబుజ పూజితే ॥ సా ॥

రిసనిప సనిపమ గమపా, గమపసనిప
గమపని సరిసని సనిపమ పనిపమ పమగమ రిగమ
రిగరి పామా గామపని ససనిప
నినిపమ పపమగ మమగస మగపమ
నిపసని సమ గమపనిదనిపద పపమగస
పమగస నిపమగస సనిపమగస రిసనిపమగామపని ॥శృం ॥

అ॥ చం॥ శ్రీగల ఆంధ్రామాతను దలతున్
త్యాగరాజ శ్రీనాథుల గొలుతున్
భరతమునీంద్రుని మదిపూజింతున్
జోడుగుమ్మెటలు తాధిమియనగన్
తోడుగ వంతలు నాడుచుపాడన్
రగడలు, దరువులు, కందార్థములన్
రాగతాళ నృత్యాదులమరగన్
తంబురకథ గానంబు చేసెదన్ ॥

వచనము :– ఇట్టి మహామహులందరిన్ మదిదలంచి, ఇప్పటికి 200 సంవత్సరములకు పూర్వము బొబ్బిలి, విజయనగరాల వీరోచితపోరాట చరిత్ర దెల్పెదన్.

–: కథాప్రారంభము :–

రగడ:–శ్రీకరముగ నా యమరవీరులను – స్థిరముగ మదినెంచి
ప్రాకటముగ సత్కథ రచియించితి – ప్రాజ్ఞుల నుతియించి
శ్రీరంజిల్లెడు దేశము బంగరు – తెలుగుదేశమన్న
సత్యము, ధర్మము, నాల్గుపాదముల–నడచెనన్న మొన్న
ఇచ్చట బొబ్బిలి, విజయనగర రణ – ధీరులొరిగిరన్న
విచ్చుకత్తులా ఒరిపిడి మెరుపులు – ఆరలేదురన్న
ఇక్కడ బుట్టిన కుందేల్ కుక్కల – ధిక్కరించునన్న
చుక్కదున్నలు, పాడిగేదె లెక – సక్కెమాడునన్న
ఇట్టి జాతి నైజాము నవాబుకు – వెట్టి జేసెనన్న
కట్టుబాటులున్, కలిమిబల్మియున్ – కాలిపోయెనన్న

ద్విపద :–వినరయ్య ఘనులార – విజ్ఞానులార
కనరయ్య మనజాతి – ఘనమైన కీర్తి
నిజమైన రతనమ్ము విజయనగరమ్ము
విజయనగరమునేలు – వీరులెవరన్న

వ॥ నైజాం నవాబుకు యేటేటా లక్షలధనం కప్పం చెల్లిస్తూ.

రగడ: –విజయనగరమును యుక్తిగ నేలే – విజయరామరాజు
రాజుమంత్రి యసాధ్యుడు బుర్రా బుచ్చన్నున్నాడ
నాణ్యతమించిన లక్షదండు నా – కున్నది యంటాడ
రాజ్యమునేలగ క్షత్రియు డొకడే – తగునని యంటాడ
ఏకఛత్రముగ తెలుగుదేశమును – ఏలెదనంటాడ
ఆక్రమించెదను తెలుగునాట నా – కెదురేదంటాడ॥

మంజరీ ద్విపద:– అరయ విజయనగరు దరిదాపునందు
సిరులతో బొబ్బిలి చెన్నారుచుండె
అలపాదుషా పదును – తలవారు క్రింద
బొబ్బిలినేలిన – ప్రోడలెవరన్న–

రగడ: –నర్సారాయుడు మంత్రి, సర్వ – సేనాని ధర్మారావు
ఖండనపండితు డంగరక్షకుడు – వెంగళరాయుండు
గండరగండు డజేయుడాలమున – తాండ్ర పాపరావు
పతాకత్తి యుద్ధాన ప్రవీణుడు – పతాల రామన్న
ముకుంద బల్లెమ్ముర్వడిచేసే – ముత్యాల్పాపన్న
కత్తులెత్తి తెల్గా ల్వెల్మలూ – కదం త్రొక్కుచుండ
ప్రేమతో బొబ్బిలి నేలుచుండెనా – ప్రభువు రంగరావు

–:బొబ్బిలి రాణి మల్లమదేవి–రావు రంగారావు దంపతులకు కొడుకు పుట్టుట:–

మంజరీ ద్విపద:– రాణిమల్లమదేవి – రంగయ్య పత్ని
రమణుల చేమంతి – రతనాల దొంతి
అమృతవాక్కుల వాణి అందాల రాణి
పతిపాదముల నాని పలెకి నలివేణి

వ॥ నాథా! రంగారాయప్రభూ –

రగడ: –సంపద సౌఖ్యములున్నవి మనసుకు – శాంతిలేదు నాథ
సంతతిలేని సతి కందము చందము – లెందుకు నానాథ
పుట్టగతులు లేవందురె పుడమిలొ–పుత్రులు లేకున్న
పుత్రులకై యాపుణ్యభూములకు పోవుదమన్నాది

వ॥ ఈ విధంబుగా ఆ పుణ్యదంపతులు సంతతి బడయుటకై బావులు, చెరువులు త్రవ్వించిరి. అనేక సత్కార్యములు చేసి, వ్రతాలాచరించి, ఎన్నో నోములునోచి, రకరకముల ఔషధములు కూడా సేవించిరి.

తే॥గీ॥ మందుమాకులొ, దేవుళ్ళ మహిమలేమొ
కుందరదనకు గర్భంబు కుదురుకొనియె
మందయానకు తొమ్మిదోమాస మేగె
ఇందుముఖి బిడ్డనొప్పుల కుందుచుండ.

రగడ:–తపస్సు పండెనా మల్లమదేవికి – తనయుడు పుట్టాడు
తల్లిదండ్రి కులకోటి బంధువుల – కనుల పండుగాయె.

వ॥ రంగారాయ ప్రభువుకు పుత్రుడు కలిగాడని వినగానె ప్రజలందరూ మురిసిపోయారు.

అ॥చం॥ పచ్చపచ్చనీ పసిడి తోరణాలున్ ॥తందాన॥
ఉత్సవాలు నడివీథుల చెలరేగెన్ ”
దిక్కుదిక్కులా ఆనందము నిండిందా ”
పెచ్చుగ భేరీ వీరణాలు మ్రోగెన్ ”
వెంకట్రావని పేరు పెట్టినారే ”
బిడ్డను చూచి వూరు చాల మురిసెన్. ”

–: యువరాజు రావు వెంగళరావు 'ఆకులకట్ట' అడవికి వేటకు వెళ్ళుట :–

వ॥ ఈ విధముగా బొబ్బిలి ప్రభువులూ ప్రజలూ సంతోషంతో కాలము గడుపుచున్న సమయమందు, యువరాజు రావు వెంగళరావు కూడదని వారించిన అన్నగారిమాట వినక పన్నెండుమంది పాలికాపులతో ఆకులకట్ట అడవికి వేట నిమిత్తం బయలుదేరాడు.

వృ॥రగ॥ గట్టిగా పాగాల్ జుట్టి
గజ్జెలా చెడ్డీలు గట్టి
బారు ఈటెలు చేతబట్టి
పారసీ గుర్రాల నెక్కి
కాపులే తన వెంట సాగారా. ॥నారాయణా॥

రావు వెంగళరావు కదిలాడా ॥నారాయణా॥
ఆకులా కట్టడవిలోనా
చాకచక్యముతోడ వారూ
కొండకోనల వెతకినారూ
బండలా గాలించి నారా ॥వహ్వారే॥
గూళ్ళ పక్షులు గుంపు లేచె
కొంగలే కోలాటమేసె
నక్కలే నాట్యాలుదొక్కె
పందికొక్కులు ఢోలుగొట్టె ॥వహ్వారే॥
చెట్టు గుట్టాలెక్కి చూచారె ॥నారాయణా॥
కొట్టిరా పడవేసి పందినే ॥నారాయణా॥
హుంకరించి ఘీంకరించి
కోరతో చిట్టడవి ద్రుంచి
చెంగు చెంగున చెంగలించి
పంది పరవడి ఉరవడించి ॥వహ్వారే॥
ఆకులా కట్టడవి దాటిందా ॥నారాయణా॥
శత్రులా కోడేరు చేరిందా ॥నారాయణా॥

వ॥ ఎప్పుడైతే ఆ పంది బొబ్బిలివారి సరిహద్దు దాటి విజయరామరాజుకు చెందిన కోడేరు అడవికి చేరిందో అప్పుడు సరిహద్దునందు కాపలావున్న విజనగరపు వీరులు.

వృ॥రగ॥ రివ్వరివ్వన పరుగుబట్టి
ఎవ్వరెవ్వారంటు వచ్చి
బాకులూ బల్లేలు దూసి
బాటకడ్డుగవచ్చి నిలిచీ ॥వహ్వారే॥
పట్టరాదీ పందినన్నారా ॥నారాయణా॥
వచ్చినా దారెళ్ళ మన్నారా ॥నారాయణా॥

రగడ: –అనవిని వెంగళరావు కాగ్రహం–బతిశయించెనయ్య

అదనిది కాదని కోపంబును దిగ–మ్రింగివేసెనయ్య.

వ॥ ఇక అప్పుడు కోపానికి ఇది సమయము కాదని భావించిన రావు వెంగళరావు పన్నెండుమంది పాలికాపులతో పుట్టెడు పరాభవంతో పట్నానికి తిరిగివచ్చాడు.... కాని ఆ రాత్రే కోడేరు తగలబడిపోయింది. ఇదే సమయమని భావించి విజయరామరాజు –

కాలిపించె కోడేరును బొబ్బిలి ॥తందాన॥
పేలిపించె కోడేరును బొబ్బిలి ”
సాధించెదనె బొబ్బిలివారి ”
వేధించెదనే వైరుల నేరి ”
తీసెదనే దెబ్బకు దెబ్బ ”
సేనలంపమని నైజాం ప్రభువుల సాయము కోరాడా ॥తందాన॥

–: విజయరామరాజు తన అన్నకొడుకు ఆనందరాజును సైన్యముతో పంపి బొబ్బిలి పంట పొలములను నాశనము చేయించుట :–

వ॥ అప్పుడు విజయరామరాజు తన అన్న కుమారుడైన ఆనందరాజుతో, “నాయనా, ఆనందరాజా! బొబ్బిలిని సాధించుటకు అదను చిక్కినది, లెమ్ము!” అని చెప్పాడు.

రగడ :– పన్నులకని నారాయణపట్నం పొమ్మని అన్నాడ
పన్నును వ్యూహము దారిలో – బొబ్బలియున్నది అన్నాడా
సైన్యముతో యాబొబ్బలి పంటచేలను పాడుచేయవయ్యా
ఎట్టులైన యానేరమంత బొబ్బిలి నెత్తివేయుమయ్యా

వ॥ అదివిని ప్రధానమంత్రి బుర్రా బుచ్చన్న – మహారాజా,

రగడ:– తుమ్మలగుంటా యుద్ధం మనకపు డొమ్మిరాకపోయె
వమ్మయిపోయెను బలుసుపాటి యుద్ధమ్మున మనసేన

వ॥ అని అనగా విని విజయరామరాజు, మహామంత్రీ.

శ్లో॥ అసంతుష్టో ద్విజో నష్టః
సంతుష్టయివ పార్థివః॥
సలజ్జా గణికా నష్టా
నిర్లజ్జేవ కులాంగనా॥

వ॥ తృప్తిలేని బ్రాహ్మణుడు, తృప్తిచెందిన క్షత్రియుడు పాడగుదురు. లజ్జాశీలియగు వేశ్య, లజ్జలేని కులాంగన చెడుదురని పెద్దలనగా వినలేదా? కనుక యుద్ధంలో జయాపజయాలు రెండూ సంభవమే. అంతమాత్రాన సైనికులు మరణించారనీ అపజయం కల్గిందే అనీ భయపడి క్షత్రియులు యుద్ధధర్మాన్ని వీడరు.

రగడ :– రాజ్యకాంక్షతో రణమున చావని – రాజెవడన్నాడ
భారతయుద్ధము జరిగిన హేతువు – రాజ్యకాంక్ష గాదా?
వాలిచావు సుగ్రీవుడు కోరుట – రాజ్యకాంక్ష గాదా?
రాజ్యముకొరకై విభీషణుడు – లంకకు – చేటు తెచ్చెగాదా?
నీతులెన్ని వల్లించిన జరిగిన – నిజమిది యన్నాడా!

వ॥ పినతండ్రి యాజ్ఞాను శిరసావహించి సైన్యసమేతుడై బయలుదేరిన ఆనందరాజు నుద్దేశించి విజయరామరాజు 'నాయనా, ఆనందరాజా!"

రగడ :– అడ్డమువస్తే బుద్ధిచెప్పుమా – బొబ్బిలి కన్నాడ
తగవు పెట్టుకొని తడాక చూపుము – తనయా అన్నాడ.

వ॥ ఇక అటు బొబ్బిలిలో రైతులు, కూలీలు ఏ విధంగా వున్నారంటే,

పాట:– ఆడేటి పాడేటి తుమ్మెదా – వాన
జాడల్లు జూపేటి తుమ్మేదా
సువర్ణముఖి పొంగి తుమ్మెదా – మాకు
నవరత్నములు పండు తుమ్మేదా
వ్యాగావతి పారి తుమ్మెదా – ఢిల్లి
భోగాలు పండాలి తుమ్మేదా
మగనాలి నాటింది తుమ్మెదా – చేను
తెగపండి ఒరిగింది తుమ్మేదా
చేనుగట్టున చూడు తుమ్మెదా – పెద్ద
ఏనుగంతున్నాడె తుమ్మేదా
మునుం వెనకాయేనే తుమ్మెదా – అబ్బ
నడుము కొర్రాయెనే తుమ్మేదా.

వ॥ ఈ విధంగా దండిగా పండిన పంటలు కోసి, కుప్పలు కల్లానవేసి రైతులు కూలీలు ఆనందంగా పాటలు పాడుతూ నూర్పిళ్ళు చేస్తున్నారు.

పాట:– వలియ వలియో వలియా, రా
వేలు గలవాడ, రార పొలిగాడ ॥వలి॥
బంతినున్న బసవన్న
పొలిదిరిగే చానమాల
కాటకాల కాలదన్నాలోయ్ ॥వలి॥
పండి ఒరిగిన పంటతల్లీ
తిండికొరత దీర్చుతల్లీ
కల్లమంతా కాలు మునిగిందా ॥వలి॥
చేలుబండి మూలనిండ
కూలినాలి చల్లగుండ
రాజనాల రాశి పెరిగిందా ॥వలి॥

పాట:– కుప్పనూర్చి పోశాడమ్మా ॥చందమామా రైతు॥
అప్పులన్ని దీర్చాడమ్మా ”
భూసామి బాకీసాకి ”
సావకారి చిల్లరపద్దు ”
పనివాళ్ళ బాదరబంది ”
ప్రభువుల్లా పన్నులరంది ” ॥కు॥
కష్టించి పైరుల బెంచి ॥చందమామా రైతు॥
పండించి ప్రజలకు పంచి ”
మేలుసరుకు లమ్ముతడమ్మా ”
తాలు తరక తింటాడమ్మా ” ॥కు॥
లోకాన్ని బ్రతికిస్తాడే ॥చందమామా రైతు॥
శోకాన్ని భరియిస్తాడే ”
వెన్నకన్న మెత్తనివాడే ”
నీకన్న చల్లని రేడే ” ॥కు॥

ద్విపద :–పంటతల్లిని చూచి – ప్రజ సంతసించె
ఇంట కరువు దీరు – కంటి నీరింకు
నని ప్రజల్ కొండంత – యాశతోనుండ
మనసున చింతలు – మాసిపోనుండ

–: బొబ్బిలి రైతులు ప్రభువు రంగారావుతో మొరపెట్టుకొనుట – రైతులు ఆనందరాజును అడ్డగించి తమ నష్టమునకు పరిహారమును కట్టించుకొనుట :–

విజయరామ రాజంపిన సేన ॥తందాన॥
పసిడిపంట పడద్రొక్కి వేసెన ”
పంటలుపోయిన రైతుబిడ్డలు ”
కంటనీరిడి పరుగున వచ్చి ”
రంగరాయ – రంగరాయ, అయ్యా
భంగమాయెను – బ్రతుకు రంగరాయ
మే తేది పశువుకు – రంగరాయ
మేమెట్లు బ్రతికేము – రంగరాయ
ఆశలే కూలాయి – రంగరాయ
ఆపదలు వచ్చాయి – రంగరాయ
బిచ్చమెత్తితె మెతుకు – రంగరాయ
చచ్చుటే మేలయ్య – రంగరాయ
ఆకొన్నవారికి – రంగరాయ
అన్నాలు బెట్టాము – రంగరాయ
చేయెత్తి దానాలు – రంగరాయ
చేశాము లేదనక – రంగరాయ
ఆకలెరుగము మేము – రంగరాయ
శోకమెరుగము మేము – రంగరాయ
రామరాజు సేన – రంగరాయ
నీమాలు మరిచేన – రంగరాయ
పౌజు పరుగుదీసె – రంగరాయ

పైరు పాడయింది – రంగరాయ
మెతుకు కరువైపోయె – రంగరాయ
తిరిపాల బ్రతుకాయె – రంగరాయ

వ॥ అని ఈ ప్రకారంబుగా కూలీరైతులు మొరపెట్టుకొనగా విని రంగారావు మది కలతచెందింది.

రగడ :– తాలిమి తాలిమి దాతలార నా – కూలిరైతులారా

దరువు :– తెరిపె మెత్తనేల – మీకీ
దీనత నేడేల – ॥తిరిపె॥
గోనెలాదిగా – కోటలో ధాన్యము
కొలిపించెదనే – పాటకజనులకు ॥తిరిపె॥
పంటలు బోయిన – బంగరు భూమికి
పన్నులు మిమ్మీ – ఏటికడుగమూ ॥తిరిపె॥

వ॥ అప్పుడు నారాయణపట్నం నుంచి పన్నులు వసూలుచేసి వస్తున్న ఆనందరాజును బొబ్బిలి పొలిమేరలో నిలవేసి తమకు జరిగిన నష్టానికి పరిహారం కట్టించుకున్నారు. తిరిగి వచ్చిన ఆనందరాజును చూచి విజయరామరాజు –

రగడ:– పాడుచేస్తి వానందరాజ – పన్నుగడన్నాడా
పోరుచేయమని చెప్పి పంపితే – పారివస్తివటరా
ఏరాచస్తే నిన్నునమ్మి నే – నెన్నో బొంకానే
మీరిపోయెనా బొబ్బిలి దుండగ – మీనాడన్నాడా
దారిన పన్నులకెళితె వారితో – తగవేనన్నానే
పాద్షాకడ నామాటలన్నియు – పచ్చికల్లలాయెన్

మంజరీ ద్విపద:– విజయరామారాజు విశ్రాంతిగొనడు
నిదుర కంటికి రాదు నెమ్మది లేదు
కడుపున కసికోత కడురేగె మంట
పుండు పుడక గాథ యెండని బాధ

వ॥ నారాయణపట్నం నుంచి పన్నులు తెచ్చుచున్న తన అన్నకుమారుడు ఆనందరాజును బెదిరించి బొబ్బిలివారు ఆ పన్నులు కాజేశారని విజయరామరాజు నైజాంనవాబుకు కబురుపంపి ఇటు.

-: విజయరామరాజు బొబ్బిలివీరులను కోడిపందెమున కాహ్వానించుట -
కోడిపందెములో కలహములు పుట్టుట :-

రగడ :- కోడిపందెముకు వెంగళరావును రమ్మని కబురంపె
రోసమున్న బడిపుంజులున్న వడి తెమ్మని కబురంపె

వ॥ ఆ జాబును చదివిన రావువెంగళరావు, అన్నా!

ద్విపద :-ఎవ్వరీ మహరాజు - యేమిటీ మోజు
ఇవ్విధిన్గోరుట - కేమిటా తోజు

వ॥ అనవిని రంగారావు తమ్ముడా వెంగళరాయా, బొబ్బిలి పెద్దలారా.

కం॥ అ॥ అన్నా వినుడీ మహరా
జన్నెము పున్నెంబునెరుగ - నామన్నెములో
ఎన్నోకుట్రలు, కలతలు
పన్నియు నా మన్నెప్రజల బాధించినాడా
మన్నేసుల్తాన్బిరుదు గొన్నాడ
కన్నుమిన్నుగాన కతడే - కమ్మనిట్టుల వ్రాసినాడు
బిరుదుగొన్నాడా॥

వ॥ అయ్యా, వారు ఏదోవిధముగా కయ్యము పెంచ చూచుచున్నారు. అలనాడు కోడేరును గాల్పించింది మనమేననీ, నారాయణపట్నం నుంచి శిస్తులు తెచ్చు ఆనందరాజును అన్యాయంగా దోచుకున్నామనీ, ఇంకా ఈ విధమైన అనేక నేరాల నారోపించి నైజామునవాబును మనకు వ్యతిరేకముగా యుద్ధమునకు రెచ్చగొట్ట జూచుచున్నారు. కనుక ఈ పరిస్థితులలో వెంగళరాయా, ఈ కోడిపందెములకు వెళ్ళటం శ్రేయస్కరం కాదని చెప్పగా, అందుకు వెంగళరావు తాండ్ర పాపారావులు, ప్రభూ -

పోతుగడ్డయను బిరుదుపోవునే ॥తందాన॥
పోరుకు పోవెలె బొబ్బిలిపుంజులు ॥తందాన॥

వ॥ అని పలికి కోడిపందెములకు ఏవిధంగా ప్రయాణమయారనగా.

బొబ్బిలి పర్లాలెత్తిరా ॥ సై ॥

ముప్పిరి నెమళ్ళనెత్తిరా ॥ సై ॥
రంగూన్ రేజాలెత్తిరా ॥ సై ॥
నైజాం ఫిలాలెత్తిరా ॥ సై ॥
అస్లీపుంజుల నెత్తిరా ॥ సై ॥
నల్లజానకత్తు లేరిరా ॥ సై ॥
సానలమీద సాదిరా ॥ సై ॥
సాగిమన్నెమున కొచ్చారా ॥ భళానంటి ॥

వ॥ ఇట్లు బొబ్బిలివారు తమతమ పుంజులతో మన్నెమునకు వచ్చిరి. ఇక అటు విజయనగరంవారు కూడా.

పచ్చకాకులన్ బట్టిరా ॥ సై ॥
అచ్చగ డేగల బట్టిరా ॥ సై ॥
ఇరాను నెమళ్ళ నెత్తిరా ॥ సై ॥
ఠీగరాల వడినెత్తారా ॥ భళానంటి ॥

వ॥ ఇటు అరుదెంచిన ఇరుపక్షములవారు –

మంజరీ ద్విపద:– వేసిరి డేరాలు పేరుపేరెంచి
తీరిచి కటకటాల్ తీర్చికట్టించి
ఆరాజులందరు నట కొల్వుదీరి
పందాలు బెట్టిరీ పంతాలుమీరి

వ॥ బొబ్బిలి పక్షాన మద్దాల వెంకన్న, విజయనగరంవారి పక్షాన విజయాల చంద్రయ్య కోళ్ళనుబట్టే పందెగాళ్లుగా నిర్ణయించుకొనిరి. అప్పుడు ఆ ఇద్దరు పందెగాళ్ళూ–

లెక్క తాడులే తీసిరా ॥ సై ॥
ఒక్కొక్క పుంజును జూచిరా ॥ సై ॥
ఈక వరుసనె జూచిరా ॥ సై ॥
ఇలపై పుంజుల దించారా ॥ భళానంటి ॥

విజయనగర పచ్చకాకిరా ॥ సై ॥
విసురుగ పారే జాతిరా ॥ సై ॥

బొబ్బిలి పర్లాగాచెరా ॥ సై ॥
ధారగ రక్తమ్మొలికిందా ॥ భళానంటి ॥

వ॥ ఇట్లు విజయనగరంవారి పుంజు బరిలో ఒరిగి పోగానే బొబ్బిలివారి వెంట వచ్చిన సుద్దులవారు ఏమంటున్నారనగా –

బొబ్బిలి కోళ్ళకు రోసాలెక్కువ ॥తందాన॥
బొబ్బిలి దొరలకు మీసాలెక్కువ ॥తందాన॥

వ॥ ఆ మాటలు విన్న విజయనగరంవారు –

విజయనగర మిర్రవీగెరా ॥ సై ॥
గుబ గుబ గుబ్బుట్లాడెరా ॥ సై ॥
ముప్పిరి నెమల్ని దించిరా ॥ సై ॥
ఇప్పుడు రమ్మనమన్నారా ॥ భళానంటి ॥
ముప్పిరి నెమలే నాయనా ॥ సై ॥
కొక్కొరోకోయని కూసెరా ॥ సై ॥
తాండ్ర పాపరావ్ లేచెరా ॥ సై ॥
అస్లీ పుంజుల దించెరా ॥ సై ॥
తాండ్రవారి పుంజెగిరిందా
రెండేపట్టులు గొట్టిందా ॥ భళానంటి ॥
ధారగ రక్తం ఒలికిందా ॥ సై ॥
రాజుపుంజు పడి చచ్చిందా ॥ భళానంటి ॥

వ॥ అప్పుడు మరల బొబ్బిలి సుద్దులవారు అందుకొని.

విజయపురి పుంజులకు కూతలెక్కువ ॥తందాన॥
విజయపురి రాజులకు కోతలెక్కువ ॥తందాన॥

వ॥ ఆ మాటలు విని విజయరామరాజు ఏమంటున్నాడు.

రగడ: –ఎందుకురా మీ అదరిపాటు లిం – కెన్నాళ్ళన్నాడ
ముందున్నదిరా ముసళ్ళ పండుగ – మురుపేలన్నాడ
దున్నించిద నే బొబ్బిలిపట్నం – దుక్కిగనన్నాడ

కన్నులురిమి యా తాండ్ర పాపరావ్ – గస్సుమనుచులేచి
బొబ్బిలిపట్నం దుక్కిదున్న నీ – యబ్బతరం గాదు
మాదుపట్నమును దున్నకముందే – బాకున కుమ్మెదరా

వ॥ ఆగండి విజయరామరాజా, ఆగండి పాపారాయా

రగడ:–కోడిపోరు రారాజుల పోరుగ మారనీయకండో
కోడిపోరుతో నాశమాయనా – నాడు పల్లనాడు
పోవుదమిక చాలీపందెములనె – రావు రంగరావు

మంజరీ ద్విపద:– అనవిని వారందరాపిరా పోరు
తమ తమ కోళ్ళతో దారిబట్టారు
మహారాజు కన్నులటు మిన్నెర్రబారె
కక్షలవలె కారుచీకట్లు మీరె.

–: బుస్సీ సైన్యముతో రాజమహేంద్రవరము వచ్చి, సంస్థానాధీశులకు కబురు పెట్టుట – విజయరామరాజు బొబ్బిలివారి లేఖను త్రొక్కిపెట్టి, రాజమహేంద్రవరము వచ్చి, లంచాలు పెట్టి బుస్సీని హైదర్‌జంగ్‌ను లోబరచుకొని, బొబ్బిలివారిపై చాడీలు చెప్పి, వారికోటను తనపేర వ్రాయించుకొనుట :–

వ॥ ఇట్లుండ నింతలో ... ...

లష్కరుతోనా – బుస్సీవచ్చెన్ ॥ రామ ॥
రాజమండ్రిలో – మకాంబెట్టెన్ ॥ రామ ॥
రాజులందరికి – జాబులనంపెన్ ॥ రామ ॥
హాజరుగమ్మని – ఆజ్ఞల బంపెన్ ॥ రామ ॥
రామరాజుకీ – జాబులందెనయ్యా ॥ రామ ॥

వ॥ అప్పుడు విజయరామరాజు ఆనందరాజుతో 'నాయనా, ఆనందరాజా! బొబ్బిలివారి మంచిచెడ్డలు బుస్సీహైదరుల చెవినిపడక ముందే మనం జాగ్రత్త వహించాలి.

బుస్సీ హైదరుల – డబ్బుతో కొనెదన్ ॥ రామ ॥
బొబ్బిలి వెలమల – బూదిచేసెదన్ ॥ రామ ॥

ఏలుము తెలివిగ – విజయనగరమున్ ॥ రామ ॥
ఏలెద నే నా – బొబ్బిలి ననెయెన్ ॥ రామ ॥

వ॥ అని విజయరామరాజు భేగిరావులు తెచ్చిన బొబ్బిలివారి జాబులను కూడా తానే అందుకొని, వారితో 'అయ్యా మీరు బొబ్బిలికి వెళ్ళలేరు. మానవమాత్రుడు చొరలేని చిట్టడవి మధ్యలో వున్నదా బొబ్బిలినగరం. దారి డొంకలు లేని కీకారణ్యం. అడుగడుగున క్రూరమృగముల భయము. ఆ జాబులను నేను వారికి పంపించెదను. మేమిద్దరము కలిసియే రాజమండ్రికి వచ్చెదము' అని చెప్పి ఆ జాబులను చించివేసి తానొక్కడే రాజమండ్రికి బయలుదేరాడు.

అ॥చం॥ బాతుగుడ్లు బడి – కోడీగుడ్లున్
నేతిలడ్లు – బంగారపు వడ్లున్
ఘుమఘుమలాడే – కస్తూరి పునుగున్
ఘనముగ బ్రాంది – విస్కీ భంగున్
నల్లమందు గంజాయి – గోనెలున్
పుల్లకల్లు సారాయి – బానలున్
బంగరు కాన్కలు – బండ్లాకెత్తెన్
వెండి బహుమతులు – ఒంటెలకెత్తెన్
నాగదత్తమూ – దేవదత్తమూన్
నాగస్వర సన్నా – యిలతోడన్
కలియుగార్జునుండనగ – రామరాజ్
కలియవచ్చె – బుస్సీ హైదరులన్ – రామ

వ॥ ఈ విధంబుగా సత్యవరపు రామభద్రరాజు, వత్సవాయి రాయపరాజు, మందపాటి రఘునాథరాజు, చింతలపాటి నీలాద్రిరాజు, మొదలగు శ్రీకాకుళ ప్రాంతపు సామంతరాజులందరూ వచ్చారు. అట్లరుదెంచిన రాజసభను తిలకించి, వారి వందనముల స్వీకరించి, వారికి అభివందనములందజేసి యా బుస్సీ.

రగడ: –రాలేదేమా వెలమదొరకు – మన రాక తెలియలేదా?
రాజులొచ్చెనే హైదరు వెలమలు – రాని హేతువేమి?

వ॥ అప్పటికే విజయరామరాజుకు లొంగిపోయిన హైదరుజంగు బుస్సీకేమీ జవాబు చెప్పలేదు. అప్పుడు విజయరామరాజు లేచి 'అయ్యా, బొబ్బిలి విజయనగరములు కలిసి పరాసుదొరల దర్శనానికి వద్దామని మేము కబురంపగా అందుకు బొబ్బిలివారు–

రగడ: –రేపోమాపో వస్తేవస్తా – మేమి తొందరనిరా
మీకు తొందరగయుంటే – పొమ్మని హేళనచేశారా
మీరూ మేమన లెక్కా బొబ్బిలి – వారికి హైదర్‌జంగ్
వానరబలమును మించిన బలగము – వారిక్రింద గలదు
ఇంచుమించుగా పంచపాండవుల – మించు తెలగవారు
అంచితముగ కురువృద్ధుల – నైన జయించు వెల్మవారు.

వ॥ చాలించు విజయరామరాజా!

మదమున బొబ్బిలి మరచిపోయెనా – మామాటన్నాడ
ఇదిగిదిగో ఫర్మానా రాసితిని – విజయరామరాజ
ఇచ్చిన ఫర్మాన ఒద్దనలేక – పుచ్చుకొంటినయ్య
బొబ్బిలి నేలే పాడుబుద్ధి – నా బొందిలో లేదయ్య
మీ యిష్టంతో ఇస్తే బొబ్బిలి – నే నేలెదనయ్యా
ఎల్ల కాలమూ పాపరాయునితో – పోరెందులకయ్యా

వ॥ ఆ మాటలు విని బుస్సీ – "ఏమీ, ఆ పాపారావు మమ్మల్నెదిరించగల మొనగాడా?" – అనవిని రాజు "ఆగు బాబో గోడలకు చెవులుంటయ్.

గుప్పెడు మీసం గ్రుడ్లింతంతా – రొమ్ము బారెడంత
ఒడ్డూ – పొడుగూ, అడ్డము నిలువూ – దొడ్డ ఏనుగంత
పౌరుషమంతా పాపరాయునిగ – పోతపోసె బ్రహ్మ
పాపయవింటే నల్లవాగులో – ద్రోయును అన్నాడ.

వ॥ అయ్యా బుస్సీదొరా! పాపారావు రాజాము నగరానికి ఠాణేదారుగా వుంటున్నాడు. బొబ్బిలి వెళ్ళవలయునన్న ఆ రాజాము నగరమునుంచే వెళ్ళాలి.

రగడ: –కుక్క కావలి ఉన్నాడండీ – అక్కడ పాపయ్య
దక్కవు ప్రాణాలటుగా వెళ్తే – దండున కన్నాడ

వ॥ అని వారు ఆలోచించి మరొక పెదమార్గాన ప్రయాణమై.

-: బుస్సీ, విజయరామరాజుతో కలిసి బొబ్బిలి వచ్చి, రణభేరి మ్రోగించుట –
వెంగళరావు పెండ్లి వేడుకలలో మునిగియున్న బొబ్బిలి వీరులు
రణభేరి విని ధర్మారావును రాయబారిగా పంపుట :-

మంజరీద్విపద:–మన్నేలు నరికించి మహరాజులొచ్చి
మల్లమ్మ చెరువులో మరిసేనలుంచి
పల్లెదాపున బుస్సి పట్టుడేరాలు
చెరువుగట్టున రాజు నీలిడేరాలు.

రగడ:–ధరణి దద్దరిల ధణాధణా రణభేరీ మోగిందా
కడుభీకరముగ వైరులు సింహనాదములు చేయసాగినారా

వ॥ ఇక యిటు బొబ్బిలివారి కోటలో –

రగడ:–ఊరంతయు పందిళ్ళు పాకలున్ – జోరుగ వేశారా
వీరణాలు మ్రోయంగ తోరణాల్ – తీరిచిదిద్దారా
పెళ్ళికుమాళ్ళకు కంకణాలు వడి – కట్టుచు నున్నారా
వైభవంబుగా నొక్కలగ్నమున – యాభై పెండ్లిండ్లా

మంజరీ ద్విపద:–వీరకంకణధారి వెంగళరావు
ధనధన రణభేరి ధ్వనులు విన్నాడు

వ॥ రణభేరీ విన్న రావు వెంగళరావు.

రగడ:–భేరీ మ్రోగుచున్న దెందులకు – అన్నా అన్నాడ
భేరీ కాదది దొమ్మరివాళ్ళ – డోలని అన్నాడ
అల్ల రేమిటా కోటక్రింద చెపు – మన్నా అన్నాడ
గొల్లవారు తమ గొర్రెగుంపునట – కుదర దోలినారు.

వ॥ కాని అన్నగారి మాటలయందు విశ్వాసము కుదరని వెంగళరావు సగ్రున లేచి కోట బురుజు నెక్కాడు. రంగారాయ ప్రభువుకూడా తమ్ముని వెనుకనే కోటబురుజు నెక్కాడు.

రగడ: –అన్నా సేనతో విజయరామరా – జొచ్చెను అన్నాడ
నన్నిపుడిడువుమ దూకి వారి తెగ – నరికెదనన్నాడ
తాలిమి తాలిమి తమ్ముడా యిది – తరుణము కాదయ్యా
ఆలోచింపక చేసిన కార్యము – హానిదెచ్చునయ్యా

వ॥ మామా దామెర్ల ధర్మారాయా!

రగడ: –మోసము మోసము మొదటికె మోసము – మామా అన్నాడ
ఆశజూపి బుస్సీని బుట్టలో – వేశారన్నాడ
అమ్ముడుపోయెను పరాసువారు – సొమ్ములకన్నాడ
సమ్మతమగు రాజీని చేసుకొని – రమ్మని అన్నాడ

వ॥ మామా! వయసున పెద్దవాడవు, పలుభాషల నెరిగినవాడవు నీకు తెలయనిదేమున్నది. "అనిత్యోభవతి ప్రాణో, మానమాచంద్రతారకం" అన్న సూక్తి ననుసరించి, పుట్టి పెరిగిన జాతికీ, పూజ్యమైన దేశానికీ, ఈ బొబ్బిలికోట పరువు మర్యాదలకును భంగం రానటువంటి ఏ రాజీకైనా, ఎంత ధనము ఖర్చయినా వెనుకాడవద్దు మామా!

రగడ: –ప్రజల బ్రతుకు కాపాడు బాధ్యతే – నిజమని అన్నాడా
మానప్రాణముల త్యాగసమస్యయిది – మరువకు మన్నాడా
తెల్లవారి నీ అల్లుని పెండిలి – తెలుసుగదన్నాడా
పెళ్లికుమారు లదృష్టమెటున్నదొ – పోయిరమ్మన్నాడ

అర్ధ॥ ఏబదిమంది వెల్మల తోడన్
వీరుడు ధర్మారాయుడు కదలెన్
సత్రున బొబ్బిలి కోటలు విడిచెన్
పరాసువారి పారాల్ గడచెన్
సంచి ద్విభాషియె లంచము మేసెన్
బుస్సీడేరకు దారి వదలెన్
తేజీదిగి బుస్సీ దరికరిగెన్
చేతులెత్తి దండాలని పలికెన్

రగడ: –కైపులో వున్నా పరాసుదొర అర – గన్నుల జూచాడా
ఏపని పై నిట కొచ్చినారు – తమరెవరని అన్నాడా
ధరణి రంగరావు నమ్మినబంటును – ధర్మారావునయ్యా
దొరలకు ముందుగ వందనమనె మా – దొర రంగారావు

పాట: – వందనమయ్యా ... ... అయ్యా
పరాసుదొరలకు ॥వం॥
దోసిలొగ్గి రావురంగయ్య దొరనేడు
చేసిన దోసాల క్షమియించ మన్నాడు

మిశ్ర॥ విజయనగరపు రాజుమాటలు
విషము పూసిన పసిడిగుళికలు
మాకు వారికి పగలు రగిలెను
మీకు మాకూ తగవు తగదనె ॥వం॥

రగడ: –కైసాభాయీ రాజుకు ఫర్మాన్ – రాశానన్నాడ
రాజీ రాజుతొ పడమని బుస్సీ – తీర్పుదిద్దినాడా

వ॥ ఆ మాటలు విన్న బొబ్బిలిబిడ్డ కోపము దిగమ్రింగి.

రగడ: –రాసిన ఫర్మాన్ రద్దుచేయుమని – కోరుట లేదయ్య
రాజసమొప్పగ లక్షదండుతో – రాజు వచ్చెనయ్య
ఇరువదినాలుగువేల దండుతో – మీరు వస్తిరయ్య
ఏబదివీరుల వెల్మవీరులతో – నేను వస్తినయ్య
సేనకు సేన బంటుకు బంటూ – సవాలన్నాడా
ఏనుగుపై తమరుండి నిజంబును – తిలకించండయ్య
రాజు జయించిన బొబ్బిలికోటను – రాజు ఏలునయ్య

వ॥ ఆ మాటలు విన్న బుస్సీ 'ధర్మరాయా, చాలించు! మీ ప్రభువు పంపిన రాజీ ఇదియేనా?' అని అడుగ అందుకు ధర్మారావు – 'కాదు, కాదు! ఓ పరాసుదొరా!

రగడ: –ఇచ్చెదమయ్యా మజిలీఖర్చుకు – లక్షని అన్నాడా
వచ్చినందుకు దారిబత్తె – మిపుడిచ్చెద మన్నాడా

ఆరులక్షలిపుడగావుగట్టెద – మదిగాకన్నాడా
మీరేమిచ్చిన మాటదప్పనని – బుస్సీ పలికాడా
ఒప్పగించుడీ రామరాజునకు – బొబ్బిలినన్నాడా
ఇప్పుడె పొండీ కులస్త్రీలతో – వలసలు అన్నాడ

వృ॥ రగడ॥ అట్టిమాటకు ధర్మరాయుం
డగ్గిపిడుగై భగ్గుమని తా
పట్టిమీసం పట్టిదువ్వాడా ॥వహ్వారె–వహ్వా॥
దిగ్గునా కుర్చీని దూకాడా
ఒళ్లుమరచిన ఫ్రెంచిదొర నీ
వన్నమాటింకొక్క మారను
మిమ్ము మీ బలగాన్ని నేనే
ముక్కలుగ చెక్కెదను చూడని
పచ్చలా పిడిబాకు దూశాడా – నారాయణా
తా–రెచ్చి పులివలె రేగి పలికాడా–నారాయణా

రగడ:–గజగజ గజగజ వణకుచు బుస్సీ గదిలోకెళ్ళాడా
నిజముగ రుద్రుని బోలియుండె నా దామెర ధర్మయ్య.

వ॥ దూరంగా వుండి ఈ పరిస్థితినంతా గమనించుచున్న విజయరామరాజు ధర్మారావును పట్టి బంధించమని సేనల కాజ్ఞాపించాడు.

రగడ:–ఎగబడి వచ్చే దండును వెల్మలు – ఏకంగా చూచెన్
కదబడి వచ్చే దండును ధర్మయ – కన్నువిచ్చి చూచెన్
గదుము గదమగా గజ్జెల – గుఱ్ఱం గగనానికి లేచెన్
గుబగుబ గుబగుబ గుఱ్ఱాల్ – కుప్పళించి దూకెన్.
పరుగున వచ్చే దండును ధర్మయ – పఠాన తెగనరికెన్
ఉరుకుచు వచ్చే దండును ధర్మయ – ఊచకోత గోసెన్
దండున్ నరికీ వెల్మలిద్దరిన్ – ధారబోసినారా
దండు మధ్యగా బాటలు గొట్టి – కోటకొచ్చినారా

-: రాయబారము విఫలముకాగా, రంగారావు యుద్ధసన్నద్ధుడగుట-యుద్ధవర్ణనము:-

వ॥ రాజీకని వెళ్ళిన ధర్మారావుకు జరిగిన పరాభవమును విని, రావు వెంగళరావు - మామా!

రగడ:-వలసలు పొమ్మని వాగినవాడిని - విడిచి వచ్చినావా
తగుదునమ్మయని ముసలివగ్గ - అసలెందు కెళ్ళినావా

వ॥ ఆగు, వెంగళరాయా!

రగడ:-కోడేర్వేటకు వెళ్ళితెస్తివీ - కోటకింత చేటు
కోడిపందెమున కెళ్ళితెస్తివీ - కీడును దుందుడు కా
పెంకితనంబున పెద్దలనిట్టుల - వంకపెట్ట తగునా
మామపాదముల వ్రాలి కోరుము - క్షమాపణ యన్నాడ

వ॥ ఈ విధంబుగా రంగారావు వెంగళరావును అనేక విధముల మందలించి సభాసదుల నుద్దేశించి - అయ్యా,

రగడ :- పాపయరానిది రాజీ కుదరదు - రాజుతో నన్నాడ
జాబులంపుదము భేగిరావులతో - రాజామన్నాడ
రొట్టెలందు పాపయ్యకు జాబులు - పెట్టి పంపినారా

వ॥ మధ్యదారిలో పరాసు సైనికులు ఆ భేగిరావులను పట్టి విజయరామరాజు చెంతకు తీసుకొనిరాగా, అతడు ఆ గంపలను, ఆ గంపలయందున్న రొట్టెలను, ఆ రొట్టెల యందున్న జాబులను గమనించి.

రగడ:-కోటకు తగ్గ కోరసింగ మా - కోటలోన లేదు
గోటమీటెద న్నేడీ బొబ్బిలి - కోటల నన్నాడా
ఢంకాపై దెబ్బేసి కోటనే - కొట్టెద నన్నాడా
రొట్టెలు తెచ్చిన భేగిరావులను - గుట్టుగ చంపారా
ముట్టడించెనా మూడు మూలలా - మూడో జాముననే
కోటలుగాచే బొబ్బిలి - వీరులీ కుట్రను గన్నారా.

వ॥ అప్పుడు బొబ్బిలి వీరులెలా వున్నారయా అంటే -
పఠాల్ రామన్న లేచెరా ॥ సై ॥

పఠాకత్తి ఝుళిపించెరా || సై ||
ముత్యాల్ పాపన్న చూచెరా || సై ||
ముకుంద బల్లెం దూసేరా || భళానంటి ||
భేరీ రామక్క లేచెరా || సై ||
భేరీ స్త్రీల నదల్చెరా || సై ||
ధీరత వడిశాల్లందిరా || సై ||
కారమే అడ్డొళ్ళ గట్టారా || భళానంటి ||
వీరసైనికుల్లేచిరా || సై ||
పారసి గుర్రాలెక్కిరా || సై ||
గుర్రాలు సైగలనందెరా || సై ||
కాలుగీటి సకిలించాయా ||భళానంటి ||
తథిగిణ ధోం –
గుప్పట గుప్పట దూకాయా
పిప్పిగ శత్రుల దొొక్కాయా || భళానంటి ||
కత్తి గుండెలో గుచ్చారా
చిటపట చిటపట వడిశలరాళ్ళు
చిత్తజల్లుగ కురిపించారా || భళానంటి ||

రగడ:–పెఠిల్ పెఠిల్ మని శత్రుశిరస్సులు పెట్లుచుండెనన్నా
పఠాకత్తితో కుమ్మి చిమ్మెరా పఠాల రామన్న
ముకుంద బల్లెం కుమ్మిచిమ్మెరా ముత్యాల్ పాపన్న
ముక్కముక్కలుగ శాత్రవులను రామక్క నరికెనన్నా

–: అరివీరభయంకరులై విజృంభించుచున్న బొబ్బిలివీరులను విజయరామరాజు నల్లమందు మాట్లు వేయించి చంపుట – వెంగళరావు యుద్ధమునకు వచ్చుట – అతడు లాడూఖాన్‌ని చంపి తాను గాయపడుట :–

వ॥ ఇట్లు తెగబడి అరివీరభయంకరులై యా బొబ్బిలి వీరులు దేశ, మాన ప్రాణరక్షణకై, తెగించి శత్రుమూకలను చీల్చి చెండాడి చిత్రవధ చేయుచుండగా, అది గాంచి విజయరామరాజు ఏమంటున్నాడు.

రగడ: –ఆరుపుట్లయా నల్లమందుకే – ఆనతి అడిగాడా
ఆరువేల వరహాలను బుస్సీ – దేరా కంపాడా

వ॥ బొబ్బిలి వీరులు శత్రుమూకల దునుముచూ నల్లమందు మాట్లున్న చోటుకు చేరి అది గ్రహించలేక–

మందుమాటులో నాయనా ॥ సై ॥
ఎందరో మాయమాయెనా ॥ సై ॥
పతాల్ రామన్నొరిగెనా ॥ సై ॥
ముత్యాల్ పాపన్నొరిగాడా ॥ భళానంటి ॥

వ॥ ఇట్లు ముత్యాల్ పాపన్న, పతాల్ రామన్న, భేరీ రామక్క మొదలగు అనేకమంది బొబ్బిలి వీరులు వీరోచితముగా పోరుసల్పి, శత్రువులు పన్నిన మాయమాటులో పడి మడిసిరి. తట్టుకోట, పుట్టకోట, మూలబురుజులు, పరాసువారి అండతో విజయరామరాజు ఆక్రమించుకొన్నాడనీ, ఆయా కోటలపై ఇప్పుడు విజయ రామరాజు తన విజయపతాకాల నెత్తనున్నాడనీ విన్న రావు వెంగళరావు అగ్గిమీద గుగ్గిలంవలె భగ్గుభగ్గున మండిపడుతూ.

రగడ: –అన్నా! రణమున కానతివ్వమనె – రావెంగళరావు
ఆగుము పాపయ్యొచ్చేవరకనె – రావు రంగరావు

వ॥ ఆ మాటవిని రావు వెంగళరావు అన్నగారితో "అన్న, మన భేగిరావులను పరాసువారు పట్టి చంపివుంటారు. కనుక బావకు మన జాబులు చేరివుండవు. ఇట్టి సమయమందు బావరాకకై ఎదురుచూస్తూ కూర్చోవటం బావ్యంకాదు. మీరు నాకు యుద్ధానికి ఆనతివ్వనిచో.

పంచు పంచు నా కొచ్చే కత్తుల్
ఎంచు ఎంచు నా కొచ్చే సేనల్
ధాన్యము ధనమెందుకు నాకు
దాచుకొండి తింటానికి మీకు
తెలగబిడ్డడా తెగించిరారా
వెలమబిడ్డడా ఎగబడవేరా

బానిసబ్రతుకులు బ్రతకొద్దర్రా
సోమరి శుంఠలు కావద్దర్రా
జై ఆంధ్రమాతకు జై –

రగడ: –మడెం దన్నగా బొబ్బిలి గుర్రం మబ్బుల కంటిందా
రణం రణంబని వెంగళరాయుడు రణమున కురికాడా
ఆగుమాగుమని లాఢూఖానుండడ్డమొచ్చినాడా
రారారమ్మని లాఢూ వెంగళరావు లాగ్రహమునా
హెూరాహెూరీ ఢాల్ కత్తులూ త్తళత్తళా మెరయా
వీరావేశా నిద్దరీటెలన్ కుమ్మిచిమ్ముకొనిరా
అమ్మాయని ప్రాణాలు వీడినాడప్పుడు లాఢూఖాన్
దిమ్మదిరిగి పడిపోయె ధరణిపై రావెంగళరావు.

వ॥ ఈ విధంబుగా లాఢూఖానుతో పోరుసలిపి, లాఢూఖానును సంహరించి, తీవ్రమైన గాయాలతో నేలబడి దేకుతూ బుస్సీ విజయరామరాజుల దేరాలవైపు సాగిపోతున్నాడనే వార్త విన్న రావు రంగారావు, రాణి మల్లమదేవి హా! కృష్ణా!

రగడ: –ఎంత ఘోరమగు వార్తవింటి మీ – నాటికి అన్నారా
ఎండుమోళ్లుగా మాకీ బ్రతుకులు – ఎందుల కన్నారా
కంటికి మంటికి ఏకధారగా – విలపిస్తున్నారా

వ॥ "దేవీ!

శ్లో॥ ప్రాణం వాపి పరిత్యజ్య
మానమేవాభి రక్షతు।
అనిత్యో భవతి ప్రాణో
మానమాచంద్రతారకం॥

పాణాన్ని పోగొట్టుకొని అయినాసరే మానాన్ని రక్షించుకోవాలి. ఎందుకంటే ప్రాణం అనిత్యమైనది; మానం (ఆత్మగౌరవం) ఆచంద్రతారార్కమూ ఉండేటటువంటిది.

అన్నారు పెద్దలు. దేవీ, వెంగళరావు పెళ్లికి అంతఃపుర స్త్రీలకు పసుపు కుంకుమలు పంపవలసినది నేడు మీకు పదును కత్తులు పంపమన్నాను" అని పలికి రంగారావు కొలువుకు వెళ్ళిపోయాడు. ఇంతలో మల్లమాదేవికి

విజయరామరాజు పంపిన కబురేమనగా–

–: మల్లమదేవి లేఖను విజయరామరాజు తిరస్కరింపగా, ఆమె అతనిని శపించి, కొడుకును దాసి లక్ష్మిచేతికిచ్చి కోట బయటకు పంపించి, ఇతర అంతపురస్త్రీలతో కలిసి అగ్నికి ఆహుతియగుట :–

పసుపు కుంకుమా నిల్పుమంటివమ్మా ॥తందాన॥
పతిభిక్షడగితి పెట్టమంటివమ్మా ॥తందాన॥

వ॥ చెల్లీ, స్త్రీలు కోరదగిన పవిత్రమైన కోర్కెనే నీవూ కోరావు, కాని –

అన్న బ్రతికితే భర్త దక్కడమ్మా ॥తందాన॥
భర్త నివ్వనూ భరణమిత్తునమ్మా ॥తందాన॥

వ॥ అప్పటికే భర్త పలుకులకు కలతచెందిన మల్లమాదేవి విజయరామరాజు పంపిన వర్తమానము విని 'అన్నా విజయరామరాజా'.

సీ॥ కొలువులో కులపత్ని కోక విప్పించి యా
కురురాజు ప్రాణముల్ కోలుపోయె
అలమేటి సైరంధ్రి నవమానపరచి యా
కీచుకుండును చావు నోచుకొనియె
మగనాలి సీతమ్మ నగచాట్ల పాల్జేసి
రావణుండేపాటి రాజ్యమేలె
ననసూయ నానాడు నగుబాట్ల పాల్జేసి
దైవతేజస్సులే దగ్ధమాయె
తే॥గీ॥ ఆత్మనాథుల నీయాశ కాహుతిచ్చి
ఎందరీనాడు నీకు బడేద్చుచుండ్రి
మా యుసురు నీకు తగులుట మానెనేని
సప్తసంద్రాల గలియదా సత్యమకట!

వ॥ ఈ విధముగా నిరాశచెందిన మల్లమాదేవి దాసి లక్ష్మిని పిలిచి 'అమ్మా లక్ష్మీ! ఆలసించిన ఆపదల పాలు కావలసి వస్తుంది. కాని ఈ ముద్దులయ్య –.

రగడ: –ఎన్నిచేసి ఏ దేశమేలగా – నున్నాడోనమ్మా
కన్నులముందీ కసుగందువు కడతేర చూడలేనే

దక్కించమ్మా ఒక్కగాని ఒక దిక్కని అన్నాదా
దాసివి కావీ వంశమాతవని – లోకమంటదమ్మా

మంజరీ ద్విపద:– మా అయ్యపై మరుల్ మాసిపోలేదె
కలనైన గట్టిగా గదిమెరుగనమ్మ
నా మురిపెము మూట – నానోము ఫలము
నామూల ధనము – ఈ నలుసుగదమ్మ

వ॥ తరువాత ఆపసికందును హృదయమునకు హత్తుకొని, 'నాయనా చినవెంకట రంగారాయా!'

రగడ:–దేవకి బిడ్డకు యిచ్చిన దీవన నీకు సాయమయ్య
రామున కిచ్చిన కౌసల్య దీవెనే నీకు సాయమయ్య
ఒణుకుపుట్టె నాతల్లి గుండెలో గుబులేపుట్టిందా
కన్నులద్దుకొని బిడ్డను దాసీ – దోసిట పెట్టిందా

వ॥ మంటలలో బడి ప్రాణత్యాగము చేయు అంతఃపుర స్త్రీల ఆక్రందనలు విన్న మల్లమాదేవి 'రాజా, విజయరామరాజా! నీపాలిటి యముడు బ్రతికియే వున్నాడు. బొబ్బిలిగడ్డ మీదనే నీ బూడిద బుంగల కెత్తించగల'దని చెప్పుచూ.

రగడ:–నూనెమంటలో దానమాయెనా – మానిని మల్లమ్మ
మానవతీ తన తమ్ముని కలలో – కానుపించెనమ్మా
తమ్ముడా నా తమ్మడ లేరా – తమ్మడ పాపయ్య
ఆశలుమాసి, ఆప్తులబాసి – అనాథవైతివయ్య

వ॥ అని పాపారావుకు కలలో కన్పించి చెప్పగా, ఆ మాటలు విన్న పాపారావు త్రుళ్ళిపడి లేచి, దిక్కులం జూచి పరిపరి విధముల మనసు కలత చెందుచుండగా నిక ఇటు బొబ్బిలి కోటలో, రావు రంగారావు యుద్ధమునకు బయలుదేరుతూ నరసారావును పిలిచి, "నాయనా, నరసారాయా! కోటలో పూచిక పుల్లకూడా శత్రువులకు చిక్కకుండా సమస్తమూ అగ్నికి ఆహుతి గావించి నన్ను చేరరమ్ము" అని చెప్పి బయలుదేరుచున్న సమయాన ఎవరో ప్రవేశించి –

–: బుస్సీ పంపిన రాయబారమును రంగారావు తిరస్కరించుట – దాసి లక్ష్మి బాలునితో రాజాం చేరుట – పాపారాయడు జరిగిన ఘోరమును విని, శత్రువును చంప ప్రతిజ్ఞచేసి, ఇద్దరు మిత్రులతో కలసి బొబ్బిలి కోటకు బయలుదేరుట :–

– "జయము! జయము! మహారాజా" అన్నారు.

– "ఎవరు వారు?"

– "నేను బుస్సీ పంపగా వచ్చిన రాయబారిని. నా పేరు హసనల్లీఖాన్."

– "ఏమిటా రాయబారం?"

– "అయ్యా, రంగారాయా! మీరు ఒక్కసారి మీ ప్రజలతో కోట వెలుపలకు రావాలని మా బుస్సీదొర కోర్కె. తాను చేసిన తప్పులకు పశ్చాత్తాపపడి, క్షమాపణకోరి మీ రాజ్యం మీకే ఇచ్చి వేస్తామంటున్నారు".

– "అయ్యా, ఖాన్‌సాహెబా! తప్పులు దండనలు – న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు, పెత్తందారుల చేతిలో పదునైన ఆయుధాలయ్యాయనీ, అవి పాలకులు తమ క్రింది వారిని అణచివేయుటకు ఉపయోగిస్తున్నారు. అట్లు కాకున్న –

రగడ :– మాపై నేరము రుజువు చేయక – మా మొరలే వినక
మీ మా న్యాయాన్యాయములన్నీ మీరు చెప్పదగునా
చివరకొచ్చె నాతోనే అంతము బొబ్బిలి యుద్ధమ్ము
ఎవరిది న్యాయమో ఈశ్వరుడెరుగును వెళ్ళు"మన్నాడా

వ॥ ఆ మాటలు ఆలకించి మాట్లాడుట కేమియు తోచక హసనల్లీఖాన్ వెళ్ళిపోయాడు. ఇకనట రాజాంలో గలగన్న పాపారావు తన మిత్రులైన దేవులపల్లి పెద్దన్న, బుద్ధరాజు వెంకన్నలతో సమాలోచనలు జరుపుచున్న సమయమందు దాసి లక్ష్మి చినవెంకట రంగారావుతో వారి సమ్ముఖమునకు రాగా చూచి–

"లక్ష్మీ,

కం॥ నీవా బొబ్బిలియందు
న్నావా? మరి నిన్నమొన్న నాళుల లేవా?
యే వార్తలు గల వచ్చుట?
బావయు మల్లమ్మదేవి బాగున్నారా?"

వ॥ "అయ్యా, పాపారాయా!

రగడ:–ఎక్కడిబావా ఎక్కడిలోకం బాబూ అన్నాదా
దీపంపెట్టే దిక్కులేదు మనదేవిడి కన్నాదా
రావువంశ భవితవ్యము నీపై నుంచినారు బాబూ
ఆశలు మాసిన అల్లుని నీకడ – కంపినారు బాబూ"

వ॥ దాసి లక్ష్మిమాటలు విని పాపారావుకు దుఃఖము ముంచుకొచ్చె.

రగడ:–నావారంతా మాయమయ్యిరా నేబ్రతికుండగనే
నే నేరీతి తలెత్తుకొందునని బాకుదూసినాడా

వ॥ అదిగాంచి సేవక పెద్దన 'ఆగండి, పాపారాయా ఆత్మహత్య మహాపాపం!'

రగడ:–చచ్చి ఎవరిని సాధిస్తావనె సేవక పెద్దన్న
బ్రతికి నేను సాధించిన ఘనతేమున్నది పెద్దన్నా
దూసినబాకుతో పాపారావ్ కుడిమీసము నరికాడా
ఆశలేని చోటెందుకు కాశీ – కేగెదనన్నాడా

వ॥ పాపారావు మాటలు విని దాసి లక్ష్మి "అయ్యా పాపారాయా, కక్షగట్టిన విజయరామరాజు 'శత్రుశేషం, ఋణశేషం మిగల్చరాదు. గనుక ఈ కసిగందును చంప'మన్నాడు. బుస్సీ అందుల కంగీకరించలేదు. అప్పుడా విజయరామరాజు 'ఇది బొబ్బిలి బిడ్డకాదు పులిబిడ్డ చూడ'మని పండ్లు, ఫలహారాలు, బాకులు, బల్లెముల మధ్య బిడ్డను విడిచిపెట్టగా కరకు కత్తినిదూసి కను లెర్రజేసెనే ఈ కసికందు – అట్టి –

బొబ్బిలి పరువులు నీరుగారెనా	॥తందాన॥
రాతిగుండె దిగజారిపోయెనా	॥తందాన॥
బావలు బంధులు బవరమున నొరిగిరా	॥తందాన॥
లోకుల జెండాల్ కోటలెక్కెనే	॥తందాన॥
చేసిన ప్రతిన చరిత నిలచునే	॥తందాన॥
కాశిలోవున్నా కాకివలెనున్నా"	॥తందాన॥

వ॥ "అమ్మా, ఆగు –

శ్లో॥ ఉపాధ్యాయాన్ దశాఽఽచార్యః
ఆచార్యాణాం శతం పితా

సహస్రం తు పిత్రూన్మాతా
గౌరవేణాతి రిచ్యతే॥

తా॥ పదిమంది ఉపాధ్యాయులకంటె ఒక ఆచార్యుడు అధిక గౌరవార్హుడు. నూర్గురు ఆచార్యులకంటె తండ్రి; తండ్రికంటె వేయిరెట్లు తల్లిన్నీ పూజనీయులు.

వ॥ అట్టి తల్లి, తండ్రి, గురువు, దైవములకన్న నా కర్తవ్యమేదో తెలియజెప్పావు. నీవు దాసివి కాదు, ధర్మదేవతవు. మిత్రులారా! వీడు మీ రాజు, ఈమె మీ రాజమాత. వీరిని మీ ప్రాణాలతో సమంగా చూచుకొని సామర్లకోటలో నున్న మా అక్క జగ్గమాంబకు ఒప్పగించి రండి. దేవులపల్లి పెద్దన్నా! బుద్ధరాజు వెంకన్నా! మీరిద్దరూ నావెంటరండి. మోసాన్ని మోసంతోనే జయిద్దాము, వేషాలు ధరించండి" – అని...

తూరుపురాజుల వేషాల్ వేసెన్ ॥తందాన॥
రాజు పేరుతో జాబుల్ వ్రాసెన్ ॥తందాన॥
పచ్చల బాకులు భద్రము చేసెన్ ॥తందాన॥
బారాతేజీ లెక్కియు కదలెన్ ॥తందాన॥

దరువు॥ శాంభవీ రావే – గంభీర భైరవీ
శంభురాణి నాకభయమీయవే
కుంభిణి నిప్పుడె కూలద్రోసెదన్ ॥శాం॥
చెంతానుండావే – శాత్రవ పుర్రెలతో
బంతూ లాడేదా –
వైరి ప్రేగులన్ జందెమేసెదన్
వారి నెత్తుటను వసంతమాడెదన్ ॥శాం॥

వ॥ ఇట్లు తాండ్ర పాపారావు మిత్రులైన దేవులపల్లి పెద్దన్న, బుద్ధరాజు వెంకన్నలను వెంటబెట్టుకొని శరవేగంతో వచ్చుచుండ, అటు రణరంగమందు రావు రంగారావు–

–: మహావీరుడు రావు రంగారావు ఘోరయుద్ధము చేసి, శత్రుసేనలను తరిమి కొట్టి, లాల్‌ఖాన్‌ని చంపి, నల్లమందు మాటులో పడి వీరస్వర్గమును చేరుట: –

రగడ: –సర్రున ఖడ్గం దూసి దండుపై – తారసిల్లినాడు

అగ్రులు తెగి గుఱ్ఱాల పుఱ్రెల ధరణి దొర్ల నరికె
కండలు మొండెలు గుండెలు ప్రేవులు తుండెములై జార
దండధరునివలె తుండెతుండెములు ఖండిస్తున్నాడా
జబ్బలు దొబ్బలు రక్తంగ్రక్కుచు దిబ్బలు దిబ్బలుగా
సిబ్బందిని పడనరుకుచుండె నా బెబ్బులి రంగరావు
తట్టకోటలో పరాసు దండును తరిమె రంగరావు
పుట్టకోటలో పరాసుదండును పొడిచె రంగరావు
మూలబురుజులో పరాసుదండును కూల్చె రంగరావు
కలవరింతలతొ పరాసుదండు కలవరపడసాగె
అబ్బో కుయ్యో మొఱ్రో అంటూ అరచుచు శాత్రవులు
పాలకొండలకు పారజూసి రా బుస్సి రామరాజుల్

వ॥ ఈ ప్రకారంబున రావు రంగారావు వీరావేశముతో శాత్రవులపై బడి మునుముబట్టి నరికినట్లు కరకు కరవాలమున కరుల ఖండించి, గుఱ్ఱాల గుట్టలు బడద్రుంచి, కాల్బలముల కరపాదముల ఖండఖండములగా ఖండించి చెండాడుచుండ, తలలు, మొండెములూ వేడిరక్తం విరజిమ్ముచూ ధరణిపై తన్నుకొనుచుండ, హాహాకారాలతో విజయనగరసేన, పరాసుదండు చెల్లాచెదురుగా పారిపోవుచుండ – "ఆగండి! ఓ పరాసు సైనికులారా! విజయనగర వీరులారా! వీడే మీ శత్రువు రావు రంగారావు! వీడిని జయించండి!

రగడ: –పారుట చూచిన మిత్రులు శత్రులు పకపక నవ్వుదురు
మీరు రేపు ఈ ప్రజలమోము లేతీరుగ చూచెదరు"

వ॥ అనవిని హైదర్‌జంగు రోషావేశంబున పరాసుదండును విజయనగర వీరులనూ ఉసికొల్పుతూ నల్లమందు మాటులో రంగారావును దూకించు యత్నముతో ముందు కొచ్చె – అప్పుడు రంగారావు అతనిని చూచి...

రగడ: –నిలువు నిలువుము హైదరుజంగ్ నీతిగ నన్నాడా
కలియబడగ నా వీరులిద్దరూ కత్తులు గలిపారా
కరకు కత్తులా ఒరిపిడి మెరుపులు కావురు గమ్మిందా
ధరణి దద్దరిల హుంకరించుచు తారసిల్లినారా

ఆఖరిదశలో రొప్పుతు రోజుతు హైదర్‌జంగూజీ
ఆవో చస్తిని చస్తినిప్పుడని అరచెను హైదర్‌జంగ్
చాటుగ రంగయ తల నడిమికి తెగనరికె లాల్‌ఖాన్

వ॥ అబ్బా! అరే లాల్ఖాను! చచ్చితివిక అని రావు రంగారావు రెండుగా చీలిన తలను పట్టుదట్టీతో బిగగట్టి–

రగడ:–రారా రమ్మని రంకెలు వేయుచు రావు రంగరావు
పెఠిల్ పెఠిల్ మని కక్కరిల్లుచున్ పఠాకత్తి దూసి
తెప్పరిల్లియా లాల్‌ఖానుపై కుప్పళించి దూకి
దెబ్బకు నరికెను లాల్‌ఖానుతల దొర్లె ధరణిపైన

వ॥ నిలు, హైదర్‌జంగ్ నిలు అంటూ.

రగడ:–హైదరుజంగ్‌ను హతమార్చగ తా నురుకుచు రంగరావు
మాయమయ్యె నల్లమందుమాటులో మాన్యుడు రంగయ్య
వీరమరణములు జూడక పడమట జారె సూర్యుడపుడు
మృత్యువురీతిని రాజును చీకటి ముట్టడించె నపుడు

వ॥ ఇట్లు రంగారావు ప్రభువు మాతృభూమి రక్షణకై పోరాడి ఆఖరివాడుగా బొబ్బిలి నేలపై ఒరిగిపోయాడు. పుట్టి పెరిగిన గడ్డకు ప్రాణాలర్పించాడని విని విజయనగర వీరులు, పరాసు బలగమూ వళ్ళుమరచి నిద్రించుచుండ – పులి, బొబ్బిలిపులి.

–: బొబ్బిలిపులియైన తాండ్ర పాపారాయడు రాత్రివేళ విజయరామరాజు డేరాలో ప్రవేశించి, అతనిని పొడిచి చంపి పగతీర్చుకొనుట :–

ఆ.వె. విజయరామరాజ! వేగలెమ్మిదె వచ్చె
దండధరుని రీతి మండిపడుచు
కొండనైన గ్రుద్ది పిండిచేసెదనంచు
తాండ్ర పాపరావు తారసిల్లె.

తాండ్ర పాపారావిట నుండెరా – నీ
గుండెలపై కూర్చుండెరా
ఈంద్రమైన యావేద నెగయగన్

కాంఢ్రు కాంఢ్రు మనుచున్
బొబ్బిలిపులి యుండెరా.

రగడ: –దున్నించితివా బొబ్బిలిపట్నం విజయరామరాజ!
దున్నకమున్నే నిను నా బాకున కుమ్ముచునున్నాడ
నారసింహు డా హిరణ్యకశిపుని చీరిన చందాన
ఆరక పగచల్లారక ఎన్నో బాకుపోట్లు పొడువ
విల విల దన్నుక వీడె ప్రాణములు విజయరామరాజు
కలలన్నీ కల్లలాయె కోరికలు గాలిమేడలాయె

వ॥ వెంటనే ఆ ముగ్గురు మిత్రులూ విజయరామరాజును సంహరించి...

రగడ: –రచ్చబండలా రేవులదగ్గర కొచ్చి దూకినారా
విచ్చుకత్తులా ముగ్గురు యోధులు వొరిగిపోయినారా
నాటికి నేటికి వారి కీర్తి ఘనచరితై నిలిచిందా!
నేటి ఆంధ్రుల త్యాగనిరతి కది బాటలు దిద్దిందా!!

(సంపూర్ణం)

అల్లూరి సీతారామరాజు

(బుఱ్ఱకథ)

రచన

సుంకర సత్యనారాయణ

(ప్రథమ ముద్రణ: **1953**, విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ)



పద్మశ్రీ షేక్ నాజర్ బుఱ్ఱకథ దళము (గుంటూరు)

పరిచయం

మొదటి ప్రపంచ సంగ్రామంలో (1914–18) భారత ప్రజలు ఎన్నో యిక్కట్టుల పాలయ్యారు. బ్రిటిషు సామ్రాజ్యవాదులు తమ రాజ్య రక్షణకోసం భారతీయుల ధనప్రాణాలను బలి యిచ్చారు. దీనికి అసమ్మతి తెలుపుతూ టెర్రరిస్టు ఉద్యమం బయలుదేరింది. భారతదేశానికి స్వయం నిర్ణయాధికారం యిస్తామని ఆపత్కాల వాగ్ధానాలు చేసిన బ్రిటిషు ప్రభుత్వం యుద్ధానంతరం వీటిని అమలు జరుపలేదు. ప్రజలలో నివురుగప్పివున్న విప్లవాగ్నులు ప్రజ్వరిల్ల సాగాయి. వీటిని అణచడానికి బ్రిటిషు ప్రభుత్వం రౌలట్ చట్టం అనే నిరంకుశ శాసనం తయారుచేసింది. దీనిని వ్యతిరేకించుతూ భారతదేశమంతటా ప్రజలు బ్రహ్మాండమైన ప్రదర్శనలు చేశారు. ప్రభుత్వం అనేకచోట్ల సైనిక శాసనం అమలు జరిపి, జలియన్ వాలాబాగ్ లాంటి దురంతాలు జరిపింది.

యుద్ధకాలంలో ప్రభుత్వంతో సహకారం చేసిన గాంధీజీవంటి మితవాదులుకూడ యిదంతా గమనించారు. ఒకవైపున బ్రిటిషు ప్రభుత్వం తన వాగ్దానాలను భగ్నం చేసింది. రెండోవైపు ప్రజావెల్లువ చెలరేగింది. ఈ సమయంలో (1919–21) గాంధీజీ సహాయ నిరాకరణోద్యమం నడుపబూనుకున్నాడు. కాని. "అహింస" అనే విప్లవ వ్యతిరేక సూత్రాలను ప్రజా ఉద్యమానికి అడ్డుకట్టలుగా వేశాడు. చౌరీచౌరాలో ప్రజలు తమపై తుపాకులు కాల్చిన పోలీసుల్ని చంపారనే సాకుతో ఉద్యమాన్ని మధ్యలోనే ఆపాడు.

మన ఆంధ్రదేశములో పల్నాడులో రైతులు పన్నుల నిరాకరణం చేశారు. వీరహనుమంతు ప్రాణాలను ప్రభుత్వం బలిగొంది. కాని నాయకులు విప్లవ పద్ధతితో నడువకపోవడంవల్ల ప్రజాఉద్యమాన్ని ప్రభుత్వం అణచివేయగలిగింది.

సహాయ నిరాకరణోద్యమ జ్వాలలు చల్లారాక, అల్లూరి సీతారామరాజు మన్య ప్రాంతంలో ప్రజావిప్లవాన్ని నడిపాడు. టెర్రరిస్టు ఉద్యమాన్నుంచి, సహాయ

నిరాకరణోద్యమాన్నుంచి కూడా అనుభవాలను గ్రహించాడు. టెర్రరిస్టులవలె నిరంకుశ ప్రభుత్వోద్యోగులను హతమార్చడానికి ఆత్మార్పణ మొనరించినంత మాత్రాన ఉపయోగం లేదని గ్రహించాడు. గాంధీజీలా ప్రజాఉద్యమానికి 'అహింస' అనే పేరుతో పరిమితులు ఏర్పరచకూడదని కూడా తెలుసుకున్నాడు.

మాతృదేశ విముక్తికి ధైర్యస్థైర్యాలతో మన్యప్రజలను ఆయత్తం చేశాడు. ప్రజాసహకారంతో విప్లవాన్ని నడిపాడు. బ్రిటిషు ప్రభుత్వాన్ని రెండేళ్ళకుపైగా గడగడ లాడించాడు. కాని యీ విప్లవాన్ని దేశమంతటా వ్యాపింప చేయడానికి ఆంధ్ర నాయకులుగాని, ఇతర నాయకులుగాని తోడ్పడలేదు. మన్యప్రాంతం ప్రజలు, వారి నాయకుడు రాజు బ్రహ్మాండమైన బ్రిటిషుసేనలను ఎంతకాలం ఎదిరించగలరు? ఈ లోపంవల్లనే మన్యవీరులు ఆహుతి కావలసివచ్చింది.

సీతారామరాజుచరిత్ర నిజంగా ఆంధ్రప్రజల స్వాతంత్రోద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింపదగిన దివ్యమైన ఘట్టం. దీనిని బుఱ్ఱకథగా వ్రాసిన రచయిత అభినందనీయులు. మన్యవీరుల చరిత్రనుంచి ఆంధ్రప్రజలందరం ఉత్సాహం పొందుదాం. భారత స్వాతంత్ర్యాన్ని సాధించడానికి, విశాలాంధ్రలో ప్రజారాజ్యాన్ని నిర్మించడానికి ప్రతినబూనుదాం.

ఇట్లు
మద్దుకూరి చంద్రశేఖరరావు

అల్లూరి సీతారామరాజు

(బుఱ్ఱకథ)

ప్రార్థన

మాతృదేశము కొరకు – మరణించు భక్తుల
పూలతో పూజింపరావ–భక్తుల–పూలతో పూజింపరావ ॥మాతృ॥
స్వాతంత్ర్యపోరాటమున – చావో బ్రతుకో తేల్చుకొనెడి
వీరదేశసేవకులకు – వేగరార పూజసేయ ॥మాతృ॥
బానిసలై యిల బ్రతికేకన్న – ప్రజలకు నరకము వేరేలేదని
ప్రజారాజ్యస్థాపనయే మా
పరమావధియని పోరు సల్పుచు ॥మాతృ॥

వంతపాటలు

సంగర రంగ విహారా ధీరా – శాత్రవసంహార
ధీర విచారా ఆంధ్రకుమారా – దీన జనోద్ధార
అందచందముల నందన వనమీ – యాంధ్రదేశమోయి
వినరా యాంధ్రుడ! మన్యసోదరుల – విప్లవకథ నేడు

–: కథాప్రారంభము – గోదావరీ తీరములో భద్రాచల సమీపములో పాపికొండల దగ్గర అరణ్య సౌందర్య వర్ణన :–

శ్రీలలరారెడు తెనుగు దేశమున – జీవనదులు గలవు
మేలురకపు మైదానము లడవులు – వేల గనులు గలవు
మేదిని చరిత్ర ప్రసిద్ధికెక్కె మన – గోదావరి తల్లి

గోదావరి తీరంబున యడవులు – కొండలెన్నొ గలవు
భద్రాచలమా తీర ప్రాంతమున – భాసిల్లెడి నగరు
భద్రాచల కొండకు సమీపమున – పాపికొండలలరు
రమణీయము లున్నతములు ప్రకృతి – రమణికి నగలివిర
అమితోత్సాహంబున గోదావరి – యా కొండల నడుమ
నురుగులు గ్రక్కుచు శరవేగంబున – పరుగు లెత్తుచుండు
నిరుపమానమై యందచందముల – నిలయంబుగ నుండు
ఘోరారణ్యము కప్పివేసెనా – కొండల నన్నిటిని
క్రూరమృగములా మహారణ్యమున – కోరాడుచు నుండు

వ॥ ఆ యరణ్య సౌందర్యము వర్ణనాతీతం

నగశిఖరంబుల నుండి దూకుటా – నదులకు అలవాటు
సొగసుగ తుంపరలట తుషారమన – నెగసి యాడుచుండు
చలవలీను తుంపరల దోచుకొని – జలకమాడియందు
మలయ మారుతము విహరించును ఆ – మన్యభూములందు
కానన సంతానంబును బ్రోచుచు – నానందము నిచ్చు
ప్రాణవాయు విదియే బ్రతికించెడి – పరమౌషధ మిదియె
కనపడు అలనేరేడు ఫలంబులు – కటికి నలుపె కాని
వనదేవీముఖ విషాదచిహ్నము – లన గూడదు వాని
వెలగ పండ్లు వీభూదిపండ్లవలె – తెలతెల్లగ నుండు
తెలుపైనను వన బలహీనత నా – ఫలములు తెలుపవుగ
పైరం గేదైనను లోపలి మధు – పదార్థ మది యెరుపె
పౌరుషమును క్రాంతిని శాంతిని – వనము పూయుచుండు
జలజల ప్రవహించెడి సెలయేరుల – కలకల నాదముల
పలురకంబులగు పక్షులు తమ శ్రుతి – గలిపి పాటపాడ
స్వాతంత్ర్యము నా జన్మహక్కెయని – శబ్దించును వనము

-: ఆంగ్ల ప్రభుత్వము అడవిని రిజర్వుచేసి, కోయలు చెంచులు మొదలైన అడవి జాతుల స్వేచ్ఛను హరించుట :-

వ॥ ఈ మన్యభూమిలో కోయలు, చెంచులు మొదలైన అడవిజాతులవారు నివసించుచున్నారు. వీరు అడవిలోని పండ్లు, దుంపలు, వెదురుబియ్యం తింటూ స్వేచ్ఛగా జీవించుచూ ఉంటారు. కాని ఈనాడు –

దేశమంతటిని దోచుకొన్న పర – దేశప్రభుత్వంబు
నాశము జేయుచు దోచుకొనుట తన – నాగరికతగాన
కాననసీమకు రయమున జనె వి – జ్ఞానమిత్తుననుచు
జ్ఞానోదయమాయెనుగా మన కిట – కావలె నిక నచట
పాదము మోపీ మోపుటె తడవుగ – ప్రభుత్వ మా ప్రజల
ఆదరించదాయెను స్వాతంత్ర్యము – నణచ జూచెగాని
ముందుగ నడవి రిజర్వుచేసి ఖా – మందుల మన్నారు
పందులు స్వేచ్ఛగ తినెడి దుంపలను – ప్రజలు తినిన శిక్ష
పచ్చగ బెరిగిన పచ్చిక నచ్చటి – పశువు లంటరాదు
అచ్చట నట్లే యెండిపోవవలె – అన్యులంటరాదు
మండుటాకలికి నోర్వలేని యే – మన్యవాసియైన
పండు గోసి తినెనా, యిక వానిని – చెండెద మన్నారు
జలగలవలె మన రక్తము బీల్చెడి – జమీందార్ల నిచట
నిలిపిన రీతిగ ముఠాదార్ల నట – నెలకొల్పిరి వారు
లంచగొండ్ల కుద్యోగమిచ్చి యా – కంచర గాడిదల
దించిరి పైవారికి జత కొంపలు – తీయ మన్యమందు

వ॥ వర్గభేదంలేని మన్యాన్ని చీల్చి ముఠాదార్లు, కూలీలు, రైతులు అను మూడు వర్గాలను సృష్టించారు. ఈ మన్య సంపద నంతా కొల్లగొట్టి ఓడలెక్కించాలంటే రహదారులవసరమైనాయి. రోడ్లు వేయించాలనుకున్నారు. ఈ ప్రాంతానికి "బాస్టియను" తహశీల్దారు. ఇత నెలాంటివాడు –

-: దుర్మార్గుడైన 'బాస్టియను' అను తహశీల్దారు అడవి జాతులవారిని హింసించుట:-

అవనిలోని దుర్మార్గ గుణంబుల – నన్నిటి సమకూర్చ
అవతరించె నీ మనుజహంతకుం – డధముడు బాస్టియను
ఈతనిలో లేనట్టి దుర్గుణం – బిలలో లేనట్టె
పోతవిగ్రహము లంచగొండి యొక – పాతకముల పుట్ట
కూలీరైతుల కష్టాన్నంతయు – లీలగ దిగమ్రింగు
కాలసర్ప మొక కానీ కోసము – గడ్డితినెడి రకము

వ॥ ఈతడు మరొకనిపేర తానే ఆ రోడ్లను కంట్రాక్టుకు తీసుకున్నాడు కాని–

ఎంత ధనం బిచ్చిన పోరచటికి – యిచ్చుటి కూలీలు
ఇంతకు మన్యపు కూలీ వలననె – యీపని కావాలి

వ॥ ఇక ఈ నీచ బాస్టియను అమాయకులైన అచ్చుటి కూలీలను హింసించుచూ నిర్బంధముగా పనులు చేయించటం ప్రారంభించాడు. కూలీలు పాటలు పాడుతూ రోడ్డుపని చేస్తున్నారు, ఎలా –

ఏలేయాలా ఏలేయాలా ఐలేసో – ఓహెూ
రామన్నా మా లచ్చుమన్నా రండయ్యా ॥ఏ॥
కొండామీద సీతారామ స్వామీ – ఓహెూ
తిండీబెట్టీ మమ్మూ గావ రావయ్యా ॥ఏ॥
రక్కసుల జంపినట్టి రామన్నా – ఓహెూ
ఈ రక్కసుల బాధదీర్చ రావయ్యా ॥ఏ॥
ఏలేయాలా ఏలేయాలా ఐలేసో – ఓహెూ
కొండమీదా రామయ్యా – ఆ కొండదిగీ రావయ్యా ॥ఏ॥
ఏడ్పించుచు, బెదరించుచు, తిట్టుచు – హింసించుచు వారి
గాడ్పులలో పని చేయించెను ఆ – కఠినుడు బాస్టియను
ఆరణాల కూలిని మీకిచ్చెద – ననుచు పనికి బిలచి
ఆరణాలలో నాల్గణాల నా – యధముడు దిగమింగు

అదియేమని యెవడైన యడిగెనా – ఆతని హింసించు
బెదరి పనికి రాకున్న కిరాతుడు – పెట్టు బాధలెన్నొ
కట్టెలిన్ని "అన్ రిజర్వు"లోనే – కొట్టి తెచ్చుకున్న
పెట్టించును జైలున రిజర్వులో – కొట్టెననుచు వాని

వ॥ "అంగడిలో అన్నీ ఉన్నయ్, అల్లుడినోట్లో శని ఉంది" అన్నట్లుగా ఉంది పాపమా కూలీల స్థితి –

భళాభళానోయ్ తమ్ముడా – సై – భాయిభళానోయ్ దాదానా
అడవి పండ్లు వేలున్నవీ ॥ సై ॥
అంటుకుంటె యమబాధరా ॥ సై ॥
వెదురు బియ్యమే యున్నవీ ॥ సై ॥
పిడికెడు నమలిన శిక్షరా ॥ సై ॥
కొండ తేనెలే యున్నవీ ॥ సై ॥
పిండి త్రాగ దండింతురూ ॥ సై ॥
ఆకలి మంటల జ్వాలలో ॥ సై ॥
అల్లాడుతోందా మన్యంబూ ॥ భళా॥
అంతులేని యాకలితో మాడుచు – అట్లె చావలేక
చింత బెందడిని త్రాగ సాగిరట – చివరకు గతిలేక
బెందడి త్రాగుట కతన నుదరములు – పెరిగి జ్వరము తగిలి
మందొసంగు దిక్కారి యనేకులు – మరణించిరి యడలి

–: 'గాము గంటందొర – గాము మల్లుదొర అను వీరసోదరుల పరిచయము – వీరు 'బాస్టియను' నెదిరింపగా అతడు వీరి భూములను లాగుకొనుట :–

వ॥ ఈ ప్రాంతంలో 'నడింపాలెం' ఒక కుగ్రామం. ఇక్కడ గాము గంటందొర, మల్లుదొర అను సోదరిద్దరు నివసించుతూ వుండేవారు. గంటందొర 'గట్టుపానకాలు' అనే గ్రామానికి మునసబు. ఈ సోదరు లెలాంటివారు –

కూడిచరించెడు జోడు పులులుర – తంధానా తందాన తందన
గంటందొర యన కలియుగార్జునుడు ''

గాము మల్లుదొర భీమబలుడుర ”
విల్లునంబుతో మల్లుకదలెనా ”
వైరుల గుండెలు రెండుగ పగిలీ – పరుగులెత్తవలెర

న్యాయప్రియు లన్యామెరుంగరు – తంధానా తందాన తందన
గ్రామ పెద్దలీ భీమ బలాఢ్యులు ”
మాన్యు లిద్ద రీ మన్య ప్రజలను ”
ప్రాణతుల్యముగ ప్రేమించెదరు ”
ప్రజలున్నూ యీ వీరులకొరకై – ప్రాణములిచ్చెదరు

వ॥ ఒకనాడు యీ యిద్దరిని 'బాస్టియను' పిలిపించి గాము సోదరులారా!
పనిబడి పిలిచితి మిమ్మిద్దర నా – పని నెరవేర్చండి
వినుడు ముఠాదార్లుగ జేసియె మిము – విడచెద నమ్మండి
మడులో మాన్యములో యడగండిదె – బిడియమేల భాయి
అడిగిన ప్రాంతం బిప్పించెద నే – నడిగిన పని జేయ
కూలీలకు పొగరెక్కి యధికముగ – కూలిమ్మన్నారు
జాలి దలచి పని జూపిన నన్నీ – లీల యడిగినారు
ఈ క్షణమున పొగరణచకున్న నే – నెందు కింక బ్రతికి
సాక్షులుగా మీ రుండితీరవలె – సాధించగ వీరి

కీర్తన

గంటందొర– కూడదయ దీనులయ – ఏడిపించ తగదయ
వేడుకొనుచుంటినయ – నేడు దయజూడుమయ ॥కూడ॥
బాస్టియను– వేడినను వీడనుర – బూడిదగ చేసెదర
బేడలివ్వ చాలదని – వీడిరిదె రోడ్డుపని ॥వేడి॥
గం– క్రూరమగు హింసలట – మీరలట పెట్టిరట
ధారలుగ చెమ్మటను – కారిచిన కూలీలను ॥కూడ॥
బాస్టి– ఓరి తెగవాగకుర – గోరీలను కట్టెదర
మీరితిర యాజ్ఞలను – వారి మిము నరికెదర ॥వేడి॥

వ॥ ఈ తిట్లను సహించలేక, కన్నులెఱ్ఱజేసి మల్లుదొర ఏమంటున్నాడు?

భళాభళానోయ్ తమ్ముడా – సై – భాయి భళానోయ్ దాదానా
పిచ్చి పిచ్చిగా వాగకు ॥ సై ॥
పిలిచి తిట్టుచున్నావుగ ॥ సై ॥
పైసకు గడ్డిని మేసెడి ॥ సై ॥
పశువు జన్మ మేమెత్తల ॥ సై ॥
చావుకు వెరువము తెలుసున ॥ సై ॥
జాగ్రత్తగ మాట్లాడాలి ॥ భళా ॥

ముఠాదార్ల బెదిరించుచు ॥ సై ॥
రైతుల గొంతులు కోయుచు ॥ సై ॥
కూలీల పీకలు నొక్కుచు ॥ సై ॥
కూడబెట్టి ధనరాసులు ॥ సై ॥
మేడలు గట్టగ దలచావ ॥ భళా ॥

అధికారము, కంట్రాక్టులు ॥ సై ॥
అన్నీ నీవే చేతువా ॥ సై ॥
కూలికి రోడ్లను పోసిన ॥ సై ॥
కూలినంత దిగ మ్రింగియు ॥ సై ॥
చాలక నాపై కేసుల ॥ సై ॥
చంపివేయగా తలచావా ॥ భళా ॥

జానెడు పొట్టను నింపగ ॥ సై ॥
సత్యము తప్పము తప్పము ॥ సై ॥
కూటసాక్ష్యముల నివ్వము ॥ సై ॥
మాటలేల పొమ్మన్నారు ॥ భళా ॥

వ॥ అని నిర్భయంగా మాట్లాడి గాముసోదరులు వెళ్ళిపోయారు. నీచుడైన 'బాస్టియను' గంటందొర ఉద్యోగం తీసివేశాడు. తరువాత పైనుంచి ఆర్డరు తెప్పించి

వారి ఆస్తికూడా లాగివేశాడు. ఒకనాడు 'బాస్టియను' నలుగురు పోలీసులను వెంటదీసుకొని కూలీల గుడిసెల దగ్గరకు వెళ్ళి వారిని జూచి...

-: రోద్దుకూలీలను హింసించుచున్న 'బాస్టియను'ను సీతారామరాజు వచ్చి అడ్డగించుట–ఆ నిరుపేదలు తమ బాధలను గూర్చి రామరాజుకు విన్నవించుట – అతడు వారికి నీతులు ఉపదేశించి వారిచే త్రాగుడు మాన్పించుట :-

బండబూతులను తిట్టుచు పటపట – పండ్లునూరి వాడు
ముండమోపులారా పనిచేయగ – రండు వేగ నేడు
లేదా డొక్కలు జీల్చి పేగులను – లెక్కబెట్టెదనుర
కాదని ఎదిరించితిరా పీకలు – కత్తిరించెదనుర
చింతగింజ లెవడబ్బసొమ్ము యీ – చింతలు మావేర
చింతగింజ లంటిన మీ తలలను – చితుకగొట్టెదనుర

వ॥ అని హడావుడి చేస్తూ భయపెడుతున్న బాస్టియనుతో కూలీలేమంటున్నారు–

1. రెక్కలరుగగ మేము – రేబవలు కష్టింప
కూలి నెగబెట్టితివి – యేలరావలె పనికి
గొంతుగోసిన సరే నన్నారు
మేము
కూలికిక రాము పొమ్మన్నారు

2. నిప్పు దొక్కిన కోతి – నీచుండు బాస్టియను
బండబూతులు తిట్టి పైనబడి గొట్టగా
కూలీలు గొల్లుమని లేచారు
పెద్ద
గోలగోలగ నరవసాగారు

వ॥ ఈ గోల యెవరు విన్నారు –

బాలసూర్య తేజస్సంపన్ను డ – పార బుద్ధిబలుడు
బాలయోగి ధవళాంబుజ నేత్రుడు – బాహుబలుడు త్యాగి
నిరుపమాన గుణరూప విలసితుం – డరిజన భీకరుడు

కరుణారసభర భరిత స్వాంతుడు – కాషాయాంబరుడు
కొండకోనలం దొంటిగ దిరుగుచు – కోదండము బూని
చెండాడుచు మారీచుల నీచుల – క్షేమకరుండైన
సీతారాముండేమోనన మన – సీతరామరాజు
ఆ తరుణంబున గోదావరినది – కరుగచు యది చూచి
శరవేంగంబున వచ్చి బాస్టియను – నరహంతకుతోడ
నిరుపేదల హింసించుచుంటివా – నీచాత్మా! తగున?
ఏ దీనుల రక్షింప క్రైస్తు తా – నెక్కినాడొ శిలువ
ఆ దీనుల హింసింప క్షమించునె – అతడు నిన్ను తులువ
అను కాషాయాంబర ధారిని గని – అధముడు బాస్టియను
చనెను సిగ్గుపడి మెలమెల్లగ నా – స్థలము విడిచి తుదకు

వ॥ అప్పుడా నిరుపేదలంద రా దివ్యమంగళ విగ్రహుండగు బాలయోగికి నమస్కరించి, అయ్యా!

మనుజుడు కాడీ పాపకర్ము డొక – దనుజుండో బాబు
తినుచుండును మా రక్తమాంసముల – ననుదిన మీతండు
ఇతడే దొర పోలీసు యీతడే – యితడే వర్తకుడు
ఇతడే కంట్రాక్టరు యమకింకరు – డితగాడే యముడు

వ॥ రంగన్నదొర దగ్గర లంచం తీసుకొని నా భూమి అతని స్వాధీనం చేశాడండీ. నాకు తెలిసిపోయి మొత్తుకున్నాను. నా దగ్గర కూడా లంచం మేసి "నీ భూమి నీవే దున్నుకో" అన్నాడు. చివరకా చేను దగ్గర మేమిద్దరం పోట్లాడుకున్నాం. పోట్లాడుకున్నందుకు యిప్పుడు మళ్ళీ లంచం ఇమ్మంటున్నాడు. లేకపోతే యిద్దరినీ జైలుకు పంపుతాడట. చూడుబాబు! అని మొత్తుకున్నాడు వెంకన్నదొర. మాదేంవుంది బాబూ, మా కందరికీ పెద్దగా ఉంటున్న గంటందొర ఉద్యోగం తీసివేశాడు. చివరకు ఆయన భూమి కూడ తన స్వాధీనం చేసుకున్నాడు అన్నాడు రంగన్నదొర. రాజు తన ప్రక్కనే నిలిచియున్న గంటందొర వీపు తట్టుతూ –

"మన్యవాసులకు తగవులు బెట్టుచు – మనుచు దోచుకొనెడి
అన్యాయపు యీ ప్రభుత్వ పద్ధతు – లంతరించకున్న
శాంతిలేదు యీ దేశానికి విశ్రాంతి లేదు మనకు
ఇంతకు మన యంతఃకలహా లిపు – డంతరించవలయు
పల్లెలలో పంచాయతి రాజ్యం – ప్రజలమె నెలకొల్పి
కల్లబొల్లి యీ ప్రభుత్వ కోర్టులకు – వెళ్ళుట మానేసి
మన తగవులు మన మంతయొక్కటై – మాపుజేసుకొంటె
మనల దోచి తిను ప్రభుత్వతొత్తులు – మనలే రిచ్చోట
అంతులేని త్రాగుడు దేశమునకె – హాని యన్నలార!
ఇంతకు త్రాగుడు మానవలయు మీ – రంత సుజనులారా!
ఒక్క క్షణపు యానందంబునకై – డొక్కనిండ త్రాగి
ఇక్కటుల పాలై యవమానము – లిన్ని పడుట యేల?
బానిసత్వమున కన్న హీన మీ – ప్రపంచమున లేదు
కాన మనము స్వాతంత్ర్య సిద్ధికై – కయ్యమాడవలయు"

వ॥ అని యనేక నీతులుపదేశించి, పోయి వచ్చెదనని చెప్పి ముందుకు సాగిన రాజు నడ్డగించి, గంటందొర

"మా పరిసర ప్రాంతంబుల దిరిగెడి – మహనీయుడ నిన్ను
పాపికొండపై జపము జేసుకొను – తాపసిగా నెంచి
దూరదూరమున నుంటిమి దాపుకు – చేరక బాబయ్య
దారిజూపి మమ్ముద్ధరింపగల – దైవమ! రావయ్య
కృపామయా! దాపుననే యున్నది – కృష్ణదేవిపేట
ఇపుడచ్చట నివసించవలయు మీ – రిదియే మా కోర్కె"

–: మన్యం ప్రజల కోరికపై సీతారామరాజు కృష్ణదేవిపేట
రామాలయములో నివసించుట – రామరాజు పూర్వచరిత్ర :–

వ॥ ఈ కృష్ణదేవిపేట రామాలయం మీరు నివసించటానికి చాలా అనువుగా ఉంటుంది. అక్కడ ఉంటూ మాకు తగిన సలహాలనిస్తూ తోడ్పడండి. ఈ కొండమీద

రాత్రిళ్ళు మృగాల భయం. ఒంటరిగా ఉండడం అంత మంచిదిగాదు అన్నాడు. మా కోర్కె తీర్చమని అక్కడున్న ప్రజలందరు గూడా పట్టుబట్టారు –

ప్రశ్న – అసలెవరురా యీయన?

జవాబు – నేటి మన పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరానికి సమీపంలో 'మోగల్లు' అనే గ్రామం వుంది. ది4-7-1897వ తేదీన యీయన క్షత్రియుల యింట జన్మించాడు.

తెనుగువారి పుణ్యంబుల పంటరరె తంధానో
దినమొక తీరుగ, బాలుడు పెరిగాడు ”
పెదయుద్యోగాల్ జేయాలితడంటు ”
పెద్ద లతనిపై ఆశలు నిలిపారు ”
ఆంగ్ల పాఠశాలకు పంపించారు ”
ఆశదీర్చు శ్రీరామా యన్నారు ”
తంధాన భాయీ దేవనందనాన తంధాని తాన

ఆంగ్లభాషపై అతని మనసు లేదు తంధానో
ఆలోచిస్తూ యుంటాడేమోమొ ”
బళ్ళో కూర్చొని పైకే చూస్తాడు ”
కన్నుమూసి కలలేవో కంటాడు ”
ఇన్నియేల రేబవలాలోచనలె ”
తంధాన భాయీ దేవనందనాన, తంధానితాన

తునిలో యాంగ్లం చదివే బాలునకు తంధానో
మనసు నిలువదా – బడిలో నొకక్షణము ”
పుస్తకాల నా బడిలో పెట్టించి ”
యోచన యొకదిన మడవికి నడిపింది ”
మలమలమాడే ప్రజల నచట జూచి ”
సలసల నెత్తురు కాగెను బాలునకు ”
స్వాతంత్ర్యం స్వాతంత్ర్యం బన్నాడు ”

బానిస చదువుల పనియేమన్నాడు ”

తంధాన భాయీ దేవనందనాన, తంధానితాన

బిరబిర శాస్త్రాల్ చదువదలచినాడు తంధానో
వేదాంత వైద్య గ్రంథముల జూచి కొన్ని ”
జ్యోతిష శాస్త్రపు చవిని జూచి తుదకు ”
రాజకీయ రహదారి వెదకసాగె ”
పెద్దలకోసం బడిలో కూర్చుండి ”
తన శాస్త్రంబుల తలచి జపము చేయు ”
తన పాఠముపై శ్రద్ధదప్పియున్న ”
బాలున వద్దకు పంతులు నడిచాడు ”
చదువెందుకురా రాజూ! నీకింక? ”
సన్యసించి హిమగిరులకు పోపొమ్ము ”
చిత్తమదే యాలోచన యనె రాజు ”
ఛీ! వెధవాయని చావమోదినాడు ”

తంధాన భాయీ దేవనందనాన తంధానితాన

వ॥ “తండ్రిలేని కొరత లేకుండా నీ పినతండ్రి రామకృష్ణ రాజుగారు నాదగ్గరకు కావలసినంత డబ్బు పంపించుతున్నారు. నీ చదువిలా తగలడింది” అని చీవాట్లు వేశాడు పంతులు. అనంతరం సీతారామరాజు బడికి ఇన్ని తులసినీళ్ళు వదలి –

ఆకలి దప్పుల కోర్చుచు కాల్నడ – నా వీరుడు కదలి
ఏకాకిగ సంచారము జేసెను – హిమాలయము వరకు
సకల సంపదల కాలవాలమై – సంతోషము నిచ్చు
అకలంకంబగు దేశమునం గల – యన్నార్తుల జూచి
ఇంతకు దీనికి కారణమేమని – యెంతో యోచించి
హంతకు లీ సామ్రాజ్యవాదులని – ఆ వీరుడు తలచె

వ॥ ఈ దోపిడీ విధానాన్నరికట్టే మార్గమే లేదా? అని యోచింపసాగాడు. కొంతమంది అహింసావాదుల్ని కలుసుకున్నాడు. వారి సభలకు హాజరయ్యాడు.

ఆ సభలకు హాజరయ్యే ప్రజల్ని, ఆ సమీకరణా విధానాన్ని చూచి యెంతో ఆనందించాడు. కాని వారు గిరిగీసి విప్లవాన్ని కొన్ని హద్దుల్లో ఉంచాలని చూస్తున్నారు. ఇది రాజుకు నచ్చలేదు. తరువాత కొంతమంది బాంబువాదులను కూడా కలుసుకున్నాడు. వారి ధైర్యసాహసాలకు, త్యాగాలకు ఎంతో ఉప్పొంగి పోయాడు. కాని వారికి ప్రజలతో బొత్తుగా సంబంధం లేదు. ఈ రెండు విధానాల్లో ఉన్న మంచిని తీసుకొని విప్లవం నడిపితే తప్పక సఫలమౌతుందని నిశ్చయించు కున్నాడు. తరువాత –

నడుచుచు యోధుడు బస్తరుగుండా – నాసిక వరకేగి
నడుమ నడుమ ప్రముఖులతో కలియుచు – వడిగా వెనుదిరిగి
అన్యాయమునకు గురియై యీ గతి – నార్తి మున్గియున్న
మన్నెంబున యీ పాపికొండపై – మనకగుపించాడు.

–: గాము గంటందొర, గాము మల్లుదొరల అండదండలతో రామరాజు పల్లెపల్లెకు పోయి మన్యం ప్రజలను చైతన్యపరచుట – బాస్టియను పై అధికారులకు రిపోర్టు చేయగా వారు వచ్చి రామరాజును నరిసీపట్టణములో నిర్బంధించుట – అతడు వారి కన్నుగప్పి అరణ్యములలోనికి పారిపోవుట :–

వ॥ ఇప్పుడీ మన్య ప్రజల కోర్కెలపై కృష్ణదేవిపేట రామాలయంలో తన నివాస మేర్పరచుకున్నాడు. చుట్టుపట్ల గ్రామాలనుండి ప్రజలు తండోపతండాలుగా వచ్చి తమ రాజుకు పండ్లు, పువ్వులు, పాలు సమర్పించుకొనేవారు. రాజు వాటిని –

అవని నుండి జలమంత సూర్యుడు – తంధానా తందాన తందన
తీక్ష్ణకిరణముల తీసి పైకి తా ”
ప్రపంచమునకే పంచిన విధముగ ”
జనులు ప్రేమతో తన కర్పించిన ”
పండ్లూ, ఫలహారంబులు ప్రజలకె – ప్రసాదించు రాజు.

రాజు చక్కగా రామాయణమును తందానా తంధాన తందన
వినిపించుచు నా జనులందరకు ”
గాము మల్లుదొర గంటందొరలూ ”

అండ నిలువగా అనఘుడు కదలీ ”
పల్లె పల్లె పంచాయతీ కోర్టులు ”
నెల కొల్పుచు కీలెరిగి నడుపుతూ ”
తగవులు దీర్చుచు త్రాగుడు మాన్పుచు ”
బ్రహ్మాండంబగు ప్రచార మచ్చట – ప్రారంభించాడు.

ఆ ప్రచారమున కదరి బాస్టియను – తంథానా తంధాన తందన
గడగడ లాడుచు వణకుచు నీచుడు ”
పై యధికార్లకు పంపె రిపోర్టును ”
రిపోర్టు జూచీ రెపరెప లాడుచు ”
రానేవచ్చిరి అధికారులు శ్రీ–రాముని సన్నిధికి.

వ॥ కృష్ణదేవిపేట రామాలయంలో నివురుగప్పిన నిప్పులాగ కూర్చుండియున్న రాజుదగ్గరకు వచ్చిన సూపరెండెంటు, కలెక్టరు కొన్ని ప్రశ్నలడిగారు.

సూప – స్వామీ! మీరు గ్రామాలను దోచుకోమనీ, పితూరి సాగించమనీ ప్రజల్ని రెచ్చగొడుతున్నారా?

రాజు – నేనా?

కామెర్ల రోగికి ప్రపంచమంతయు – కనబడు పచ్చగనె
ఈ మన్యంబున సన్యాసిని నే – నెందుకు దోయింతు
మా సన్యాసుల పని యెందైనను–మతప్రచారమేను
మోసము జేయుచు దోచుకొనెడి స–న్నాసిని నేగాను

సూప॥ మతప్రచారానికి మా అభ్యంతరమేమీ లేదు. కాని మద్యపాన నిషేధ ప్రచారం చేస్తున్నారెందుకు?

రాజు –

త్రాగుడు మాన్పుట తప్పా? మానవ–ధర్మంబదిగాదె
త్రాగు డన్ని మతముల నిషేధమని – తాము వినుట లేదె?

సూప॥ అదలా వుంచండి, తగాదాలు పరిష్కరించుకోడానికి కోర్టుకు వెళ్ళడం గూడా తప్పేనా?

రాజు –

అది యధర్మమో ధర్మమొ యీ ప్రజ–లందరికీ తెలుసు
చదువుకొన్న యధికారులు మీకిది – సమగ్రముగ తెలుసు

వ॥ అనిన రాజు మాటల కధికారులు నవ్వి –
రాజూ! నిజమే కాని ప్రభుత్వపు – రాజనీతికాదు
రాజకీయ నేరస్తుడవైతివి – రమ్మిక గతిలేదు
నరసీపట్టణమునకు దెచ్చి య – న్యాయ ప్రభుత్వంబు
సరి యీ పట్టణము దాటగరాదని – శాసించిన దండి

వ॥ తరువాత నెలరోజులకు ప్రభుత్వం రాజుకు 'పైడిపుట్టి' దగ్గర 30 యకరాల భూమినిచ్చి వ్యవసాయం చేసుకోమంది – దీనితో రాజు కిక్కురు మనకుండా పడివుంటాడని. ఇది జూచి మన్యరైతులకు రాజంటే అసహ్యం పుడుతుందని ప్రభుత్వం ఆశపడింది. కాని దానియాశ అడియాసగా మారింది. ఆ వీరుడు ఉన్నట్లుండి ఒకనాడు సి.ఐ.డీ. ల కళ్ళల్లో దుమ్ముకొట్టి అంతర్ధానమయ్యాడు. నాటినుండి మన్యప్రజల్లో రహస్యంగా రాత్రిళ్ళు పనిచేయడం ప్రారంభించాడు. అక్కడ రాత్రిళ్ళు తిరగడం అంటే మాటలా?

–: రామరాజు రాత్రివేళ మన్యంలో సంచరించుచూ ప్రజలను ఉత్తేజపరచుట – రాజునాయకత్వములో వారు తమ్ముహింసించుచున్న బాస్టియనుపై సాయుధ తిరుగుబాటు చేయుట :–

కీకారణ్యంబది సూర్యోజ్వల – కిరణంబులె చొరవు
భీకర ఘాతుక మృగ సంతతి గం–భీర నినాదములు
కోవపుట్టల భయంకరసర్పాల్ – త్రోవలగమ్యములు
ధీ విశాలు డొంటరిగా రాత్రుల–తిరుగసాగె నచట
సూర్యుడు గ్రుంకని సామ్రాజ్యంబున – చుక్కల మొలిపించు
కార్యదక్షు బెదరించగలదె యీ – కారడవుల భయము
క్షాత్రతేజమున కదలి చీకటులు – క్షయమౌటయె నిజము

వ॥ దీక్షాకంకణుడై కార్యరంగంలో కురికి రాజు పనిచేయడం ప్రారంభించాడు. ఆయన ప్రయత్నాలకు ప్రభుత్వోద్యోగుల నిర్బంధ హింసాకాండలుకూడా తోడ్పడ్డాయి. ఎట్లన?–

ప్రజలు లంచమిచ్చుట లేదను కసి – రగిలి రగిలి మండ
ప్రజల రక్తమాంసముల నాకు పులి – బాస్టియ నొకనాడు
రైతుల కూలీ లందర వేగమె – రమ్మని పిలిపించి
ఘాతకు డా దీనుల వృక్షములకు – గట్టిగ కట్టించె
వ॥ తరువాత యేం జేస్తున్నారు –
భళా భళానోయ్ తమ్ముడా – సై – భాయి భళానోయ్ దాదానా
చింత బెత్తముల తీసిరి ॥ సై ॥
చెట్లకు ప్రజలను గట్టిరి ॥ సై ॥
చెండుట కారంభించిరి ॥ సై ॥
చిట్లిపోయెరా చర్మము ॥ సై ॥
నిలువున జీల్చినట్లాయెరా ॥ సై ॥
నెత్తురు టేరులు పారాయి ॥భళా॥

ఇంక తృప్తి లేదేమొ బాస్టియను – హీనున కావేళ
గొంకక దీనుల మర్మస్థానముల – కొట్టెను కారంబు

వ॥ గుడ్డలూడబీకి ... కారం కొట్టించాడు 'బాస్టియను'. ఈ మంటలతో వీళ్ళంతా తనకు లొంగిపోతారని అనుకున్నాడు–

నెత్తురుడికి యవమాన పీడనో – నృత్తులైరి ప్రజలు
కత్తులు కటార్లు బల్లెము లీటెలు – గరగర నూరారు
అగ్నిపర్వతము పగిలె గుభిల్లున – ఆ మన్యములోన
అగ్నిజ్వాలవలె విప్లవ ధ్వజం – బాకసమున కెగిరె
ధణధణ ధణధణ మ్రోగిందండీ – రణభేరి యపుడు
ఘను డా సీతారామరాజు తన – ఖడ్గంబును దూసె
దీక్షగ రాజున కిరుపార్శ్వంబుల – దిగ్దంతులరీతి

రక్షకభటులై గాముసోదరులు – రయమున నిల్చారు
సాయుధులై స్త్రీపురుష సమూహము – సాగెను వెనువెంట

–: తిరుగుబాటుదారులతో రామరాజు చింతపల్లి పోలీసు స్టేషనుపై దండెత్తి తుపాకులను దోచుకొనుట – అచ్చటి ఖైదీలను విడిచిపెట్టుట – ప్రజలపై తప్పుడు కేసులు పెట్టిన రికార్డులను తగులబెట్టుట – ఇట్లే ఇతర పోలీసు స్టేషన్లను కూడా దోచుకొనుట :–

వ॥ ఈ విధంబుగా బయలుదేరిన జనసమూహం 'చింతపల్లి' పోలీసు స్టేషను మీదకు దండెత్తింది –

భళాభళానోయ్ తమ్ముడా – సై – భాయిభళానోయ్ దాదానా
కార్మిక కర్షక దళమును ॥ సై ॥
కనుల జూచి పోలీసుకు ॥ సై ॥
నిలువుగుడ్లు పడిపోయెర ॥ సై ॥
తలలు గిరగిరా తిరిగెరా ॥ సై ॥
దిగజారెను ముచ్చెమటలూ ॥ సై ॥
ఎగిరిపోబోయే ప్రాణాలు ॥ భళా ॥

ప్రజాసమూహం బప్పుడు ॥ సై ॥
పారిపోవు పోలీసుల ॥ సై ॥
విరిచి రెక్కలను గట్టిరి ॥ సై ॥
అరమర లెరుగని ప్రజలకు ॥ సై ॥
హానిజేసినా ఫలితము ॥ సై ॥
అనుభవించ మన్నారయ్యా ॥ భళా ॥

వ॥ ఇప్పుడీ స్వతంత్ర భూమిలో శ్రీరామరాజే రాజు. అక్కడేవున్న కుర్చీని తెచ్చి గాముసోదరులు రాజును అందులో కూర్చోమన్నారు –

రాజుదయించెను సూర్యుడు గ్రుంకని – రాజ్యమస్తమించె
రాజు కొలువుదీర్చెను పోలీసుల – రాజ్యము నశియించె

చల్లని వెన్నెల గాయసాగె ప్ర - శాంతముగా నచట
వెల్లివిరిసెనా ప్రజల ముఖంబున - విజయోత్సాహంబు

వ॥ ఇంతలో మల్లుదొర తాళము పగులగొట్టి అక్కడ ఖైదుచేయబడియున్న ఇద్దరు బందీలను తెచ్చి రాజు సముఖాన నిల్పాడు -

రాజు - ఏమి చేసి బందీలైతిరొ మీ - రిద్దరు చెప్పండి

బందీలు- ఏముందండి కోడిపెట్టలను - యివ్వలేని తప్పె
వెట్టి జేయలేమన్నామని తెగ - దిట్టుచు బాస్టియను
పెట్టించెను చెఱసాలలోన మము - కొట్టించెను బాబు

వ॥ బందీ లీ విధంగా పిర్యాదు చేస్తూ వుంటే సిగ్గూ, భయమూ ఆవరించి పోలీసు ఉద్యోగి -

రాజు కాళ్ళపై గడగడ వణకుచు - రోజుచు తలమోపి
రాజా, మహరాజా! అపరాధిని - రక్షించండి ప్రభు!
పిల్లాజెల్లా గలవాడను నా - యిల్లా లొంటరిది
చల్లని వేళల దీపము పెట్టుక - యిల్లాలును నేను
తలచుకొందుమో దేవా! నిను మము - దయజూడాలండి
తెలియక జేసితి తప్పు క్షమించుడు - దీనుడనని వేడె

వ॥ అని ప్రార్థించు ఉద్యోగిని చూచి - రాజు - మంచిది, ఇది ప్రజారాజ్యం. ప్రజాపీడకునిగా బ్రిటిష్ సామ్రాజ్యం నిన్ను తయారుజేసింది. ఇక్కడ ప్రజాసేవకులే ఉద్యోగులు. నీలో పరివర్తన గలిగేవరకు, మా రాజ్యంలో నీకు స్థానంలేదు. నిన్ను తొలగించాం. రికార్డంతా మాకు స్వాధీనపరచు.

అని రాజాజ్ఞాపించుటె తడవుగ - నా యధికారి జని
తన రికార్డు గొనివచ్చి రాజు పా - దములముందు బెట్టె

వ॥ శ్రీరామరాజు ఆ రికార్డును విప్పి ప్రజలకు చదివి వినిపించి -

అన్నలార! అన్యాయముగా మి - మ్మందర హింసింప
ఎన్నో కేసులు పెట్టిన ఫైలిం-దున్నది యోజింప

ఉంచదగిన దేదైన యున్నచో – నుంచెద లేకున్న
చించివేసెదను మీ యిష్టంబును – చెప్పుడు నాకన్న

వ॥ అన్నీ తప్పుడు కేసులే. చించివేయండని ప్రజలందరొక్క గొంతుతో అరచారు. అంత రాజు ఆ రికార్డును ప్రజల యెదుటనే తగులబెట్టెను. ఇంతలో గంటందొర, మల్లుదొరలా స్టేషనును కొల్లగొట్టి తుపాకులు, కత్తులు మొదలయిన ఆయుధాలూ, తోటాలూ డబ్బా తెచ్చి రాజు యెదుట పడవేశారు. ఆ వీరు డా ధనాన్ని, ఆయుధాలనూ ప్రజలకు పంచి యిచ్చి వారినుద్బోధించి –

పరప్రభుత్వ సైనిక హస్తముల తు–పాకులున్ననాడు
వెరచి దూరముగ నిల్చిన మీరే – వెరపులేక నేడు
ఈ రీతిగ నిర్భయముగ నిల్చిన – కారణ మొకటుంది
మీ రీ దినమున సర్వస్వతంత్రులు – మీదే యీ రాజ్యం
వారబోసి మీ రక్తమంత కా – పాడండీ రాజ్యం
మీ రక్షణకే యీ తుపాకులిట – పోరాడును ముందు
శెలవియ్యండీ పోయి వచ్చెదను – విలంబనము తగదు
కలవెన్నో మన స్వాధీనము కా –వలసిన స్టేషనులు

వ॥ అని ప్రజల కుపదేశించి రాజు కదలాడు. వెంటనే విప్లవకారులు –

తోటా లెక్కించిరి పదియెనిమిది – తుపాకులకు వారు
సూటిగ స్టేషనువైపు త్రిప్పి గురి – జూచి కాల్చినారు
జై మన సీతారామరాజునకు – జై జై జై యనిరి
జై మన కూలీరైతుల కెపు డప–జయమే లేదనిరి
ఘనభోంతరాళములు గింగురని – ఘోరుకొలిపినాయి
ఆనందమున పొంగిపోయి రా–యనఘులు ప్రజలంత

వ॥ ఈ విధంగా విధి విరామం లేకుండా స్టేషనులు కొడుతూ, ఆయా స్టేషన్లలో బందీలైయున్న వారిని విడిచిపెట్టి, తన విప్లవ సైన్యంలో చేర్చుకుంటూ, మధ్య మధ్య గ్రామాలలో మీటింగులు పెట్టి, విప్లవాన్ని గురించి ప్రజలకు నచ్చజెపుతూ, వీరయోధుడైన రాజు తన సైన్యాన్ని కట్టుదిట్టం చేస్తున్నాడు...

సాయుధవర్గం బొకటి, మరొకటి ని – రాయుధ వర్గంబు
ఆయుధములు ధరియించి పోరువా – రంత మొదటిదళము
సమ్మెలు జేయుచు విప్లవంబునకు – సాయమిచ్చు కూలి
దమ్మిడి పన్నివ్వక పో పొ – మ్మని తలపడు రైతులును!
రెండవదళమిది విప్లవంబునకు – గుండెకాయ అరరె
దుండగులగు వైరుల వ్యూహంబుల – రెండుమూడు జేయ
వేగుల వారుండిరి, వీరంతా – వేరొక దళమండి
ఈ గతి బహు శాఖోపశాఖలుగ – త్యాగధనుడు దిద్దె

–: బాస్టియను పరుగెత్తిపోయి కలెక్టరుకు మొరపెట్టుకొనుట – అతడు రిజర్వు పోలీసు దళమును పంపుట :–

వ॥ పొంగి పొరలివచ్చు యీ ప్రజా విప్లవవాహినిని జూచి పిరికిపంద బాస్టియను గుండెగూళ్ళు కదలిపోయినవి. పడుతూ, లేస్తూ కలెక్టరువద్దకు పరుగెత్తి–

జ్వాలలు, విప్లవ జ్వాలలు బాబా! – తంధానా తంధాన తందన
దావానల మిది తాళ లేమయా ”
కొండలు, లోయలు, క్రూరమృగంబులు ”
చెట్లూ పుట్టలు, చెంచులు, కోయలు ”
ఇంతయేల వనమంతా యెదురే ”
ముఠాదార్లు కూలీలు రైతు లొక – ముఠాగ నిలిచారు

రాజు కాదు మన రాజు వారికి – తంధానా తంధాన తందన
రాజు వారి కా రామరాజయా ”
ఆతడు కన్నిట్లన్నాడంటే ”
హరిహరాదులే యడ్డము వచ్చిన ”
ఆగరాగరా ప్రజలు తప్పదిక – అచ్చట మాచావు

వ॥ అని గొల్లున గోలపెడుతూ వున్న బాస్టియనుతో కలెక్టరు యేమంటున్నాడు–

బందిపోటు దొంగలు వీరెంతని – భ్రమపడ్డానోయి
తొందరలోనే యీ వనవాసుల – తోలొలిపించెదను

రేపీపాటికి తెప్పించెద నిదె – రిజర్వు దళములను
చూపించెద నాగ్లేయుల బలమీ – దోపిడి దొంగలకు

వ॥ జిల్లాలోని మొనగాడు రిజర్వు దళాలను రప్పించి నీవద్దకు పంపిస్తాను. నీవు నాయకత్వము వహించి ఆ మన్యపశువులను పాతాళానికి తొక్కివెయ్యి – అన్నాడు కలెక్టరు. అతని మాటల కా బాస్టియను –

భళాభళానోయ్ తమ్ముడా – సై – భాయి భళానోయ్ దాదానా
జిల్లా దళములె వచ్చిన ॥ సై ॥
అల్లాడించనె వారిని ॥ సై ॥
కోయల చెంచుల గించుల ॥ సై ॥
గోరీలను కట్టించన? ॥ సై ॥
కండలు గోసీ క్షణములో ॥ సై ॥
గద్దలకే యెగరేయన? ॥ సై ॥
మన్యాన్నంతా దెబ్బలో ॥ సై ॥
మసిచేస్తానని వెళ్ళాడు ॥ భళా ॥

–: ప్రజలు పోలీసులకు ఏమాత్రమును సహకరింపకపోవుట – రామరాజు అంతయును తెలిసికొని, పోలీసులను తప్పుదారిపట్టించి, తన గెరిల్లా దళముతో అర్ధరాత్రి వేళ వారి ఆయుధములన్నియు దోచుకొనుట :–

వ॥ మూడవనాటికి మన్యం పోలీసు దళాలతో కిటకిటలాడింది. కాని ప్రజల సహకారం లేకుండా విప్లవకారుల్ని పట్టుకోవడం యెలా? వచ్చిన పోలీసు దళాలను ప్రజలేవిధంగా గౌరవించుతున్నారు –

తలవరు నుడవ రదల్చిన భయపడి – సలామనరు ప్రజలు
జలమివ్వరు దప్పికగొని యడిగిన – తలలు బాదుకున్న
దిక్కులు తెలియక దారిజూపుమని – నొక్కి బాధపెట్ట
ముక్కుకు సూటిగ పొమ్మని సెప్పెద – రొక్కమాట వారు
గాడిద బరువులు మోయగ కూలీ – కనపడ డొక్కడును
మాడలిచ్చి బ్రతిమాలిన మోసే – మనిషి దొరకలేదు

వ॥ వేగులవాళ్ళ ద్వారా యీ వార్తలన్నీ యెప్పటి కప్పుడే రాజు తెలుసుకొంటున్నాడు. తగిన ప్లాను వేస్తూనే ఉన్నాడు. తుదకు గతిలేక పోలీసులు తమ బరువులు తామే మోసుకుంటూ, ఆ మహారణ్యంలో విప్లవకారుల్ని వెదకడం మొదలు పెట్టారు. ఒకచోట పోలీసులకు కొంతమంది ప్రయాణీకు లెదురుపడ్డారు. వారిని చంపుతామని బెదిరించి తమ బరువులన్నీ వారి కెత్తారు. విప్లవ సైనికు లిక్కడున్నారనీ, అక్కడున్నారనీ గాలివార్తలు వింటూ, పగలంతా వెదకి వెదకి విసిగిపోయారు. ఆ రాత్రి ఒకచోట తుపాకులన్నీ మధ్య పెట్టి వాటి చుట్టూ చొప్పకట్లల్లాగ పడ్డారు పోలీసులు. మూటలు మోసిన కూలీలు ఒక పక్కగా పడుకున్నారు. రాత్రి పన్నెండయింది.

కన్ను పొడిచినను తెలయని పెంజీ – కటు లెటుజూచినను
చిన్న చిన్నగా గెరిల్లాలు – వలపన్నిన చందనమున
చుట్టముట్ట పోలీసుల నిది పసి – గట్టిన కూలీలు
గట్టిగ సకిలించిరి గ్రహించితిమి – కానిండన్నట్లు

వ॥ అప్పుడు

భళాభళానోయ్ తమ్ముడా – సై – భాయిభళానోయ్ దాదానా
సాహసు లా గెరిల్లాలుర ॥ సై ॥
సైగలందుకొన్నారురర ॥ సై ॥
దిక్కులు పిక్కటిల్లగ ॥ సై ॥
గాండ్రు గాండ్రుమని యరచిరి ॥ సై ॥
కంగు దిన్న పోలీసులు ॥ సై ॥
కూలీల్దరికే ఉరికిరి ॥ సై ॥
కూలీ ల్తరుణము జూచిరి ॥ సై ॥
గోలగ పులియని లేచిరి ॥ సై ॥
ఇటుగా దటు అన్నారురర ॥ సై ॥
అటు–గోండ్రు గోండ్రుమని యరపుర ॥ సై ॥
అటుగా దిటు యన్నారురర ॥ సై ॥

ఇటు–కాంద్రు కాంద్రుయని యరపుర ॥ సై ॥
ఇటుగా దటుగా దన్నారు ॥ సై ॥
ఎగబడి ఒకదరి కురికారు ॥భళా॥

గోల కదిరిపడి లేచి తుపాకుల – గుట్ట నచట విడచి
చాల భయంబున గజగజ వణకుచు – పోలీసుల గుంపు
ఆ కూలీలె గెరిల్లా బెబ్బులు – లని గ్రహింపలేక
కాకులవలె కూలీలతొపాటా – కారడవిం బడిరి
పొదల పొంచి కూర్చున్న గెరిల్లా – లదనిదె యని లేచి
పొదుపుగ నున్న తుపాకు లెత్తుకొని – పోయిరి తమదారి.

వ॥ కూలీల వెన్నంటి పరిగెత్తిన ఆ పోలీసులకు దారీ తెన్నూ తెలియలేదు. నిశాచరములైన వన్యమృగాల గర్జనలు మాత్రం ఎక్కడనిలిచినా వారి గుండెలను పగులగొడుతూనే వున్నాయి. ప్రతిచెట్టూ, పుట్టా, గుట్టా తమను మ్రింగజూచే మృత్యువులుగా కన్పిస్తున్నాయి. ఈరీతిగా ఊహలతో తమ చుట్టూ మృత్యువును కల్పించుకొని ఏడుస్తున్నారు గదా –

బ్రతికియుంటె బలుసాకులిన్నితిని – బ్రతుకవచ్చునోయి
గతులు లేవు యీ గెరిల్లాలతో – కయ్యమునకు దిగిన
కంటికి కనబడకుండ నెపుడు వెను – వెంట తిరిగి వీరు
గుంటకు గ్రుక్కెడు నీర్ద్రాగించిరి – కొల్లగొట్టిరయ్యో
అల్లాడుచు నీ రీతిగ దీనులు – తెల్లవార్లు తిరిగి
తెల్లముఖాలతొ క్యాంపును చేరిరి – తెల్లవారి వారు

–: విప్లవ తీవ్రతను గమనించి కలెక్టరు గవర్నరుకు ఫిర్యాదుచేయుట – గవర్నరు 'కవర్టు–హైటరు' అను దొరల నాయకత్వముతో మలబారు సైనిక దళములు పంపుట – రామరాజు తన సి.ఐ.డి.ల ద్వారా ఆసైనిక దళము యొక్క కదలికలను గమనించి, 'పడాలు' అను గెరిల్లాదళనాయకునితో వారిని మభ్యపెట్టి, గంటందొర మల్లుదొరల సహాయముతో కవర్టు – హైటరు దొరలను మట్టుపెట్టుట – తక్కిన సైనికులు భయపడి ఆయుధములు వదలి పారిపోవుట :–

వ॥ ఈ పోలీసుల పిరికితనాన్ని, ప్రభుత్వదౌర్బల్యాన్ని, మన్యవాసుల బలాన్ని జిల్లా అధికార్లు తేలికగా అర్థంచేసుకొన్నారు. ఇది జిల్లా పోలీసు శక్తులతో ఆర్పదగిన విప్లవాగ్ని మాత్రం కాదని నిశ్చయించుకొన్నారు – తరువాత.

టెలిఫోనుపై టెలిఫోనురా – తంధానా తంధాన తందన
గవర్నరుకు తా గబగబ పంపిరి ”
గవర్న రప్పుడు గడగడలాడుచు ”
అణచివేయగా ఆ విప్లవమును ”
మలబార్ సైనికదళాల పంపెను – మన్యమునకు వేగ

వ॥ ఈ సైన్యాన్ని నడపడానికి
కవర్టు హైటరు లను దొరలిద్దరు – కదలి రడవికండి
కవర్టు హైటరులన సామాన్యులు – కారని తెలియండి
గెరిల్ల యుద్ధంబున ప్రవీణులౌ – దొరలండీ వీరు
వెరపులేక యెందరినో ప్రజలను – నరికిన ఘనులండి

వ॥ వీరు తమ సైన్యాలను తీసుకొని మన్యంలో యే విధంగా నడుస్తున్నారు–

కీర్తన

వెడలిరి – మొనగాళ్ళు విప్లవ మణచ దొరలదె

1. మరతుపాకులు మెరయ భుజముల
పరచిన ట్లొడలంత తోటా
బెల్టులను ధరియించి ముందూ
వెనుక సైన్యము నడువ మధ్యగ ॥వెడలిరి॥

2. బూటూ హేటూ సూటు మెరయగ కదిలిరీ
టకటక ధ్వనులతో
లెఫ్టురైటులు ద్రొక్కుచూ
నిరుప్రక్క లండగ సైన్య ముండగ ॥వెడలిరి॥

వ॥ ఆవులిస్తే పేగులు లెక్కించే సి.ఐ.డీ.లు రాజు దగ్గర ఉన్నారు. వారిద్వారా రాజు విషయమంతా గ్రహించాడు. ఒక ప్లాను ఆలోచించాడు. 'పడాల'ను వీరుడు

విప్లవ కారులలో ఒకదళానికి నాయకుడు. రాజు ఆయనను పిలిచి ఉత్తరువు చేశాడు. "పడాలూ! నీవు నేర్పరివి. నీ దళముతో శత్రువుల కెదురుగా పొమ్ము. ఇదిగో ఈ కొండకూ వాగుకూ మధ్యగావున్న యిరుకుత్రోవలోకి వాళ్ళని తీసుకురా. నీవీ యుపాయముతో నెగ్గితీరుతా"వని రాజు ఉత్సాహపరిచాడు. తన మేటి నాయకుని ఆజ్ఞలను 'పడాలు' శిరసావహించాడు. ఆ కొండ మీద గుబురుకొన్న చెట్లున్నాయి. రాజుయొక్క యోచనప్రకారము గామునోదరులు ఆ గుబురుల చాటున తమ దళములతో దాగున్నారు. ఆ విధంగా వెళ్ళిన పడాలేమి చేస్తున్నాడు–

భళాభళానోయ్ తమ్ముడా – సై – భాయి భళానోయి దాదానా
పడాలు ఒక చెట్టెక్కెరా ॥ సై ॥
వైరుల సేనను జూచెను ॥ సై ॥
పటపట పండ్లను నూరెను ॥ సై ॥
భగభగ భగభగ మండెర ॥ సై ॥
పగతుర బలగం మీదికి ॥ సై ॥
బాణాల్ మూడే విడిచాడూ ॥ భళా ॥

దొరలది కన్నుల జూచిరి ॥ సై ॥
అరుగొ గెరిల్లా లన్నరు ॥ సై ॥
రెడీ రెడీ యన్నారుర ॥ సై ॥
దడదడ తుపాకులెత్తిరి ॥ సై ॥
బాణాల్ వచ్చిన వైపుకు ॥ సై ॥
పరుగులు ఉరుకులు పెట్టారు ॥భళా॥

ఇటు బాణము వచ్చిందిర ॥ సై ॥
ఎగబడె నటు సైన్యంబులు ॥ సై ॥
అటు బాణము వచ్చిందిర ॥ సై ॥
అటు దూకెనురా సేనలు ॥ సై ॥
ఎదురుగ తుపాకి పేలెర ॥ సై ॥

ఇది వైరులు జూచారుర ॥ సై ॥
ఇరుగో శత్రువు లన్నరు ॥ సై ॥
ఎదురుగ ముందుకు నడిచారు ॥భళా॥

పోతూ ముందుకు ధూర్తులు ॥ సై ॥
పొదల వెదక సాగారుర ॥ సై ॥
పొదలో దాగిన మనిషిని ॥ సై ॥
అధములు కన్నుల జూచిరి ॥ సై ॥
పట్టర దొరికా డన్నరు ॥ సై ॥
దిష్టిబొమ్మపై దూకారు ॥ భళా ॥

తెల్లముఖాలను వేసిరి ॥ సై ॥
ఎగశ్వాసలతో రొప్పిరి ॥ సై ॥
దిగజారెను ముచ్చెమటలూ ॥ సై ॥
నీళ్ళసంచులను పూర్తిగా ॥ సై ॥
కాళీచేసే వేశారు ॥ భళా ॥

గెరిల్లాల తుపాకులు ॥ సై ॥
మరల మ్రోగ విని వైరులు ॥ సై ॥
మరి నాల్గడుగులు వేసిరి ॥ సై ॥
దొరలు లోయలో నున్నారు ॥ భళా ॥

వ॥ పడాలు తన గెరిల్లాలతో లోయదాటి అవతలకు వెళ్లాడు...

భళాభళానోయ్ తమ్ముడా – సై – భాయి భళానోయి దాదాన
కవర్టు హైటరు లిద్దరు ॥ సై ॥
కనులజూచి రా లోయను ॥ సై ॥
చాలతడవు యోచించిరీ ॥ సై ॥
నాలుగు వైపుల జూచిరి ॥ సై ॥
ముందు సేనలను వేగమే ॥ సై ॥
గొంది దాటమన్నారయ్యా ॥ భళా ॥

సైనికుడొక్కడు యొక్కడే ॥ సై ॥
సాగి గొందినే దాటిరి ॥ సై ॥
దొరలది కన్నుల జూచిరి ॥ సై ॥
పరవాలేదని తలచిరి ॥ సై ॥
భయము తీరి బల్తెగువతొ ॥ సై ॥
రయమున ముందుకు సాగారు ॥ భళా ॥

వ॥ ఆవచ్చే వారిని చూచి మల్లుదొర అన్నతో – అన్నా?
భారతీయ సిరిసంపద తిని తెగ – బలిసిన పందులన
మోరలెత్తుకొని కదలిరి అరుగో – బోరలు పెంచుకొని
కన్నుల నగ్ని కణంబుల గురియుచు – గంటందొర బలికె
చిన్నప్పటి దొండాకు పసరు ఈ – దున్నలు కక్కాలి
వీడు నాకు బలి వాడు నీకు బలి – విడువర యన్నాడు
జోడు తుపాకులు గురిపెట్టిరి యా – శూరశిఖామణులు

వ॥ సోదరు లిద్దరూ తమ తుపాకుల నాక్రింది మార్గానికి గురిజూపి కూర్చున్నారు. గురికి సూటిగా వచ్చేశారు కవర్టు హైటర్లు –
ధణేలుమని మ్రోగెను తుపాకు లా – వనము దద్దరిల్ల
ధణ ధణ దొర్లెను రెండు శవాల – త్తరిని లోయలోకి

వ॥ తమ సేనా నాయకుల చావును చూచిన తరువాత సైన్యాలకి యెదురించే శక్తులన్నీ చచ్చిపోయినాయి. పారిపోయేందుకు చీలిపోయిన రెండు సేనలకు రెండే దిక్కులున్నాయి. పిక్కబలం చూపించారు. పొదల పొంచియున్న గెరిల్లా లిటునుంచీ, తన బలగంతో 'పడా'లటునుంచీ వారి నరికట్టిరి. కొండమీద గాముసోదరులు గర్జించారు గదా –
బ్రతుక దలంచిన మీ తుపాకులట – పడవేయండోయి
వ్యతిరేకించితిరా మా మాటకు – గతులులేవు మీకు
అని గర్జించిన భయమున సైనికు – లదరి దండమనుచు
వణకుచు తమతమ తుపాకు లట పడ – వైచి బైటపడిరి

వ॥ తక్షణమే పిడుగులాంటి ఈ వార్తను అధికార్లు టెలిఫోన్ ద్వారా తెలుసుకున్నారు. వెంటనే వారు మన్యానికి వచ్చి ఆ లోయదగ్గరకు వెళ్లారు. దొరల శవాలు రెండూ లోయలో పడివున్నాయి. అధికారులు వాటిని తీయించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఇంతలో ఒక బాణంవచ్చి వారి ముందు వ్రాలింది. దానిచివర ఒక ఉత్తరం, ఒక మిరపకాయ కట్టివున్నాయి. ఇదే శ్రీరామరాజుగారి మిరపకాయ టపా. ఆ ఉత్తరం విప్పారు అధికార్లు –

దొరల గాల్చి శవముల నిల్పుట మా – పరమావధిగాదు
దొరతనాన్ని నాశము జేయుటె మా – పరమ ధర్మమోయి
మీరుగాదు మీ తలలను దన్నిన – వీరులె వచ్చినను
గోరీలను కట్టించెద మిచ్చుట – నోరోరీ మేము
యుద్ధానికి వచ్చిరి చచ్చిరి మీ – యోధులిద్దరిచట
యుద్ధానికి నేవేళనైన సం – సిద్ధము మేమోయి
ఆంధ్రపుత్రులము మము గెల్చుట మీ – యబ్బతరముగాదు
ఆంధ్ర ప్రజారాజ్యస్థాపన మా – యాశయమది తీరు

–: సీతారామరాజు గెరిల్లా యుద్ధానికి బ్రిటీషు ప్రభుత్వము భయపడి, మరతుపాకులతో మరఫిరంగులతో ఘూర్కాసేనలను, తెల్లసైనికులను, గుఱ్ఱపుదళములను అసంఖ్యాకముగా మన్యములో దింపుట :–

వ॥ ఉత్తరం చదివేసరికి అధికారుల గుండెలు జారి పోయాయి. వెంటనే ఇండియా ప్రభుత్వానికి తెలియపరిచారు. తరువాత ప్రభుత్వం తన రాక్షసశక్తులతో మన్యభూమిలో అడుగుపెట్టింది. ఎలా!

కొండ లన్నిటిని పిండిచేయ బ్ర – హ్మాండముగా నపుడు
దండి దండి మరఫిరంగు లెన్నో – తక్షణమే దించె
మేలురకపు మరతుపాకు లెన్నో – వేలకు పిస్తోళ్ళు
వ్రేలిమీద లెక్కింపదగిన యా – వీరుల నెదరింప
ఘూర్కాసేనలు తెల్లసైనికుల – గుఱ్ఱపు దళములను
కర్కశహృదయులు కదిపి రదెంతటి – ఘనమో మగతనమొ

రాత్రింబవళ్ళు రైలు బండ్లురా – తంధానా తంధాన తందన
రణగొణ ధ్వనులతొ రణరంగమునకు ”
వందల సైనిక మందల దెచ్చెను ”
మారణ యంత్రాల్ మందుగుండ్లు రా ”
మందుల సీసాల్ వందల డేరాల్ ”
తినుబండారపు దినుసుల సంచులు ”
దించి మన్యమును నించిరి ముంచిరి ”
మరల ప్రపంచపు యుద్ధమొచ్చెనని – మనకనిపించింది

వ॥ ఈ విధంగా సైనికదళాలను తెచ్చి మన్యంలో చెట్టుచెట్టుకూ పుట్టపుట్టకూ సందులేకుండా దించింది. పరివార సమేతుడైన రాజు అప్పుడొక కొండమీద ఉన్నాడు.

సలసల రక్తము కాగి పొంగ నరి – బలముల గని రాజు
ప్రళయకాల మధ్యాహ్నపు సూర్యుని – వలె కడు రౌద్రమున

వ॥ తన సైనికుల నుద్దేశించి –

అన్నలార! వినుడో! గెరిల్ల వీ – రాభిమన్యులార!
యెన్ని దినంబులు బ్రతికిన చావని – దెవ్వ రనఘులార
యీ రంగంబున విజయము లేదా – వీరస్వర్గముంది
పోరాటంబున వీరు లాంధ్రులను – పేరు నిల్పవలయు
అనుచు రాజు విభజించె వారి నపు – డైదు దళంబులుగ
ఘను డభేద్య వ్యూహంబు రచించె న – గంబున చిత్రముగ

భళాభళానోయి తమ్ముడా – సై – భాయి భళానోయి దాదానా
అరిబలంబు లది చూచెను ॥ సై ॥
మరతుపాకులను గాల్చెను ॥ సై ॥
మరఫిరంగులే మ్రోగెరా ॥ సై ॥
నుగ్గునుగ్గగా కొండను ॥ సై ॥
ముగ్గుజేయుచున్నారయ్యా ॥భళా॥

వ॥ అప్పుడు సీతారామరాజు –

మెరపు తీగవలె నంతట దానై – తిరుగుచు నుగ్రుండై
పురి కొల్పుచు తనవారి రంగమున – కురిపించెను తెగువ
సింహనాదములు సేయుచు వీరులు – చెంచులు కోయలుర
సింహపు పిల్లలు యేన్గుల పుఱ్ఱెల – ఛేదించిన రీతి
కీకారణ్యంబున దావానల – కీలల చందమున
ఏకలవ్యవంశస్థుల గురి మీ – రిదే చూడుడనుచు
వీరవిహారము సేయసాగి రరి –వీరులు పొగడంగ
వైరుల శిరములు బంతులవలె తెగ – వైచిరి రంగమున
వందలు వేలు గెరిల్లాలను భ్రమ – వైరికి గలిగింప
క్రిందికి పై కెగబ్రాకుచు వైరుల – క్రింద మీదు జేసి
బండల దొర్లించుచు నా మూకను – పడగూల్చుచు భువికి
ఖండన భూమి విహారము సల్పిరి – కొండయంత తామై
నిలచుచు నక్కుచు ఉరుకుచు దూకుచు – తలపడి పోరుచును
కలకపరిచి పగలంతా సేనల – నిలిపివేసిరండి.

వ॥ చీకటిపడింది. బ్రిటిషు సైనికులు అలసిపోయినారు. ఆ జీతగాళ్ళు విశ్రాంతి తీసుకోవాలనుకొంటున్నారు. పగటి యుద్ధములో గాయపడిన గెరిల్లాలను విప్లవ కారులు ఒక చోటికి పోగుచేసినారు. వారి బాధలు చూచినప్పుడూ, మరణించిన గెరిల్లాయోధుల స్వాతంత్ర్య కాంక్షను తలచినపుడూ ఆ విప్లవ వీరులకు విశ్రాంతిమీద మనసేలేదు. గాయపడిన వారికి తొందరగా చికిత్స చెయ్యాలి. కాని కొండ చుట్టు శత్రుసేనలు క్రిక్కిరిసి ముట్టడించే వున్నాయి. ఆవలికి మార్గంలేదు. ఇక్కడ మందు లేదు. వెంటనే కొందరు గాయపడిన వీరుల నెత్తుకొన్నారు. తక్కినవారు తమ చేతుల్లో తుపాకు లెత్తారు.

అమాంతంగ గర్జించుచు సింగము – లట్ల వైరిపైన
దుమికి తుపాకుల గాల్చుచు వ్యూహము తుత్తునియలు జేసి

శ్రేణులుదీరిన శాత్రవసేనల – జీల్చి గండికొట్టి
క్షణములోన నదృశ్యులైరి – యాశ్చర్యపడగ రిపులు

–: గెరిల్లాయుద్ధములో ఆరితేరిన రామరాజును జయింపలేక, తెల్లసైన్యము "మార్షల్లా" అమలు చేసి మన్యం ప్రజలపై అతిక్రూరముగా దాడిచేయుట :–

వ॥ ఈ విధంగా బాహాటంగా యుద్ధాల్తో మాత్రం యీ విప్లవాన్ని అణచివేయలేమని ప్రభుత్వం నిశ్చయించుకొంది. ఇక ప్రజల మీదే దాడిచేయ దలచింది. ప్రజలను బాధించాలంటే వొక శాసనంగావలె. దానిపేరు 'మార్షల్లా'. ఈ కఠిన శాసనాన్ని ప్రయోగించి –

అట్టహాసముగ ప్రభుత్వ సైనికు–లర్ధరాత్రివేళ
ముట్టడించి ఒక పల్లెను దానికి – పెట్టి రగ్ని వారు
నాలుగుమూలల మంటలల్లుకొని – కాలసాగె నూరు
గోలగోలగా లేచిన ప్రజలా – కొంపలన్ని వదలి
కట్టుపుట్టములతో బైటికి రా–కనుగొని సైనికులు
ముట్టడించి ప్రజలందరి నొకచో – బెట్టి మందగట్టి

వ॥ ఏమంటున్నారు?

ఆ జగజెట్టిని రాజును జూపిన – తంధానా తంధాన తందన
బహుమానముగా పదివేలిత్తుము ”
గాముసోదరుల గట్టి తెచ్చితిరొ ”
భూములిచ్చెదము పోషించెదమూ ”
విప్లవనాయక వీరుల పదుగుర వేగమె చూపండి॥

అట్లుకాద మీ కవస్థతప్పదు – తంధానా తంధాన తందన
అనుచు వార లపు డాజ్ఞాపించిన ”
మాటాడడు యే మన్యవాసియూ ”
మాటాడరయని మండి సైనికులు ”
పగబట్టిన యా పాములరీతిగ ”

పట్టి పురుషులను కట్టిరి చెట్లకు ”
చిమ్మిగొట్ట నెత్తురు కొరడాలతో–చెండివేసినారు ॥

వ॥ ఇంకా ఆ నీచుడైన సైన్యాధిపతికి తృప్తితీరలేదు. పురుషులను కొట్టినా లాభం లేదనుకొన్నాడు. ఈ హింసా కాండను చూడలేక వలవల యేడుస్తూవున్న స్త్రీలను భయపెట్టి చూద్దామనుకున్నాడు. కోరచూపులు చూస్తూ ఆ తల్లుల దగ్గరకు నడిచాడు. ఈ వికృతాకారాన్ని చూచి...

గోలగ యేడ్చెడి నాల్గేడుల తన – బాలకు నెత్తుకొని
లాలించెడి యొక చెంచుకాంత నా – కూళుడట్టె జూచి
పరుగున జని యాతల్లి చంకలో – బాలుని లాగుకొని
గిరగిర ద్రిప్పుచు నాపసిగందును – క్రిందుమీదు జేసి
బంతివోలె పై కెగర వేయుచూ – పట్టుకొనుచు నట్లె
హంతకుడా మానవపిశాచి యా – టాడసాగినాడు
పాలబుగ్గలా బంగరు బిడ్డడు – తంధానా తంధాన తందన
భయమున గడగడ వణకుచు బాబా – ”
గద్దతన్నినా కోడిపిల్లవలె ”
గిలగిలలాడుచు కెవ్వున నేడ్చుచు ”
అమ్మా అమ్మా అమ్మాయని అల్లాడసాగెనండి॥
అమ్మకడుపు చెరువై విలపించు – హస్తము లెత్తుకొని
అమ్మయ్యో నా బిడ్డాయని సుతు – నందుకొనం దలచి
తెలియరు విప్లవకారు లెవ్వరో – తెలియదు నాకనుచు
వలవలయేడ్చుచు పుత్రుని యిమ్మని – బ్రతిమాలగ సాగె

వ॥ ఏడ్చె ఆ బిడ్డ పాదాలు తన చేతులతో బట్టుకొని, ఆ పాషాణ హృదయుడు తల్లక్రిందులుగా బిడ్డ చేతులను తల్లికందించి, పాదాలను విడిచిపెట్టకుండా

క్రూరుడు తన పిడికత్తి బాలకుని – గుండెలోన గుచ్చి
దూరముగా నా శిశువు శవంబును – పారవేసె ఖలుడు

వ॥ పాప మా తల్లి కొడుకుమీదపడి –

తలనరికిన ఒక పక్షి చందమున – గిలగిల కొట్టుకొని
తలను బాదుకొని దొరలి దొరలి యా – తల్లి ఏడ్వసాగె
అయ్యో కొడుకా పోయితివా! న –న్నన్యాయము జేసి
అయ్యయ్యో! నాయాశలన్ని యడి – యాశలాయె కొడుక
నిన్ను జూచుకొని మరచినాను నే – నన్నికష్టములను
అన్నెము పున్నె మెరుంగని నిన్నీ –యధములు చంపారు
అమ్మలార! ఓ యన్నలార! యీ – యన్యాయము గనుడు
ఇమ్మెయి మీ రెందైన జూచితిర – ఇంత ఘోరకృత్యం
ఈ విధమగు హింసల నో! యముడా! – నీవు చూచినావ?
దేవుడ, నీవే వుంటే నిజమగు – తీర్పుజెప్పవేర?

వ॥ ఇంతలో రాజు తన విప్లవదళంతో ప్రత్యక్షమైనాడు. విప్లవకారుల్ని చూచి సైనికులు పారిపోయారు. రాజు ప్రజలను విడిచిపెట్టాడు. రాజు ప్రభుత్వ దుండగీండ్లను తరుముతున్నాడు. పారిపోయిన దుర్మార్గులు ఆ గ్రామాలలో మరింత దుష్కృత్యాలను చేస్తున్నారు. ఒక చోట తల్లుల యెదుట పిల్లలను చంపుతున్నారు. వేరొక చోట పిల్లల యెదుట తల్లులను చంపుతున్నారు. కాళ్ళూ, చేతులూ ముక్కలుగా నరికిన తరువాతగాని మనుష్యుల ప్రాణాలను తీయడం లేదు. మట్టిలో కంఠం వరకూ మనుష్యులను పాతిబెట్టించి యేనుగులతో చితుకదొక్కించి భయపెడు తున్నారు. చిత్రవధలలో నానా రకాలు! ఈ హత్యలన్నిటినీ ప్రజలు సహించలేక పోతున్నారు. రాజు ఈ ఘోరం చూచి తన సేనానాయకుల నందరినీ ఒకచోట సమావేశపరచి–

–: ప్రజలపై సైనికులు చేసే చిత్రహింసలు సహించలేక సీతారామరాజు తన గెరిల్లా నాయకులతో ఆత్మ బలిదానమునకు సిద్ధమగుట–ప్రాణాలకు తెగించి వీరు లందరును పోరుట – గంటందొర రణరంగమున కూలుట, మల్లుదొర పట్టుబడుట:–

మానవు డెవ్వడు చేయని ఘోర య–మానుషకృత్యములు
మానవ రక్తపిపాసులు నేడీ – మన్యంబున జేసి

ఈ విప్లవ మాపగ దలంచిరే – యెగ్గుసిగ్గులేక
భావి ప్రపంచము మెచ్చగ నేడే – పరాక్రమము జూపి
యే ప్రజలను కాపాడ తెగువ మన – మింత జేసినామొ
ఆ ప్రజలను రక్షింపగ మనమిపు – డాహుతి గావాలి
మన రక్తమొ, మన ప్రజల రక్తమో – దనుజుల కివ్వాలి
కనుక ప్రజాక్షేమంబునకై బలి – కావలె మనమిపుడు

వ॥ అంత సేనానాయకులు ఏమంటున్నారు –

ధీర విచారా! రామరాజ! మా – తెగువ జూడుమింక
పోరాటంబున నుగ్గుచేసి యా – వైరి మృగంబులను
అనఘా మా రక్తము దేశంబున – కభిషేకము జేసి
తెలుగుబిడ్డ లసహాయశూరులను – ఘనతను నిల్పెదము.

వ॥ విప్లవ సేనానాయకులు బలిదానానికి సిద్ధమైనారు. గాము గంటందొర నల్గురు గెరిల్లాలను తీసుకొని శత్రువుతో పోరాటానికి సిద్ధమయ్యాడు. చెట్లు దట్టముగా ఉన్న ఒక సురక్షిత స్థానంలో కూర్చొని ఉన్నారు. ఇంతలో అక్కడికి శత్రుసైన్యం వచ్చింది. యెలాఉన్నాడు గంటందొర –

శాత్రవ సేనల కనుల చూచి చి –చ్చర పిడుగై లేచి
భూతలంబు నరచేత జరచి తన – భుజముల విదళించి
కోటలవలె నిలిచిన వృక్షంబుల – మాటున నిలుచుండి
సూటిగ తుపాకిగుండ్లు ధనాధన – శూరుడు కాల్చాడు
గుండున కొక్కడు గుండె తూట్లుబడి – కూలె ధరణిపైన
చండప్రచండుడు విజృంభించెనట – క్షణమున కొకరీతి
విచ్చలవిడి నెటుజూచిన తానై – విహరించెను తెగువ
చచ్చే సేనలు చస్తూవుంటే – వచ్చి దిగేవి దిగె
అరిబలగాల తుపాకులు నిప్పులు – చెరిగి చెరిగి పోయ
పరంపరలుగా గుండ్లవర్షమును – కురిసె దొరతుపాకి

వ॥ ఈ విధంబుగా కొన్ని గంటలు శత్రుసేనల సంహరించాడు గంటందొర. ఆ

వీరుని కండగావున్న ముగ్గురు గెరిల్లాలు కూడా పడిపోయారు. తోటా లైపోయాయి. ఇది చూచి జీవంతో ఉండగానే గంటం దొరను పట్టుకుంటే పెద్ద బహుమతు లొస్తాయని శత్రువులాశించి అతనిని చుట్టు ముట్టారు. అప్పుడు గంటందొర–

చంద్రనిప్పులై మెరయగ కన్నులు – గంద్రగొడ్డలెత్తి
తుంద్రించగ వైరుల కంఠంబుల – దూకి ముందుకపుడు
పరవడిజేయుచు గంటందొర తన – పరాక్రమము జూపి
గిరగిర గిరగిర గొడ్డలి త్రిప్పుచు – తరిగెను పుర్రెలను
పొలీపొలోయని రణరంగంబున – తలపడి వైరులతో
పులియని గాండ్రించుచు నా నీచుల – పుర్రెలు తెగవేసె
జాతరకడ బలిదున్నల నరికిన – చందంబున నరికె
ఘాతకులగు నా వైరుల నెత్తురు – కాల్వలు గట్టింది

వ॥ ఈ వీరుని పరాక్రమానికి అదిరి శత్రుమూక దూరంగా పారిపోయి తుపాకులు కాల్చింది. గంటందొర ఎలా ఉన్నాడు?

శరీరమంతయు తుపాకిగుండ్లను – పరిచినట్లుగాగ
అరిభీకరు డా వీరుని నెత్తురు – వరదగ ప్రవహించె
తలచుకొనుచు రాజును గంటందొర – ధరణిపైన ఒరిగె
తెలుగుతల్లి కన్నీటి చుక్కలను – జలజల రాల్చింది

వ॥ అనేకమంది శత్రువులను హతంచేసి చివరి కా వీరుడు వీరమరణం పొందాడు. ఈ విధంగా ఉపనాయకులందరు తమతమ బాహుబలాన్ని, పరాక్రమాన్ని ప్రదర్శించి, ఒరిగిపోయారు. మల్లుదొర, అగ్గిరాజు మొదలైన కొంతమంది వీరులు హెూరాహెూరీగా పోరాడి తుదకు పట్టుబడ్డారు. రాజును పట్టియివ్వమనీ, లేదా అతని జాడనైనా చెప్పమనీ, ప్రజల్ని నీచాతినీచంగా హింసింపసాగింది పర ప్రభుత్వం. ఆ మహాత్యాగియైన రాజు –

కలియుగార్జునుడు మా గంటందొర – కదనభూమి నొరిగె
బలమున కలియుగభీముడు వీరుడు – పట్టుబడెను మల్లు

మొగ్గరమున శాత్రవ బలగాలను – నుగ్గుజేసినట్టి
అగ్గిరాజు నా వైరి పట్టె, హతు – డాయె పడా లచట
అంద జేయలే దేసాయము మా – యాంధ్ర వినాయకులు
బందిపోటు దొంగలమని పైగా – నిందమోపినారు
ప్రజావిప్లవంబని గుర్తించని – ప్రముఖు లేమియన్న
ప్రజారక్తధారలలో పెరిగిన – భావి యువకులంత
సాహసముగ బోరిన యీ వీరుల – శవసమాధిపైన
స్వాహాయని కన్నీటి చుక్కలను – జారవిడువగలరు.

–: సీతారామరాజు తనంత తానుగా తెల్లసేనలకు పట్టుబడుట – వారు అతనిని కాల్చి చంపుట :–

వ॥ తన తెలుగుదేశాన్ని తలచుకొని రాజు పరిపరివిధాల యోచించుతున్నాడు. ప్రజల ఆర్తనాదాలు రాజు చెవులబడినై. తల పై కెత్తి అటుచూచాడు. గ్రామాలు భగభగ మండిపోతున్నాయి. ఏం చేస్తున్నాడు రాజు –

భగ్గునమండుచు – దిగ్గునలేచెను – తంధానా తంధాన తందన
ప్రజలు పడెడి యా – బాధల దలచెను ”
ప్రజలు ప్రజలు నా – ప్రజలన్నాడు ”
ప్రజాద్రోహులను – పడగూల్చెదనని ”
విడచిన బాణంబోయన రివ్వున – వెడలె నుగ్రుడౌచు ॥

చెట్లను పుట్లను చేలను జూడడు–తంధానా తంధాన తందన
గట్లను వాగుల – కంపల జూడడు ”
పగతుర జూడడు – మృగముల జూడడు ”
ప్రజలారా భయ – పడకండంటూ ”
ప్రజలకు రక్షణ రక్షణయంటూ – పరుగెత్తుచునుండె ॥

ఎగరగ డొక్కలు ఎగశ్వాసలతో – తంధానా తంధాన తందన
దిగజారగ ము –చ్చెమటలు వీరుడు ”

ఖడ్గధారియై కా – రడవిని బడి ”
కన్నుల నిప్పులు – గ్రక్కుచు పోయెడి ”
ప్రజారక్షకుని – రామరాజు నా ”
దారులు గాచెడు దనుజులు నీచులు–వైరులు చూచారు ॥

అరిభీకరు డా రాజును గన్గొని – యదరి గుండె చెదరి
బిరబిర తుపాకు లెత్తి కాల్చి రా – పిరికి పందలంత
క్రూరులు గాల్చెడి గుండ్ల దెబ్బలకు – వీరుడు తట్టుకొని
వీరావేశంబున నిట్లని యా – శూరాగ్రణి పలికె
ఆంధ్రదేశమా! వందన మిదుగో – అందుకోగదమ్మ!
ఆంధ్రులార! గైకొనుడు నా విప్ల – వాభివందనములు

వ॥ అని రాజు తన మాతృదేశాన్ని తలచుకొంటూ ఉన్న సమయంలో మళ్ళీ తుపాకిగుండ్లువచ్చి తగిలాయి. అప్పుడు –

రాలిన దొక నక్షత్రంబవనికి – రామరాజు ఒరిగె
కూలీరైతుల కల్పవృక్షమట – కూలిపోయెనండి
తలచిరాజు నా మన్యసోదరులు – వలవల యేడ్చారు
జలజల కన్నీ రొలకబోసె మన – తెలుగుదేశమంత

కీర్తన

వెళ్ళిపోయావా – అన్నా!
విడిచి మమ్మందరిని – ఎచటికొ ॥ వెళ్ళి ॥
ఎన్నినోములు నోచి కన్నదొ – నిన్ను కొడుకుగ తెలుగుతల్లీ
మూడుకోట్లాంధ్రులము నిను కాపాడుకొనలేమైతి మయయో ॥ వెళ్ళి ॥
కన్ను తెరచుటలోనే ప్రజల – కష్టములు తీర్చాలనంటూ
దేశదేశాల్ తిరిగి మన్నె ని – వాసులకు తోడ్పడితివయ్యా ॥ వెళ్ళి ॥
నీచశత్రువు మన్నెసీమను – నీదురక్తం తాగినప్పుడు
పేరుగాంచిన ప్రముఖులందరు–నోరుమెదపక హాని చేసిరి ॥ వెళ్ళి ॥
ఒట్టిమాటలతో స్వరాజ్యం–ఊడిపడదోయ్ తెలుసుకోండని

తీసి దెబ్బకు దెబ్బ యాంధ్రుల-వాసి నిల్పితివయ్య రాజా ॥ వెళ్ళి ॥
ఏ స్వతంత్ర స్థాపనకు బలి -యిచ్చినావో జీవితంబును
ఆ పవిత్రాశయము దీర్చుట-కాంధ్రులము సంసిద్ధమైతిమి ॥ వెళ్ళి ॥

అన్నా! నిను మరువరు మరువరు నీ-యాంధ్రసహోదరులు
ఉన్నావో లేవో కొందురు నీ-వున్నావంటారు
లేడనువా డెవ్వడు మా హృదిలో - నీ ప్రతిబింబంబు
నేడు జ్యోతివలె ధగధగమందుచు - నిలిచియుండగానె
ధారగ నీరక్తము ప్రవహించిన - స్థలమందున మేము
వీరాగ్రేసర! ఊరుగట్టి నీ - పేరు పెట్టెదముర
విప్లవ వీరకుమారులార! ఓ - విపిన వాసులార!
విప్లవాభివందన మిదిగో మీ - విప్లవ శక్తులకు
సూర్యచంద్రు లున్నంతవరకు ఈ - చుక్క లున్నవరకు
కార్యశూరులారా మీకీర్తి - కాంత నిలచియుండు

-: ఆంధ్రవీరుల ప్రశంస :-

ఓ తెలుగు బిడ్డడా! ఓ వీరయోధుడా! లేవయ్య లేచిరావయ్యా!
బంగారు నీ తెలుగు తల్లి ॥భళిభళీ॥
పాడిపంటల పాలవెల్లి ”
వీరాధి వీరులను గన్న ”
వీరమాత యెరుంగుమన్న ”
శాలివాహను డొక్కనాడు ”
శాత్రవుల దరిమి యేలాడు ”
తెలుగువరలకీర్తి దిగ్దగంతములందు వ్యాపింపజేసి వచ్చాడు ॥ ఓ తెలుగు॥

ప్రతాపరుద్రు డలనాడు ॥భళిభళీ॥
బాహుబలమును జూపినాడు ”
రాజరాజీ తెల్గువాడు ”

రాయలీ భూమిలోవాడు ”
రతనాలు పండించినాడు ”
రణకౌశలము జూపినాడు ”
పలనాటి వీరుండు బాలచంద్రుడు మనకు వీరాభిమన్యుడైనాడు ॥ఓ తెలుగు॥

వీర వనితలు పుట్టినారు ॥భళిభళీ॥
విజయభేరిని గొట్టినారు ”
రుద్రమాంబను మరచినావ ”
రూపుమాపిం దరుల తెగువ ”
వీరబొబ్బిలి కథలు వినవ ”
వీరపూజలు చేయరావ ”
వైరిపై లంఘించి పోరె నినమొన్ననే వీరుండు శ్రీరామరాజు ॥ఓ తెలుగు॥

-: ఈనాటి ఆంధ్రుల దుస్థితిని తలచి కవి వగచుట - ప్రబోధము :-

యీనాటిగతి చూడవయ్య ॥భళిభళీ॥
ఎంత దుర్గతి పట్టెనయ్య ”
తెలుగువారము మూడుకోట్లు ”
జీవచ్ఛవంబులన యిట్లు ”
కూడుగుడ్డలు లేక మాడి చచ్చుచు తుదకు వాడవాడలు బట్టినాము
॥ఓ తెలుగు॥

కట్టు కట్టూ నడుముగట్టు ॥భళిభళీ॥
కదలి నీ తెగువ జూపెట్టు ”
పగవాని తలక్రిందుచేసి ”
తెగువ స్వాతంత్ర్యమును తెచ్చి ”
భూలోకస్వర్గాన్ని నీ తెలుగుదేశాన నెలకొల్పి జయ్‌కొట్టవోయి! ॥ఓ తెలుగు॥

అనుబంధం-1

కీ.శే. సుంకర సత్యనారాయణగారు

జననం : 23 మార్చి 1909 **మరణం: 5 సెప్టెంబరు 1975**

ప్రజారచయిత. ఈయన అనేక పాటలను, నాటకాలను రచించారు. సంచలనం సృష్టించిన "మాభూమి" నాటకం వాసిరెడ్డి భాస్కరరావుగారితో కలసి రచించారు. అనేక బుఱ్ఱకథలు, నాటకాలు వ్రాశారు.

జీవిత విశేషాలు

సుంకర సత్యనారాయణగారు కృష్ణాజిల్లా ఈడుపుగల్లు గ్రామానికి చెందినవారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రజలకు రాజకీయ సందేశాలను అందించడానికి జానపదరూపంలో జరిగే ఉద్యమనాటకాలను రచించారు. ప్రజలలో చైతన్యం కలిగించే అనేక బుఱ్ఱకథలను వ్రాశారు. వాటిలో "కష్టజీవి, అమరజీవి, రుద్రమదేవి, కందుకూరి వీరేశలింగం, మహారథికర్ణ వంటివి ముఖ్యమైనవి. అనేక కథలను కూడా వ్రాశారు. ఈయన వాసిరెడ్డి భాస్కరరావుగారితో కలసి 1945లో "ముందడుగు", 1947లో "మాభూమి" నాటకాలను రచించారు. ఈ నాటకాలలో జమీందారీ వ్యవస్థలో కులవివక్ష, హైదరాబాదు నిజాం నియంతృత్వపు పోకడలను తెలియజేశారు. వారిచ్చిన సందేశాన్ని ప్రజలకు చేరువ కావడానికి బుఱ్ఱకథల రూపంలో కూడా వ్రాశారు. వీరిద్దరూ "సుంకర-వాసిరెడ్డి" అను పేరుతో జంటకవులుగా ప్రసిద్ధికెక్కారు. వీరు తెలుగు సినిమాలకు కథలు, సంభాషణలు, పాటలు రచించారు. వీరిద్దరూ 1952లో తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో విడుదలైన "పల్లెటూరు", 1954లో "పరివర్తన" సినిమాలకు సంభాషణలు వ్రాశారు. సత్యనారాయణగారు 1956లో "ఏది నిజం" సినిమాకు కథను వ్రాశారు. 1959లో "నమ్మినబంటు" సినిమాకు కథ, సంభాషణలు వ్రాశారు.

అనుబంధం-2

పద్మశ్రీ షేక్ నాజర్‌గారు

జననం : **5 ఫిబ్రవరి 1920, పొన్నెకల్లు, గుంటూరు జిల్లా**

మరణం : **22 ఫిబ్రవరి 1997 (వయస్సు 77) అంగలూరు**

వృత్తి : **బుఱ్ఱకథా కళాకారుడు, నటుడు, ప్రజారచయిత, గాయకుడు**

తల్లిదండ్రులు : **బీబాబీ (తల్లి); షేక్ మస్తాన్ (తండ్రి)**

"బుఱ్ఱకథా పితామహుడు"గా పేరొందిన షేక్ నాజర్ బుఱ్ఱకథా కళాకారుడు, నటుడు, ప్రజారచయిత, గాయకుడు, "పద్మశ్రీ" అవార్డు గ్రహీత.

జీవిత విశేషాలు

గుంటూరుజిల్లా పొన్నెకల్లు గ్రామంలో ఒక నిరుపేద దూదేకుల ముస్లిం కుటుంబంలో 1920, ఫిబ్రవరి 5వ తేదీన బీబాబీ, షేక్ మస్తాన్ దంపతులకు జన్మించారు. నాజరు పూర్తిపేరు "షేక్ నాజరు వలి". ఆయన "కృష్ణలీలలు"లో దేవకి, "శ్రీకృష్ణతులాభారం"లో రుక్మిణి, "భక్తరామదాసు"లో ఛాందిని వంటి ఆడవేషాలు వేసి మెప్పించారు. పాఠశాలస్థాయిలో "ద్రోణ" పాత్రకు జీవంపోశారని ప్రముఖ హార్మోనిస్టు ఖాదర్ ప్రశంసించారు. ఖాదర్ ఆయనను "మురుగుళ్ళ" వద్ద సంగీతం నేర్చుకోవాలని అప్పగించారు. పేదరికంవల్ల అచట ఉండలేకపోయారు. ఆ తరువాత ఆయన "బాల మహ్మదీయ సభ" పేరిట మళ్ళీ నాటకాలాడి మంచిపేరు గడించారు. దర్జీగా మారారు. ఆర్యమత సిద్ధాంతం నచ్చి మాంసాహారం మానేశారు. "పాదుకాపట్టాభిషేకం"లో కైకేయి, "ఖిల్జీరాజ్యపతనం"లో కమలారాణి పాత్రలు పోషించారు. నాస్తికుడయ్యారు. కొమ్మినేని బసవయ్యగారి పిల్లలకు సంగీతం నేర్పటం, నాటకాలు ఆడించడం ద్వారా సంగీతగురువయ్యారు. కొండపనేని బలరామ్, వేములపల్లి శ్రీకృష్ణ నాజర్‌ను గుంటూరు తీసుకువచ్చి అతనికి బుఱ్ఱకథ నేర్పిస్తే ప్రచారానికి బావుంటుందని నిర్ణయించారు. వేపూరి రామకోటి కథకుడు, నాజర్ హాస్యం, ముక్కామల పురుషోత్తం రాజకీయ వంతలుగా దళం ఏర్పరిచారు.

బుఱ్ఱకథాపితామహుడు

ప్రాచీన జానపద కళారూపమైన బుఱ్ఱకథకు కొత్తజీవం పోసి, మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావభావాలతో ఎన్నో ప్రదర్శనలిచ్చి బుఱ్ఱకథా ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించిన బుఱ్ఱకథాపితామహుడు నాజర్, నటుడు, ప్రజారచయిత, గాయకుడు. ఆయన కాలికి గండపెండేరం తొడిగి సత్కరించినప్పుడు "ఈ గండపెండేరాలూ, ఊరేగింపులూ, సన్మానాలూ, పద్మశ్రీలూ అన్నీ కలిపి, నాకు జనం వేసే ఒక్క ఈలతో సాటికాదు" అని తన కళను ప్రజాప్రయోజనానికే అంకితం చేసిన ప్రజాకళాకారుడు నాజర్.

తెనాలిలోని బాలరత్న నాటక సమాజంలో ప్రారంభమైన నాజర్ కథాకథన ప్రస్థానం నాలుగు దశాబ్దాలు సాగింది. కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజానాట్య మండలి వేదిక ద్వారా పార్టీ సిద్ధాంతాలను కార్యక్రమాలను బుఱ్ఱకథల ద్వారా ప్రచారం చేశారు. వీరిని 1940వ దశకంలో కమ్యూనిస్టుపార్టీ నెలజీతంమీద కథలు చెప్పించి పల్లెలలో తమ పార్టీప్రచారానికి ఉపయోగించుకున్నది. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలియుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్‌కరువు మొదలగు ఇతివృత్తాలలో సమకాలీన రాజకీయాలు జోడించి బుఱ్ఱకథలు రూపొందించారు. బుఱ్ఱకథా పితామహుడు పద్మశ్రీ నాజర్ జీవిత చరిత్రను అంగడాల వెంకట రమణమూర్తి అనే ఆయన "పింజారీ" అనే పుస్తకంగా ప్రచురించారు. నాజర్ "పుట్టిల్లు, అగ్గిరాముడు", చిత్రాలలో బుఱ్ఱకథలు చెప్పారు. "నిలువుదోపిడి, పెత్తందార్లు" చిత్రాలకు పనిచేశారు. కొంతకాలం విరసం సభ్యుడుగా ఉన్నారు.

కళాప్రతిభ

ప్రజాకళాకారుడుగా, బుఱ్ఱకథా పితామహుడుగా ఎదిగినవాడు. అంగాంగ విన్యాసాల ద్వారా, ఆటపాట ద్వారా జాతిని మేల్కొలిపి ఉత్తేజపరిచిన మహనీయుడు షేక్ నాజర్. "అగ్గిరాముడు, బలేబావ, నిలువుదోపిడీ, పెత్తందార్లు, మనుషులంతా ఒక్కటే" – సినిమాల్లో నాజర్ బుఱ్ఱకథలు కన్పిస్తాయి. పూలరంగడు సినిమాలో అక్కినేనికి బుఱ్ఱకథను ఎలా పాడాలో నేర్పించారు. చాలామందికి

ఈ గాంధర్వవిద్య నేర్చారు. ఆయన గళగాంభీర్యాన్ని, మాధుర్యాన్ని గమనించి, వివశులైన సినీ సంగీత దర్శకులు ఎస్. రాజేశ్వరరావుగారు సినీరంగంలో స్థిరపడమని కోరినా, ఆ లోకం తన లోకం కాదని సవినయంగా చెప్పి, జనపదమే తన పథమని బుఱ్ఱకథలు చెప్పుకుంటూ జనంతో మమేకమై, జీవితాంతం ప్రజా కళాకారుడుగా తన ప్రయాణం సాగించారు. "ఆసామీ" నాటకాన్ని రచించారు. 18వ ఆంధ్రనాటక కళాపరిషత్తు పోటీల్లో "ఆసామీ" నాటకం ప్రథమ బహుమతి పొందింది. ప్రజాఉద్యమాల్లో పాల్గొని నాజర్ ఏడుసార్లు జైలుజీవితాన్ని అనుభవించారు.

రంగస్థల మహానటుడు బళ్లారి రాఘవాచార్యులు నాజరు బుఱ్ఱకథ విని అమితానందంతో బళ్లారికి ఆహ్వానించడం; మద్రాసులో ప్రదర్శన చూచిన డా.గోవిందరాజుల సుబ్బారావు నాజరుని అభినందిస్తూ కౌగిలించుకోవడం; ప్రముఖ పాత్రికేయుడు కె.ఎ. అబ్బాస్ నాజరును "ఆంధ్ర అమరషేక్" అని అభివర్ణించడం; కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నాజరు ప్రజాభాషకు ముగ్ధుడై 'నా బిడ్డడు ఎంత ఎదిగిపోయాడో' అని ఆలింగనం చేసుకోవడం; నాజరు సాధించిన కళాప్రతిభకు తిరుగులేని నిదర్శనలు. మరణించేవరకు కటిక పేదరికాన్ని అనుభవించాడు.

సత్కారాలు

- ఆంధ్రనాటక అకాడమీ 1981లో ఉత్తమ కళాకారుడు అవార్డుతో సత్కరించింది.
- 1986లో భారత ప్రభుత్వం పద్మశ్రీ బిరుదుతో నాజరును సత్కరించింది.

గ్రంథాలు

నాజర్ ఆత్మకథ "పింజారి" చిన్న గ్రంథమే అయినా, తన పుట్టుపూర్వోత్తరాలు, కుటుంబం, బంధువర్గం, వాతావరణం తాను అక్షరం ముక్కకోసం ఎన్ని కష్టాలు పడిందీ, ఆటపాట నేర్వడానికి ఎన్ని గడపలు తొక్కిందీ, అన్న ముద్దకోసం ఎన్ని తిప్పలు పడిందీ, చివరికి కమ్యూనిస్టు పార్టీ తన దిశ ఎలా మార్చిందీ, అవగాహనా క్షేత్రం ఎంతగా విశాలం చేసిందీ వివరంగా చెప్పారు. ఎవరు తనను మొదట్లో చేరదీసిందీ, అన్నం పెట్టిందీ, విద్యనేర్పిందీ, మహాపండితుల నుండి, తనకంటే

విద్యలో చిన్నవారైన వంతల నుండి తానేం నేర్చుకున్నదీ పేరు పేరునా సవినయంగా చెప్పుకున్నారు.

"జాతి జీవితం–కళాపరిణామం" అనే గ్రంథంలో నాజర్ మానవ పరిణామ క్రమం, సాంస్కృతిక చరిత్రల వెనక దాగివున్న విషయాలు వివరించారు.

ప్రముఖుల అభిప్రాయాలు

- నాటకాల్లో బుఱ్ఱకథ బ్రహ్మ నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం నా నట జీవితానికి పట్టం కట్టింది – **జమున**
- గుంటూరుకు ఎన్.టి.ఆర్. వచ్చినప్పుడు నేను మీ అభిమానిని అని నాజర్ చెపితే, 'నేను మీ ఫాన్‌ను' అని **ఎన్.టి.ఆర్.** చెప్పి అందరినీ ఆనందపరిచారు.
- నాజర్ కథ చెప్తుతుంటే శృంగారం రసరంజకంగా గిలిగింతలు పెడుతుంది. హాస్యం నవ్వుల పువ్వులను పూయిస్తుంది. వీరం మహోద్రేకంగా పరవళ్ళు తొక్కుతుంది. కరుణం కన్నీళ్లను ధారగా కురిపిస్తుంది. హరికథకు ఆదిభట్ల ఎలాంటివాడో బుఱ్ఱకథకు నాజర్ అలాంటివాడు – **ముదిగొండ శివప్రసాద్**

"దాతా భవతి వా న వా"

I. "రసగంగాధర తిలకం" (దేవరకొండ బాలగంగాధర తిలక్) అనే గ్రంథముద్రణకు ఉదారంగా విరాళాలు అందజేసిన సాహిత్య రసిక హృదయులు:-

1. "రైతు బాంధవుడు" - "అభినవ దానకర్ణుడు"
   శ్రీ పోచా బ్రహ్మానందరెడ్డిగారు, పార్లమెంటు సభ్యులు,
   నంద్యాల, కర్నూలుజిల్లా.

2. తిలక్‌గారి పిల్లలు డా॥ డి.యస్.మూర్తి–డా॥ ఎస్.
   దేవరకొండ - శ్రీమతి చంద్రలేఖ....

3. ప్రసిద్ధ వ్యవసాయశాస్త్రవేత్త డా॥ కాదరబాద్
   రవీంద్రనాథ్‌గారు, నంద్యాల, కర్నూలుజిల్లా

4. శ్రీమతి తంగిరాల సీతామహాలక్ష్మిగారు, బెంగుళూరు.

5. డా॥ రాచకొండ నరసింహశర్మగారు, ఎం.డి.
   ప్రముఖకవి, అనువాదకుడు, విశాఖపట్టణం.

6. డా॥ పి.యు.బి. శర్మగారు, సాహిత్యవేత్త,
   కాకినాడ, తూర్పుగోదావరిజిల్లా.

7. శ్రీ మల్లెబోయిన లక్ష్మీనారాయణయాదవ్‌గారు,
   హైదరాబాద్.

8. శ్రీమతి తంగిరాల జయదుర్గాభవానిగారు,
   గ్రామీణ బ్యాంకు మేనేజర్ (రి.) హైదరాబాద్

9. డా॥ వి. నారాయణప్పగారు, ఢిల్లీ విశ్వవిద్యాలయం.

10. డా॥ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావుగారు,
    ప్రసిద్ధ విమర్శకులు, కవి, వక్త, రాజమండ్రి

11. శ్రీమతి అంబికా అనంత్‌గారు, ద్విభాషా కవయిత్రి,
    అనువాదకురాలు, పాత్రికేయురాలు, బెంగుళూరు.

12. శ్రీ ఈవని సత్యనారాయణమూర్తి ("జుజ్జు")గారు
    తిలక్‌గారి మేనల్లుడు, హైదరాబాద్.

12. శ్రీ మల్లాది సాకేత్ కుమార్‌గారు, నూజివీడు, కృష్ణాజిల్లా
13. ప్రముఖకవి డా॥ గుంటూరు శేషేంద్రశర్మగారి స్మారకంగా వారి పెద్దకొడుకు డా॥ గుంటూరు వనమాలిగారు(జర్మనీ)
14. శ్రీ ఖండాపు మన్మథరావుగారు, విజయవాడ
15. డా॥ వత్సవాయి వెంకటరాజుగారు, తణుకు, పశ్చిమగోదావరిజిల్లా
16. డా॥ గన్నమరాజు గిరిజామనోహరబాబుగారు, విమర్శకులు, వక్త, "సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ", వరంగల్లు.
16. శ్రీ తంగిరాల పాలగోపాలకృష్ణగారు, సంయుక్త కార్యదర్శి, శ్రీ నన్నయభట్టారక పీఠం, తణుకు, పశ్చిమగోదావరిజిల్లా.
18. డా॥ ఇప్పగుంట మాధవరావుగారు, కందుకూరు ప్రకాశంజిల్లా.
19. శ్రీ వి.వి.ఆర్.ఎస్.ఎస్. శర్మగారు, ధవళేశ్వరం, రాజమండ్రి, తూర్పుగోదావరిజిల్లా
20. శ్రీ ఎం.ఎస్. రామస్వామిరెడ్డిగారు, హెూసూరు, తమిళనాడు.
21. ఆచార్య బిట్టు వెంకటేశ్వర్లుగారు, హైదరాబాద్
22. శ్రీ పావళ్ళ మహేష్‌గారు, "ప్రజాశక్తి" విలేఖకుడు పెదచెర్లోపల్లి, ప్రకాశంజిల్లా.
23. శ్రీ రేకపల్లి ప్రసాద్‌గారు, **SBI** మేనేజరు (రి), తణుకు, పశ్చిమ గోదావరిజిల్లా.

II. విరాళాలు ఇస్తామని వాగ్దానం చేసినవారు :-

1. డా॥ సనపల ఢిల్లీశ్వరరావుగారు, సీతంపేట, శ్రీకాకుళంజిల్లా.
2. శ్రీ కొప్పర్తి వెంకట రమణమూర్తిగారు, తణుకు, పశ్చిమగోదావరిజిల్లా.
3. డా॥ నాగమ్మగారి భీమన్నగారు, తిరుపతి, చిత్తూరుజిల్లా.
4. డా॥ నిర్మలా పళనివేలుగారు, చెన్నై.
5. ఆచార్య పగడాల చంద్రశేఖర్‌గారు, హైదరాబాద్.



'పలనాటి కృష్ణుడు' బ్రహ్మనాయడు
చిత్రకారుడు : శ్రీ రాయన గిరిధర్ గౌడ్



'నాయకురాలు' నాగమ్మ
చిత్రకారుడు : శ్రీ రాయన గిరిధర్ గౌడ్



‘లడాయి స్తంభము’–బొబ్బిలి యుద్ధము జరిగిన ప్రదేశము
(క్రీ.శ. 1757, జనవరి 24వ తేది, శుక్రవారము)



'బొబ్బిలిపులి' తాండ్ర పాపారాయడు విజయరామరాజును చంపుట;
చిత్రకారుడు : కళాప్రపూర్ణ 'బాపు'



విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజుగారు

జననం: **1897** జూలై **4**వ తేది :: వీరమరణం: **1924** మే **7**వ తేది




అల్లూరి సీతారామరాజుగారు తన అనుచరులతో
రహస్య సమావేశములు జరిపిన "గాడిగుమ్మి జలపాతం"



1967 నాటికి సజీవుడైయున్న అల్లూరి ముఖ్య అనుచరుడు
శ్రీ గాము మల్లుదొరగారు, మాజీ పార్లమెంటు సభ్యులు
(ఫోటో: కర్నల్ తంగిరాల కృష్ణమూర్తిగారు)



అల్లూరి ముఖ్య అనుచరుడు గాము గంటందొర – అల్లూరి సీతారామరాజుగారల భౌతిక దేహముల దహన పవిత్ర క్షేత్రము, కృష్ణదేవిపేట, విశాఖజిల్లా (ఫోటో: కర్నల్ తంగిరాల కృష్ణమూర్తిగారు, 1967)




అల్లూరి దాడిచేసిన రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్



అల్లూరి చేతిలో చనిపోయిన బ్రిటీషు గెరిల్లా యోధులు కెప్టెన్ హైవర్ట్, కెప్టెన్ కవర్ట్‌ల సమాధులు, కృష్ణదేవిపేట, విశాఖజిల్లా



రూథర్ ఫర్డ్ కార్యాలయం, కృష్ణదేవిపేట, విశాఖజిల్లా



అల్లూరి సీతారామరాజుగారి దస్తూరీ

దాతలు




శ్రీ రావూరి మృత్యుంజయరావుగారు

రిటైర్డ్ ప్రిన్సిపాల్, పాలంగి – తణుకు



ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు

ప్రముఖ పరిశోధకులు, బెంగుళూరు



అల్లూరి సీతారామరాజుగారి ఫోటోలు సేకరించి పంపిన మిత్రులు

శ్రీ రుద్రరాజు వెంకట సూర్యనారాయణరాజుగారు

గణపవరం, పశ్చిమగోదావరిజిల్లా



ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లుగారు
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి



తంగిరాల సోదరులు శ్రీయుతులు :

సోమయాజులు – సుబ్బారావు – భాస్కరరావు – కృష్ణమూర్తి



"రావినూతల" సోదరీమణులతో ఆచార్య తంగిరాల



శ్రీమతి లలిత - డా॥ పి. హెచ్. ప్రసాద్ దంపతులు



డా॥ ఇప్పగుంట మాధవరావుగారు



"భువన విజయం"లో కవయిత్రి మొల్లగా
ఆచార్య కోలవెన్ను మలయవాసినిగారు



శ్రీమతి తంగిరాల జయదుర్గాభవానిగారు



‘పలనాటి కృష్ణుడు’ బ్రహ్మనాయడు
చిత్రకారుడు : శ్రీ రాయన గిరిధర్ గౌడ్



'నాయకురాలు' నాగమ్మ
చిత్రకారుడు : శ్రీ రాయన గిరిధర్ గౌడ్



‘లడాయి స్తంభము’–బొబ్బిలి యుద్ధము జరిగిన ప్రదేశము
(క్రీ.శ. 1757, జనవరి 24వ తేది, శుక్రవారము)



'బొబ్బిలిపులి' తాండ్ర పాపారాయడు విజయరామరాజును చంపుట;
చిత్రకారుడు : కళాప్రపూర్ణ 'బాపు'




విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజుగారు
జననం: 1897 జూలై 4వ తేది :: వీరమరణం: 1924 మే 7వ తేది



అల్లూరి సీతారామరాజుగారు తన అనుచరులతో
రహస్య సమావేశములు జరిపిన "గాడిగుమ్మి జలపాతం"



1967 నాటికి సజీవుడైయున్న అల్లూరి ముఖ్య అనుచరుడు
శ్రీ గాము మల్లుదొరగారు, మాజీ పార్లమెంటు సభ్యులు
(ఫోటో: కర్నల్ తంగిరాల కృష్ణమూర్తిగారు)



అల్లూరి ముఖ్య అనుచరుడు గాము గంటందొర - అల్లూరి సీతారామరాజుగారల భౌతిక దేహముల దహన పవిత్ర క్షేత్రము, కృష్ణదేవిపేట, విశాఖజిల్లా (ఫోటో: కర్నల్ తంగిరాల కృష్ణమూర్తిగారు, 1967)




అల్లూరి దాడిచేసిన రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్



అల్లూరి చేతిలో చనిపోయిన బ్రిటీషు గెరిల్లా యోధులు కెప్టెన్ హైవర్ట్, కెప్టెన్ కవర్ట్‌ల సమాధులు, కృష్ణదేవిపేట, విశాఖజిల్లా



రూథర్ ఫర్డ్ కార్యాలయం, కృష్ణదేవిపేట, విశాఖజిల్లా



అల్లూరి సీతారామరాజుగారి దస్తూరీ

దాతలు



శ్రీ రావూరి మృత్యుంజయరావుగారు

రిటైర్డ్ ప్రిన్సిపాల్, పాలంగి – తణుకు



ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు

ప్రముఖ పరిశోధకులు, బెంగుళూరు



అల్లూరి సీతారామరాజుగారి ఫోటోలు సేకరించి పంపిన మిత్రులు
శ్రీ రుద్రరాజు వెంకట సూర్యనారాయణరాజుగారు
గణపవరం, పశ్చిమగోదావరిజిల్లా



ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లుగారు
బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, వారణాసి



తంగిరాల సోదరులు శ్రీయుతులు :

సోమయాజులు – సుబ్బారావు – భాస్కరరావు – కృష్ణమూర్తి



"రావినూతల" సోదరీమణులతో ఆచార్య తంగిరాల



శ్రీమతి లలిత – డా॥ పి. హెచ్. ప్రసాద్ దంపతులు



డా॥ ఇప్పగుంట మాధవరావుగారు



“భువన విజయం”లో కవయిత్రి మొల్లగా
అపూర్వ కోలవెన్ను మలయవాసినిగారు



శ్రీమతి తంగిరాల జయదుర్గాభవానిగారు



[illegible]
[illegible]



రక్తతిలకం (ముఖ్యమైన మూడు బుర్రకథలు)



ప్రజారచయిత, రైతుబిడ్డ

కీ॥శే॥ సుంకర సత్యనారాయణగారు

(1909-1975)